
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 135
సోమవారం 5-8-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'



ఉత్తమ చిత్రం బలగం... ఉత్తమ నటుడు నాని..

హైదరాబాద్‌లో 69వ 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ -2024' వేడుక ఘనంగా జరిగింది. టాలీవుడ్ నుంచి 'బలగం' ఉత్తమ చిత్రంగా ఎంపికవగా.. ఉత్తమ నటుడిగా నాని, ఉత్తమ నటిగా కీర్తి సురేష్, ఉత్తమ దర్శకుడిగా వేణు అవార్డులు అందుకున్నారు. 12లో



ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం

లెబనాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ 'హెజ్‌బొల్లా' ఇజ్రాయెల్‌లోని మొషావ్ బీట్ హిల్లెల్ ప్రాంతంపై రాకెట్లతో దాడి చేసింది.
వివరాలు 6లో ▸



బంగ్లాలో మళ్లీ ఘర్షణలు

బంగ్లాదేశ్ ప్రధాని హసీనా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో విద్యార్థులు చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారింది.
వివరాలు 6లో ▸

గాడి తప్పిన వర్సిటీలు..!

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో పడిపోతున్న విద్యా ప్రమాణాలు

- 70 శాతం బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీయే
- భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- నెలల తరబడి వీసీల నియామకాలకే దిక్కులేదు
- బోధన, బోధనేతర సిబ్బంది కలిపి మొత్తంగా 4,500 ఖాళీలు ఉన్నట్టు అంచనా
- కాంట్రాక్టు, తాత్కాలిక సిబ్బందితో అరకొర బోధన
- నానాటికీ పడిపోతున్న ప్రమాణాలు.. జాడే లేని పరిశోధనలు
- మౌలిక సదుపాయాలకూ కొరత.. కనీస సౌకర్యాలకూ కరువే.. యువతలో నైపుణ్యాల పెంపు కోసం 'స్కిల్స్ వర్సిటీ'కి శంకుస్థాపన చేసిన సర్కారు
- విశ్వవిద్యాలయాల దుస్థితిపై దృష్టి పెట్టాలంటున్న విద్యావేత్తలు



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నామ్‌కే వాస్తేగా మారిపోతున్నాయి. పరిశోధనల మాటేమోగానీ.. సాధారణ విద్యా ప్రమాణాలే నానాటికీ పడిపోతున్నాయి. ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిధుల కొరత, మౌలిక సదుపాయాల లేమికితోడు అధ్యాపకుల పోస్టుల్లో చాలా వరకు ఖాళీగా ఉండటంతో.. యూనివర్సిటీల్లో చదువు గతి తప్పుతోంది. విశ్వవిద్యాలయాలు ఇచ్చే సర్టిఫికెట్లతో మార్కెట్లో ఉద్యోగాలు రావడం లేదని సీఎం రేవంత్ ఇటీవల స్వయంగా పేర్కొన్నారు కూడా. ఇలాంటి సమయంలో స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం.. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలపైనా దృష్టిపెడితే బాగుంటుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

నిధులు లేక.. పట్టించుకోక..

వందేళ్లపైన చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా 'నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్)' గుర్తింపులో వెనుకబడి ఉంది. ర్యాంకు ఏటా దిగజారుతోంది. రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల పరిస్థితీ ఇదే. ఎన్నో సమస్యలున్నాయని మిగతా 2వ పేజీలో ▶

కాంట్రాక్టు లెక్చరర్లపై ఒత్తిడి..

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో 1,365 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. అదీ సరిపడా లేకపోవడంతో వారిపై విపరీతమైన పనిభారం ఉంటోంది. అసలే చాలీచాలని వేతనాలకుతోడు పనిభారం వల్ల ఇబ్బందిపడుతున్నామని కాంట్రాక్టు లెక్చరర్లు వాపోతున్నారు. తమను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వాలు ఎన్నోసార్లు హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేదని అంటున్నారు.



సాధా'రణ' బోగీ.. కిక్కిరిసి

- రెట్టింపు సంఖ్యలో రైళ్లలో ప్రయాణం
- జనరల్ బోగీల్లో నిలవడానికి కూడా స్థలం కరువే
- వాష్‌రూమ్, లగేజీ బెర్త్, ఫుట్‌బోర్డు ఏదీ వదలని వైనం
- ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలో సాధారణ బోగీలకు భారీ డిమాండ్
- దశాబ్దాలుగా పెరగని బోగీలు.. తగ్గిన ప్యాసింజర్ రైళ్లు

- వివరాలు 16లో

నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

- నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్టు.. మధ్యాహ్నం 12 గంటలకు గేట్లు తెరవనున్న అధికారులు
- సాగర్‌లోకి 3.22 లక్షల క్యూసెక్కుల వరద...576.1 అడుగుల వద్ద 271.9 టీఎంసీల నిల్వ

5లో

న్యూయార్క్ విమానాశ్రయంలో సీఎం రేవంత్, సీఎస్ శాంతికుమారి తదితరులు



అమెరికాలో సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా అమెరికా పర్యటనకు బయల్దేరి వెళ్లిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమెరికా కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం న్యూయార్క్ విమానాశ్రయంలో దిగారు. అక్కడ ఆయనకు ప్రవాస తెలంగాణీయులు ఘన స్వాగతం పలికారు. సీఎంతోపాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు అమెరికా చేరుకున్నారు.



'దస్'కా దమ్

సెమీఫైనల్లో భారత హాకీ జట్టు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో నిలిచింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 'షూటౌట్'లో 4–2తో బ్రిటన్ జట్టును ఓడించింది. నిర్ణీత సమయం వరకు రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. ఈ మ్యాచ్‌లోని 17వ నిమిషంలో భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్‌కు అంపైర్ రెడ్ కార్డు చూపెట్టి మైదానం బయటకు పంపించారు. దాంతో చివరి 43 నిమిషాలు భారత జట్టు 10 మంది ఆటగాళ్లతోనే ఆడి బ్రిటన్‌ను నిలువరించింది.

-వివరాలు 13లో

ఇవాంజెరీ



ఇక్కడికి తేవడం కుదరదంటే మనమే అక్కడికి వెళితే బెటర్!

గల్లీ గల్లీలో గంజాయి!

రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగం

- స్కూళ్లు, కాలేజీలకూ విస్తరించిన మహమ్మారి
- సోషల్ మీడియా ద్వారా కూడా విక్రయాలు
- ఎక్కువగా బానిసలవుతున్నది యువకులు, విద్యార్థులే.. గత నెలలో పదుల సంఖ్యలో విద్యార్థులను పట్టుకున్న అధికారులు
- గంజాయి మత్తులో హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్న వైనం.. దీని నియంత్రణపై సర్కారు ఫోకస్ చేయాలంటున్న సామాజికవేత్తలు

2లో



క్లుప్తంగా...

వయనాడ్ విషాదాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కేరళ వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన విషాదాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్రం ఆదుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. దీనిని కేవలం ఓ రాష్ట్ర సమస్యగా పరిగణిస్తే జాతి క్షమించదని ఆది వారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. దక్షిణాదిలో ఇటువంటి ఘటన గతంలో ఎప్పుడూ చోటు చేసుకోలేదన్నారు. 350 మందికి పైగా దుర్మరణం పాలైన వయనాడ్ విలయాన్ని కేంద్రం రాజకీయ కోణంలో కాకుండా, మానవతా దృక్పథంతో చూడాలని సూచించారు. అతి భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్‌తో కొండచరియలు విరిగిపడటం, వర్షపు నీటితో బురద కలిసి ప్రవహించే సందర్భాల్లో ముందస్తు హెచ్చరికలకు సంబంధించి ఒక మాన్యువల్ రూపొందించాలని ఆయన కోరారు. ఉపగ్రహాల చిత్రాల ద్వారా కచ్చితత్వంతో కూడిన హెచ్చరికలను జారీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. భూకంప ప్రాంతాలను జోన్లుగా విభజించినట్టే కొండ చరియలు కుప్పకూలే అవకాశాలున్న ప్రదేశాలను కేటగిరీల వారీగా గుర్తించాలని కోరారు.

'బలగం' వేణుకు కేటీఆర్ అభినందనలు



సాక్షి, హైదరాబాద్: ఫిలింఫేర్ అవార్డుల్లో బలగం సినిమాకు ఉత్తమ చిత్రం అవార్డుతోపాటు ఆ సినిమా దర్శకుడు వేణు యెల్దండికి ఉత్తమ దర్శకుడు అవార్డు దక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. బలగం చిత్ర దర్శకుడు, నటుడు వేణుకు, సినిమా బృందానికి కేటీఆర్ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తన నియోజకవర్గానికి చెందిన కార్మిక కుటుంబానికి చెందిన వేణు యెల్దండి కష్టపడి, అంచెలంచెలుగా ఎదిగి గొప్ప సినిమా తీసినందుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ సినిమా తీసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ అవార్డులు వేణుతో పాటు అతని బృందం పడిన కష్టానికి దక్కిన ఫలితంగా కేటీఆర్ పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం విచారించనుంది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో లోపాలున్నాయని దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించనున్నారు. తిహార్ జైలులో ఉన్న కవితను బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ములాఖత్ కానున్నారు. అనారోగ్యానికి గురై వైద్య పరీక్షలు చేయించుకున్న కవిత తాజా ఆరోగ్య పరిస్థితిపై చర్చించనున్నారు. అదే సమయంలో కవిత బెయిల్‌పై వారిద్దరూ న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

చేపపిల్లలకు బదులు నగదు ఇవ్వండి

సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మత్స్యకారులకు చేపపిల్లలకు బదులుగా వాటి విలువ మేరకు నగదు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో చేపపిల్లల పెంపకం కోసం ఉచితంగా చేపపిల్లలను మత్స్యసొసైటీలకు ఇచ్చేందుకు రూ.100 కోట్లతో ఆగస్టులో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ల వ్యవస్థలో ఎవరైనా తమ లాభం చూసుకునే ప్రభుత్వానికి చేపపిల్లలు పంపిణీ చేస్తారు. అలా కాకుండా చెరువుల్లో నీటి నిల్వ, విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు మత్స్యసొసైటీలకు నగదు రూపంలో సాయం చేస్తే సదరు సొసైటీలే నాణ్యమైన చేపపిల్లలను సమకూర్చుకుంటాయి. ఈ మేరకు చర్యలు తీసుకోండి.' అని లేఖలో కోరారు.

వక్ఫ్ ఆస్తులు లాక్కునే కుట్ర: అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను లాక్కునే కుట్ర చేస్తోందని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు స్వయంప్రతిపత్తిని హరించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, అందులో భాగమే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు అని మండిపడ్డారు. కేంద్ర కేబినెట్ భేటీలో 40 సవరణలను ప్రతిపాదించిందని, అందులోని వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు బిల్లుపై లీకులిచ్చి కేంద్రం సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు.

గల్లీ గల్లీలో గంజాయి!



రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదక ద్రవ్య వినియోగం

- స్కూళ్లు, కాలేజీలకూ విస్తరించిన మహమ్మారి
- సోషల్ మీడియా ద్వారా కూడా విక్రయాలు
- ఎక్కువగా బానిసలు అవుతున్నది యువకులు, విద్యార్థులే..
- గత నెలలో పదుల సంఖ్యలో విద్యార్థులను పట్టుకున్న అధికారులు
- గంజాయి మత్తులో హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్న వైనం

దీని నియంత్రణపై సర్కారు ఫోకస్ చేయాలంటున్న సామాజికవేత్తలు



సాక్షి, హైదరాబాద్: సింబయోసిస్ కాలేజీలో 25 మంది..
గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో 15 మంది..
ఉస్మానియా ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు ఆరుగురు..
జోగిపేట జేఎన్టీయూలోని విద్యార్థులు ముగ్గురు..

.. ఇదేదో మెడల్స్ గెల్చుకున్న వారి జాబితా కాదు.. గంజాయికి అలవాటు పడి గత నెలలో 'యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఏఎన్‌బీ)' అధికారులకు పట్టుబడినవారి జాబితా. ఇంకా ఇలాంటి ఘటనలు మరెన్నో. ధర తక్కువ, లభ్యత ఎక్కువ అన్నట్టుగా గంజాయి విక్రయాలు సాగుతుండటంతో.. యువత, విద్యార్థులు దానికి బానిసలుగా మారుతున్నారు. ఈ ఏడాది జనవరి–జూన్ మధ్య డ్రగ్స్‌కు సంబంధించి రాష్ట్రంలో 938 కేసులు నమోదుకాగా.. 1,921 మంది అరెస్టయ్యారు. ఇందులో 816 కేసులు (86.99 శాతం), 1,649 మంది (85.84 శాతం) గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించినవే కావడం గమనార్హం. కేంద్రం ఆధీనంలో పనిచేసే నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) కూడా గంజాయి అక్రమ రవాణాపై దృష్టి పెడుతున్నాయంటే.. పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

వివిధ రూపాల్లో వాడుతూ..

రాష్ట్రంలో గంజాయికి అలవాటుపడ్డ వారిలో చాలా మంది నేరుగా వాడుతుండగా.. కొందరు మాత్రం దీని అనుబంధ ఉత్పత్తులైన చరస్, హషీష్ ఆయిల్, బంగ్ తదితర రూపాలను వినియోగిస్తున్నారు. సాధారణంగా యువత హైస్కూల్, జూనియర్ కాలేజీ స్థాయిలో తొలుత సిగరెట్‌కు అలవాటు పడుతున్నారు. తర్వాత సొంతంగానో, స్నేహితుల ద్వారానో గంజాయికి అలవాటు పడుతున్నారు. గంజాయి విక్రయదారులు.. వాట్సాప్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌ల ద్వారా అమ్ముతుండటంతో సులభంగా దొరుకుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గంజాయి నియంత్రణపై మరింత ఫోకస్ చేయాలని సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ఒడిశా నుంచి రాష్ట్రంలోకి..

గంజాయి ఎక్కువగా ఒడిశాలో సాగవుతోంది. అక్కడ నుంచి ఛత్తీస్‌గఢ్, ఖమ్మం జిల్లా మీదుగా రాష్ట్రంలోకి వస్తోంది. కొన్నిసార్లు ఆంధ్రా–ఒడిశా బోర్డర్ నుంచి ఏపీలోని కొన్ని ప్రాంతాలను దాటుకుని ఇక్కడికి తెస్తున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాహనాలు, ఆర్టీసీ/ప్రైవేట్ బస్సులతోపాటు రైళ్లల్లోనూ గంజాయి హైదరాబాద్‌కు చేరుతోంది. గాంజాతోపాటు పాట్, హష్, స్టఫ్, స్టాష్.. ఇలా పలు ప్రత్యేక పదాలతో దీని విక్రయాలు జరుగుతున్నాయి. కొకైన్, హెరాయిన్, ఎల్‌ఎస్‌డీ వంటి డ్రగ్స్ ఒక గ్రాముకు లేదా ఒక డోసుకు రూ.2 వేల నుంచి రూ.8 వేల వరకు కావాలి. అదే గంజాయి రూ.500 నుంచి రూ.1,000 వరకు వెచ్చిస్తే 100 గ్రాములు దొరుకుతోంది. పైగా దీన్ని సిగరెట్ స్ట్రిప్‌లలో పెట్టుకుని బహిరంగంగా కాల్చే అవకాశం ఉండటంతో.. చాలా మంది గంజాయికి అలవాటు పడుతున్నారు. ఇక ధనికవర్గాలకు చెందినవారు హిమాచల్ ప్రదేశ్‌లోని కస్సోల్ ప్రాంతం నుంచి వచ్చే ఖరీదైన ప్రత్యేక గంజాయిని వినియోగిస్తున్నట్టు పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఒడిశా నుంచి వచ్చే గంజాయిలోనూ శీలావతి, గ్రీన్ రకాలకు డిమాండ్, రేటు ఎక్కువగా ఉంటుందని అంటున్నాయి.

ప్రాణాలు తీస్తున్న 'గంజా'మత్తు!

- హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీకి చెందిన పి.రాజు గంజాయికి బానిసయ్యాడు. ఆ మత్తులోనే తన ఇంటి సమీపంలో నివసించే ఆరేళ్ల చిన్నారిని తన గదిలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. చిన్నారి చనిపోవడంతో మృతదేహాన్ని ఇంట్లోనే వదిలి పరారయ్యాడు. రాజు కోసం పోలీసుల గాలింపు చేపట్టడంతో.. వరంగల్ జిల్లాలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఖమ్మంలోని రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన ఉదయ్‌కుమార్ తన అమ్మమ్మ రాంబాయమ్మ దగ్గర ఉంటున్నాడు. పదో తరగతి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన ఉదయ్.. డిప్లొమాలో చేరాక గంజాయికి అలవాటుపడ్డాడు. గంజాయి కోసం డబ్బులు కావాలని అమ్మమ్మపై ఒత్తిడి చేశాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఓ రోజు రాత్రి 11.30 గంటలకు హత్య చేశాడు.
- నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన నవీన్ గంజాయి మత్తులో ఓ వ్యక్తిపై గొడలితో దాడి చేసి చంపేశాడు. బెయిల్ వచ్చాక గంజాయి మత్తులో గ్రామస్తులతో ఘర్షణకు దిగడంతో మళ్లీ జైలుకు వెళ్లాడు. గ్రామంలో మంచి పేరున్న వ్యవసాయ కుటుంబానికి చెందిన నవీన్ గంజాయికి బానిసగా మారడంతో.. ఆ ప్రభావం కుటుంబానికి చెందినవారందరిపై పడింది.
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దంపతులు పనిచేస్తున్నారు. పక్కన మరో మిల్లులో హమాలీగా పనిచేస్తున్నా బీహార్ వలస కూలీ వినోద్ మాఝీ గంజాయి మత్తులో.. ఆ దంపతుల ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, చంపేశాడు.
- మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని గోపాల్‌రావుపేటకు చెందిన సురేశ్ పద్దెనిమిదేళ్ల వయసులోనే గంజాయికి బానిసయ్యాడు. మితిమీరి గంజాయి తీసుకోవడంతో చనిపోయాడు.

రాష్ట్రంలో గత ఆరు నెలల్లో 'డ్రగ్స్' పరిస్థితి ఇదీ..

నమోదైన కేసులు	: 938
అరెస్టైన నిందితులు	: 1,921 మంది
పట్టుబడ్డ మాదకద్రవ్యాల విలువ	: రూ.84.3 కోట్లు
జప్తు చేసిన నిందితుల ఆస్తులు	: రూ.47.16 కోట్లు

వెంటనే బానిసలవుతారు

మద్యం తాగేవాళ్లు కనీసం ఓ ఏడాది నుంచి గరిష్టంగా పదేళ్లపాటు తాగుతూ ఉంటేనే.. దానికి బానిసలుగా మారుతారు. అదే గంజాయి విషయంలో కొన్నిరోజుల్లోనే బానిసలవుతారు. గంజాయి తీసుకున్న వ్యక్తులు మానసికంగా కృత్రిమ ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్‌కు గురవుతారు. కానీ దీని వినియోగం పెరిగిపోతే.. సైకోసిస్ సహా అనేక మానసిక రుగ్మతలు వస్తాయి. కొందరు హింసాత్మకంగా, విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తుంటారు. ఈ కారణంగానే అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి.

– ప్రతాప్ రాజన్, క్లినికల్ సైకాలజిస్ట్

హైదరాబాద్‌లో పట్టుబడిన మాదకద్రవ్యాలు ఇవీ..

మాదకద్రవ్యం	2021లో..	2022లో..	2023లో..
గంజాయి (కేజీలు)	2,084	830.12	1,874.79
చరస్ (గ్రాములు)	200	355.7	20
కొకైన్ (గ్రాములు)	34	126.64	14.28
హెరాయిన్ (గ్రాములు)	120	295	8.56
ఓపియం (గ్రాములు)	0.25	0	1,400
ఎండీఎంఏ (గ్రాములు)	41	231.02	1,125.03
కేటమైన్ (గ్రాములు)	0	0	48.84
ఎల్ఎస్‌డీ (బోల్ట్స్)	10	262	6
ఇతర డ్రగ్స్ (గ్రాములు)	48	3,190	19,924
హష్ ఆయిల్ (ఎంఎల్)	5,348	13,843	4,135
నమోదైన కేసులు	274	306	243
అరెస్టు అయిన వారి సంఖ్య	723	1,205	740
వీరిలో భారతీయులు	718	1,192	727
విదేశీయులు	5	13	13

పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దుతాం

గత ప్రభుత్వ హయాంలో పర్యాటకం నిర్లక్ష్యం: మంత్రి జూపల్లి



వనపర్తి జిల్లా సరళాసాగర్ ప్రాజెక్టు వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల బృందం

దేవరకద్ర: రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని ప్రపంచస్థాయి పర్యాటక ప్రాంతాలుగా మారుస్తామని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం స్టడీ టూర్‌లో భాగంగా ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్, సరళాసాగర్ ప్రాజెక్టులతోపాటు కురుమూర్తి స్వామి ఆలయాన్ని మంత్రితోపాటు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణలో ప్రపంచస్థాయి పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని, వాటిని జాతీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని 33 జిల్లాలను పర్యటించి ఆయా ప్రాంతాలను గుర్తిస్తామని చెప్పారు. ప్రతి నెలా ఒక రోజు కేటాయించి ఉమ్మడి జిల్లాలకు వెళ్లి అక్కడి ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలపై చర్చించి ప్రాముఖ్యత గల ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించి టూరిజంను అభివృద్ధి పరుస్తామన్నారు. అందులో భాగంగానే దేవరకద్ర నియోజకవర్గంలో టెంపుల్ టూరిజం కింద కురుమూర్తిస్వామి ఆలయాన్ని సందర్శించామని చెప్పారు. అలాగే ఆసియా ఖండంలోనే రెండో ఆటోమేటిక్ సైఫన్ సిస్టం గల సరళాసాగర్‌తోపాటు కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రస్తుతం దేవరకద్ర నియోజకవర్గంలోని కోయిల్‌సాగర్, సరళాసాగర్, కురుమూర్తి ఆలయాలకు రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, వంశీకృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావాలి

- మేం దిగ్గజ కంపెనీలతో రాష్ట్రంలో బలమైన వ్యాపారబంధాన్ని ఏర్పాటు చేశాం: కేటీఆర్
- అమెరికా, దక్షిణకొరియాకు వెళ్లిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు బృందానికి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: పెట్టుబడుల ఆకర్షణ కోసం అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించేందుకు బయల్దేరి వెళ్లిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక మల్టీ నేషనల్ కంపెనీలు, ప్రపంచ దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనేక దిగ్గజ కంపెనీలతో రాష్ట్రంలో బలమైన వ్యాపార బంధాన్ని ఏర్పరచగలిగామని చెప్పారు. కేసీఆర్ ఆధ్వర్యంలో పదేళ్లలో పాలసీలపరమైన విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సీఎం ప్రతినిధి బృందం ఇలాంటి కంపెనీలతో మరోసారి చర్చలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని ఆయన ఆకాంక్షించారు. తమ పార్టీకి రాజకీయాలతో సంబంధం లేదని, తెలంగాణే తమ ప్రథమ ప్రాధాన్యంగా ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తాము నిర్మించిన బలమైన పెట్టుబడుల పునాదులపైన మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

803 కిలోల గంజాయి పట్టివేత

రూ.2.81 కోట్ల విలువ ఉంటుందన్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్‌ఓటీ పోలీసులు

శంషాబాద్ రూరల్: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఒక డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న 803 కిలోల గంజాయిని బాలానగర్ ఎస్‌ఓటీ విభాగం, శంషాబాద్ పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2.81 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఒడిశా నుంచి రాష్ట్రం మీదుగా మహారాష్ట్రకు ఈ గంజాయిని తరలిస్తున్నట్టుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పెద్ద గోల్కొండ శివారులో ఔటర్ రింగు రోడ్డుపై మాటువేసి పట్టుకున్నామని వెల్లడించారు. ఒడిశాకు చెందిన కమిషన్ ఏజెంట్ సోమనాథ్ ఖార, డీసీఎం డ్రైవర్లు హెచ్ఎస్ విఠల్ రెడ్డి, సంజీవ్‌కుమార్‌తోపాటు సునీల్ భోస్లా, జగసునను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. గంజాయి తరలింపు సూత్రధారులైన ఏపీలోని అరకు వాసి రాము, మహారాష్ట్ర వాసి సురేశ్ మారుతి పాటిల్ పరారీలో ఉన్నట్టు వివరించారు.

తరలింపు ప్లాన్ ఇదీ..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అరకువాసి రాము గంజాయి సరఫరాదారు.. అతడి వద్ద సోమనాథ ఖార పనిచేస్తున్నాడు. వారు ఇటీవల డీసీఎం యజమాని విఠల్‌రెడ్డితో ఒప్పందం చేసుకున్నారు. వైజాగ్ పరిసరాల్లో గూడ్స్ డెలివరీ కోసం వస్తే తమకు చెప్పాలన్నారు. విఠల్‌రెడ్డికి గత నెల 30న పటాన్‌చెరు నుంచి వైజాగ్ సరకు తరలించే ఆర్డర్ వచ్చింది. ఆ సరుకును డెలివరీ చేశాక.. ఈ నెల 1న వైజాగ్‌లోని సెజ్‌లో ఉన్న ఓ కంపెనీ నుంచి కెమికల్ సాల్వెంట్స్ తీసుకుని బయలుదేరారు. మధ్యలో గంజాయి బస్తాలను నింపారు. సోమనాథ్ ఖార ముందు ఓ కారులో వెళ్తుండగా.. వెనకాల డీసీఎం వచ్చింది. గంజాయిని హైదరాబాద్‌లోని పటాన్‌చెరు వరకు తీసుకొచ్చి అక్కడ సురేశ్ పాటిల్‌కు అప్పగిస్తే.. అతను వేరే వాహనంలో గంజాయిని మహారాష్ట్రకు తీసుకెళ్లేలా ప్లాన్ వేసుకున్నారు. కానీ పోలీసులు పట్టుకున్నారు.

గాడి తప్పిన వర్సిటీలు..!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతీ ప్రభుత్వం చెప్తున్నా.. నిధులు మాత్రం ఇవ్వడం లేదు. ఫలితంగా మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంటోంది.

కొత్త వీసీలు వస్తేగానీ..

విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది ఖాళీలు కూడా భారీగా ఉన్నాయి. వీటి భర్తీకి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం జీవో ఇచ్చింది. వీసీల ద్వారా కాకుండా.. కమిటీ ద్వారా నియామకాలు చేపట్టాలని భావించింది. కానీ అది ముందుకు పడలేదు. నిజానికి రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలే లేరు. ఈ ఏడాది మేలోనే వీసీల పదవీకాలం పూర్తయింది. కొత్తవారి నియామకానికి సెర్చ్ కమిటీలు వేశారు. దరఖాస్తులూ తీసుకున్నారు. కానీ సెర్చ్ కమిటీలు ఇంతవరకు సమావేశం కాలేదు. వీసీల నియామకం జరిగితే తప్ప ఖాళీల భర్తీ కుదరదు. ఖాళీలు భర్తీ చేస్తే తప్ప బోధన గాడినపడేందుకు ఆస్కారం లేదు.

చదువు చెప్పేవాళ్లెక్కడ?

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో 2,828 పోస్టులు ఉండగా.. అందులో 1,869 పోస్టులు ఖాళీయే. అంటే 70శాతం వరకు బోధనా సిబ్బంది లేరు. ఇలా ఉంటే విశ్వవిద్యాలయాల్లో బోధన ఎలా సాగుతుంది? పరిశోధనలు ఎలా సాధ్యమవుతాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017లోనే వర్సిటీల్లో 1,528 ఖాళీలున్నట్టు గుర్తించింది. 1,061 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. కానీ కార్యరూపం దాల్చలేదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్యతో నియామకాలు ఆగిపోయాయి. 2021 జనవరి నాటికి ఖాళీల సంఖ్య 1,869కు పెరిగింది. ఇందులో 248 ప్రొఫెసర్, 781 అసోసియేట్ ప్రొఫెసర్, 850 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. తర్వాత మరిన్ని పోస్టులూ ఖాళీ అయ్యాయి. మరోవైపు బోధనేతర సిబ్బంది ఖాళీలూ భారీగానే ఉన్నాయని.. మొత్తంగా 4,500కు పైగా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని అధికార వర్గాలు చెప్తున్నాయి.

సదుపాయాలూ సరిగా లేక..

చాలా యూనివర్సిటీల్లో మౌలిక వసతుల పరిస్థితి దారుణంగా ఉంది. తాగునీటి సౌకర్యం కూడా సరిగా ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టళ్లు, టాయిలెట్ల పరిస్థితి దారుణంగా ఉంటోందని అంటున్నారు. పాలమూరు వర్సిటీ హాస్టళ్లలో గదుల తలుపులు, కప్‌బోర్డులు విరిగిపోయాయి. శాతవాహన వర్సిటీలో ఫార్మసీ కళాశాల భవనాలు నామమాత్రంగా ఉన్నాయి. ఉస్మానియా వర్సిటీ భవనాల నిర్వహణ సరిగా లేదు. కొన్ని శిథిలావస్థకు చేరాయి. వీటిని బాగు చేయాలంటే నిధుల కొరత వెంటాడుతోందని అధికారులు చెప్తున్నారు.

ఏ వర్సిటీ చూసినా.. అన్నీ ఖాళీలే..!

కీలకమైన ఉస్మానియా యూనివర్సిటీలోనూ ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా ఉంది. అన్ని విభాగాల్లోనూ కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులతో బోధన చేయిస్తున్నారు. సీనియర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో పరిశోధనలేవీ ముందుకు సాగడం లేదు. పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయిలో బోధన మొక్కుబడిగా ఉందనే విమర్శలున్నాయి. ల్యాబ్‌లలో అవసరమైన పరికరాలు, రసాయనాలు, ఇతర మౌలిక వసతులు లేవు. జేఎన్టీయూహెచ్‌లోనూ ఇదే దుస్థితి. నిజాం కాలేజీ, కోఠిలోని విమెన్స్ యూనివర్సిటీలోనూ చాలా కోర్సులకు ఫ్యాకల్టీ లేదు.

- కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీలో మ్యాథ్స్, ఫార్మసీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేరు.
- మహబూబ్‌నగర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ విభాగాలకు ఒక్క రెగ్యులర్ ఫ్యాకల్టీ కూడా లేరు. కాంట్రాక్టు లెక్చరర్లతో అరకొరగా కొనసాగిస్తున్నారు.
- ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత చెప్పుకోదగ్గ వర్సిటీ కాకతీయ విశ్వవిద్యాలయం. ఇక్కడ పొలిటికల్ సైన్స్, ఎడ్యుకేషన్ వంటి విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకులు ఒక్కరూ లేరు. ఈ వర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీలో చాలా పోస్టులు ఖాళీయే.
- నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కొన్ని విభాగాల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేని పరిస్థితి. కీలకమైన ఇంజనీరింగ్ విభాగంలో 48 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగతా విభాగాల్లోనూ రెగ్యులర్ అధ్యాపకులు నామమాత్రమే.
- నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో మేథ్స్, ఎకనామిక్స్, ఫార్మస్యూటికల్స్, కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకులే లేరు.

యూనివర్సిటీలలో ఫ్యాకల్టీ పోస్టులు, ఖాళీల తీరు ఇదీ..

యూనివర్సిటీ	మొత్తం పోస్టులు	ఖాళీలు
ఉస్మానియా	1,267	845
కాకతీయ	409	298
తెలంగాణ	152	73
శాతవాహన	64	45
మహాత్మాగాంధీ	70	35
పాలమూరు	95	73
జేఎన్టీయూహెచ్	410	232
జేఎన్ఏఎఫ్ఏయూ	55	31
ఆర్జీయూకేటీ	147	128
ఓపెన్ వర్సిటీ	86	48
తెలుగు వర్సిటీ	82	61

70శాతం కాంట్రాక్టు అధ్యాపకులే..



విశ్వవిద్యాలయాల్లో 11 ఏళ్లుగా బోధన సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. 70శాతం కాంట్రాక్టు అధ్యాపకులతోనే నడిపిస్తున్నారు. వారిపైనా విపరీతమైన పనిభారం ఉంటోంది. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయలేదు. తక్షణమే యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టి, ఉన్నత ప్రమాణాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.పరమేశ్వర్, (తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీస్ సంఘం నేత)

క్లుప్తంగా...

రేపు బీజేపీ పదాధికారుల సమావేశం: గుజ్జుల



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశాన్ని ఈ నెల 6న రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు.. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పదాధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు పాల్గొనాలని సూచించారు.

రుణమాఫీ చేసేవరకు ఒత్తిడి తెస్తాం: సంతోష్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేంత వరకు బీజేపీ పోరాడుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సహాయ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వస్తున్న విజ్ఞప్తులను ఆలకించి.. వారికి మనోధైర్యం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు

- బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు స్కూళ్ల ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పదోతరగతి ఫెయిలైన ఉపాధ్యాయులున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని, విద్యాహక్కు చట్టం కింద చాలా పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని స్పష్టం చేశారు.

కేంద్రం బంగారు గుడ్లే ఇస్తుంది: రాణీ రుద్రమ



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తెలంగాణకు బంగారు గుడ్లు ఇస్తుందని, అసెంబ్లీల్లో కాగ్ ప్రవేశపెట్టిన 2016–2022 నివేదికలే ఇందుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ స్పష్టం చేశారు. ఆమె ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు వాస్తవాలకు విరుద్ధంగా ప్రసంగాలు చేశారని విమర్శించారు. కేంద్రం నుండి నిధులు వచ్చినా రాలేదని అబద్ధాలు చెప్పారని పేర్కొన్నారు.

నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ వంచిస్తోంది: రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అవసరానికి ప్రజలను వాడుకొని, తరువాత వారిని ముంచడంలో కాంగ్రెస్‌ను మించిన పార్టీ లేదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ గెలవడానికి ప్రధాన కారణం నిరుద్యోగ యువతే అని, వారినే ఇప్పుడు కేసులపాలు చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రజాభవన్‌కు వెళ్లిన జీవో 46 బాధితులకు పిడిగుద్దులే మిగిలాయని ఆరోపించారు.



శ్రీరామకొండ.. భక్తులు నిండా

అమావాస్య సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండలోని శ్రీరామకొండ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి సాయంత్రం వరకు దాదాపు లక్షమందికి పైగా భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి శ్రీరామ పాదాన్ని దర్శించుకున్నారు. ఈ ఆలయం కేవలం ఆదివారం అమావాస్య రోజు తెరుచుకోవడం విశేషం.

–కోయిల్‌కొండ



అరుదుగా వచ్చే భాను అమావాస్య సందర్భంగా ఆదివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుట్టపై భక్తజన సందోహం. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సమన్వయలేమి, స్తబ్ధత!

రాష్ట్ర బీజేపీలో ఎనిమిది నెలలుగా లోపించిన జోష్

- 8 మంది చొప్పున ఎంపీలు, ఎమ్మెల్యేలున్నా పార్లమెంటు, అసెంబ్లీలో కానరాని ప్రభావం
- పార్టీ పటిష్టత కోసం చురుగ్గా పని చేయట్లేదని కేడర్‌లో నిరాశ
- పార్టీ రాష్ట్ర శాఖతో ప్రజా ప్రతినిధులకు సంబంధాలు కొరవడ్డట్లు అనుమానం
- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పు గురించి ఎవరూ మాట్లాడొద్దంటూ ఎమ్మెల్యేలకు నేతల హుకుం?
- తెలంగాణకు జాతీయ ప్రాజెక్టు లేదా నిధులు తేవడంలో ఎంపీలు విఫలమయ్యారని విమర్శలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో స్తబ్ధత నెలకొంది. గత ఎనిమిది నెలలుగా పార్టీలో జోష్ లోపించింది. ఇప్పటికే ముఖ్యనేతల మధ్య సమన్వయలేమి కొనసాగుతుండగా దీనికితోడు పార్టీ విస్తరణ, పటిష్టత కోసం ఎవరూ చురుగ్గా వ్యవహరించడంలేదంటూ కేడర్‌లో నిరాసక్తత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఎనిమిది మంది చొప్పున గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయారని పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో పార్టీ ఎంపీలు తెలంగాణకు జాతీయ ఏదైనా ప్రాజెక్టు లేదా ప్రత్యేక నిధులు సాధించడంలో విఫలమయ్యారని సొంత పార్టీ నేతలే అంతర్గత సమావేశాల్లో విమర్శిస్తున్నారు. దీంతో పార్టీ రాష్ట్ర శాఖకు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయా అనే సందేహం పార్టీ వర్గాల్లో నెలకొంది.

సొంత ఇమేజీ పెంచుకోవడంపైనే...

ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సొంత ఇమేజీని పెంచుకోవడంపైనే అధిక దృష్టి పెడుతున్నారన్న విమర్శలు కూడా అంతర్గతంగా పార్టీలో వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర నాయకత్వం వారికి సరిగ్గా దిశానిర్దేశం చేయలేకపోవడానికి గల కారణాలు ఏమిటనే చర్చ కూడా కేడర్‌లో నడుస్తోంది. ప్రధానంగా సుప్రీంకోర్టు వెలువరించిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పును బీజేపీ అనుకూలంగా మలుచుకోలేకపోవడంపైనా సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ అంశంపై ఎవరూ మీడియాతో మాట్లాడొద్దని.. బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని ఎమ్మెల్యేలను సైతం ముఖ్యనేతలు ఆదేశించడంతో రాష్ట్ర పార్టీ నుంచి ఎవరూ స్పందించని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయంపై కనీసం ఎమ్మార్పీఎస్ ద్వారానైనా సంబరాలు చేయించి ప్రధాని మోదీకి, బీజేపీకి క్రెడిట్ దక్కేలా చేయలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ తూతూమంత్రంగా అమలు చేస్తోందని విమర్శించిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి... పార్టీ రాష్ట్రకార్యాలయంలో దీనిపై హెల్ప్ లైన్ కేంద్రాన్ని ప్రారంభించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి పాదయాత్ర చేశారు. అయితే ఒకవైపు ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి స్పష్టమైన సూచనలు లేకపోవడంతో ముగ్గురు ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రుణమాఫీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇది పార్టీ రాష్ట్రశాఖకు, బీజేఎల్పీకి, ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయలోపాన్ని బయటపెట్టింది.

క్రియాశీలం కాని పార్టీ వ్యవస్థ...

బీజేపీ రాష్ట్ర శాఖకు మొత్తం ఐదుగురు ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత బాధ్యతలు కలిపి), పెద్ద సంఖ్యలో కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, ఇతర వ్యవస్థ ఉంది. అయితే వారంతా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణ, విభాగాల మధ్య సమన్వయం, కార్యాచరణ ప్రణాళిక తదితరాలపై అంటీముట్టనట్టుగా, మొక్కుబడిగా పనిచేస్తున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు విమర్శిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ ఎలా సిద్ధమవుతుందని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలన్న లక్ష్యాన్ని ఎలా నెరవేరుస్తుందన్న అనుమానాలు కేడర్‌లో వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి స్వచ్ఛదనం– పచ్చదనం

- ఐదురోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం
- ములుగు జిల్లా అబ్బాపురంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నుంచి అమల్లోకి తీసుకురానుంది. వరుసగా ఐదు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీలు, పట్టణాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేలా అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. పరిశుభ్రత, పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. దోమల నివారణ, అంటువ్యాధులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 6న తాగునీరు, వర్షపు నీటి సంరక్షణ, 7న నీరు నిలిచిన ప్రాంతాల గుర్తింపు, గుంతల పూడ్చివేత, 8న కుక్కల బెడద నివారణ, ప్రజారోగ్యంపై కార్యక్రమాలు, 9న ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల పరిశుభ్రం చేయనున్నారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో మొక్కలు నాటనున్నారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికి ప్లాంటేషన్ కింద కనీసం 6 మొక్కలు పంపిణీ చేయనున్నారు.

'నా గ్రామం.. నా గౌరవం'నినాదంతో ముందుకు: మంత్రి సీతక్క

పల్లెల రూపు రేఖలు మార్చేలా స్వచ్ఛదనం– పచ్చదనం ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. 'నా గ్రామం–నా గౌరవం'నినాదంతో గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలు, వనమహోత్సవంలో ప్రజలంతా పాలుపంచుకోవాలని కోరారు. సోమవారం ములుగు మండలంలోని అబ్బాపురం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభిస్తారు. ఆ తర్వాత మంగపేట మండల కేంద్రంలో స్వచ్ఛదనం– పచ్చదనం అవగాహన సదస్సులో పాల్గొంటారు.

మేడారం జాతరకోసం అభివృద్ధి ప్రణాళికలు: సీతక్క



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. ఈ మేరకు ఆదివారం ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో జిల్లా అధికారులతో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, గత జాతరలో క్యూలైన్‌లలో భక్తులు తాగునీరు, టాయిలెట్ల కోసం పడిన ఇబ్బందులు గుర్తించామని, మళ్లీ జాతర వరకు సమస్య పునరావృతం కాకుండా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖకు కేటాయించిన 28 ఎకరాల స్థలంలో స్మృతి వనం ఏర్పాటుతోపాటు పార్క్‌లు, కాటేజీలు, సైక్లింగ్, ఎడ్లబండ్ల ప్రయాణం చేసేలా మ్యాప్ తయారు చేసి అధికారులకు చూపించామన్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో ఆహ్లాదం, ఆనందం, భక్తిభావం పెంపొందించేలా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ దివాకర్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులంలో ఇంకా తెరపడని బదిలీల కిరికిరి!

- ఒకే పోస్టులో ఇద్దరుముగ్గురు ఉద్యోగులు పనిచేస్తున్న వైనం
- ప్రస్తుతానికి అందరినీ చేర్చుకోవాలని సొసైటీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో విచిత్ర పరిస్థితి నెలకొంది. తాజాగా సొసైటీ పరిధిలో జరిగిన టీచర్ల బదిలీలు, పదోన్నతులతో పెద్దసంఖ్యలో ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. కొందరు పదోన్నతులతో కొత్త స్థానాలకు వెళ్లగా... మరికొందరు బదిలీలపై, ఇంకొందరు జీఓ 317 కేటాయింపులతో మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారమంతా అస్తవ్యస్తంగా జరగడంతో చాలాచోట్ల ఉద్యోగులు గందరగోళ పరిస్థితుల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్నిచోట్ల ఒకే పోస్టు ఉండగా... ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడం ఒక ఎత్తయితే... కొందరికి స్థానికత, సీనియారిటీ పరిగణనలోకి తీసుకోకుండా సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడంతో వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఒకే పోస్టుకు ఇద్దరు ఉద్యోగులకు పోస్టింగులు దక్కడంతో... ముందుగా వచ్చిన వారిని చేర్చుకోగా, మిగతా వారంతా సొసైటీ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. మరోవైపు ఇలా వందల సంఖ్యలో టీచర్లు గందరగోళానికి గురికావడంతో సొసైటీ అధికారులు అవాక్కయ్యారు. జూలై 31వ తేదీతో సాధారణ బదిలీల అంశానికి తెరపడింది. దీంతో పోస్టింగ్ ఉత్తర్వులకు అనుగుణంగా వారందరినీ విధుల్లోకి చేర్చుకోవాలంటూ సొసైటీ అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. కానీ వాస్తవ పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చే అంశంపై స్పష్టత లేకపోవడం ఉపాధ్యాయవర్గాల్లో తీవ్ర అయోమయం నెలకొంది.

మైనార్టీ గురుకులంలోనూ....

తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల పరిధిలో కూడా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తీవ్ర గందరగోళం సృష్టిస్తోంది. పదోన్నతులు ఇచ్చిన వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయగా... తీరా విధుల్లో చేరేందుకు వెళ్లిన టీచర్లు తెల్లమొహం వేయాల్సిన పరిస్థితి వచ్చింది. బదిలీల్లో భాగంగా స్థానచలనం పొందినవారు సైతం సొసైటీ కార్యదర్శి కార్యాలయంలో సంప్రదించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆన్‌లైన్ పద్ధతిలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటూ తాత్కాలిక ఉపశమనం కల్పించే క్రమంలో మైనార్టీ సొసైటీ అధికారులు మాన్యువల్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే చాలాచోట్ల వాటిని రికార్డు చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై ఒకట్రెండు రోజుల్లో సొసైటీ కార్యదర్శి సమావేశం నిర్వహిస్తారని ఆ శాఖవర్గాలు చెప్పుకొస్తున్నాయి.

ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా

- వేల ఎకరాలు సేకరించి దోచుకునే కుట్ర.. భూముల అన్యాక్రాంతంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కేసీఆర్ కుటుంబ భూదోపిడీపై చర్యలేవి?
- గుర్రంగూడ బోనాల ఉత్సవాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్



సంజయ్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా/బడంగ్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరుతో చేసిన ప్రకటన వెనుక పెద్ద ఎత్తున భూదందా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలు ముందుగానే సేకరించి..రియల్ దందా చేస్తూ వేలకోట్ల విలువ చేసే ఆస్తులు పోగేసుకునేందుకు సిద్ధమయ్యారన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తున్నారని చెప్పారు. ఈ ఫోర్త్‌సిటీ వల్ల కాంగ్రెస్ నేతలకు తప్ప ప్రజలకు ప్రయోజనం లేదని, స్థానిక నేతకే భూములు సేకరించే బాధ్యతను అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఆ కమిటీ నివేదిక ఎక్కడ?

ధరణి పేరును భూమాతగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం భూ మేతకు ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతుందని బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 24 లక్షల అసైన్డ్ భూములుంటే.. నేడు ఆ భూములు ఐదు లక్షలకు ఎలా తగ్గాయని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ధరణిని అడ్డుపెట్టుకొని దోచుకున్నారని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదన్నారు. అధికారంలోకి రాగానే ధరణిపై ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే భవిష్యత్‌లో గజం భూమి కూడా మిగిలే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ధరణి భూముల అన్యాక్రాంతంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

ఆ విలీన ప్రతిపాదన అర్థం లేనిది

గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ప్రతిపాదన అర్థం లేనిదని బండి సంజయ్ అన్నారు. దీనిపై బీజేపీ నాయకత్వం చర్చించి తగిన కార్యాచరణ ప్రకటిస్తుందని చెప్పారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ఏదో ఒక కొత్త అంశాన్ని తెరపైకి తీసుకురావడం, ప్రజల దృష్టిని మళ్లించడం కాంగ్రెస్ నేతలకు అలవాటైపోయిందని విమర్శించారు.

హిందువుల పండుగలంటే అంత చులకనా?

'బోనాల పండుగ వెనుక పెద్ద చరిత్ర ఉంది. దీనికి సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది. కానీ ఇంత పెద్ద పండుగకు ప్రభుత్వం నిధులివ్వదు. హిందువుల పండుగలకు పైసలివ్వరు. సెక్యులరిజం పేరుతో ఒక మతానికే కొమ్ముకాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తోంది'అని బండి సంజయ్ విమర్శించారు. రంజాన్‌కు రూ.33 కోట్లు, హిందువులను చంపిన తబ్లిగీ జమాతే సంస్థకు రూ.2.40 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ అదేదో ఘన కార్యంగా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహారెడ్డి తదితరులు హాజరయ్యారు.



ప్రతి ఒక్కరికీ స్వర్గద్వారాలను తెరిచే తాళంచెవిని ఇచ్చారు. అదే తాళంచెవి నరక ద్వారాలను కూడా తెరుస్తుంది.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 5 ఆగస్టు 2024

నిద్రారాక్షసం

కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర లేకుండా రోజుల తరబడి గడపడం అసాధ్యం. బొందిలో ప్రాణం నిలిచి ఉండాలంటే, ఈ రెండూ తప్పనిసరి. తిండి, నిద్ర మనుషులకే కాదు, జంతువులకూ అవసరమే! జంతువులకు నిద్ర ముంచుకొచ్చినప్పుడు నిద్రపోవడమే తెలుసు గాని, నిద్ర గురించి ఆలోచించడం తెలీదు. మనం మనుషులం. జంతువులతో పోల్చుకుంటే జ్ఞానులం. 'ఆహార నిద్రా భయ మైథునాని/ సామాన్య మేతత్పశుభి ర్నరాణాం/ జ్ఞానం హి తేషా మధికో విశేషో/ జ్ఞానేన హీన్యా పశుభిస్సమానాః' అని పూర్వకవి సంస్కృతంలో పలికాడు. ఆహార నిద్రా భయ మైథునాలు మనుషులకు, జంతువులకు సమానమే! మిగిలిన జంతు సమూహం నుంచి మనిషిని వేరు చేసే లక్షణం జ్ఞానం మాత్రమే! జ్ఞానమే గనుక లేకుంటే, మనుషులకు, జంతువులకు తేడా ఏమీ ఉండదు.

అందువల్ల జంతువుల కంటే జ్ఞానులైన మనుషులకు నానా విషయాలలో అవసర పరిజ్ఞానమూ అనవసర పరిజ్ఞానమూ సహజ లక్షణం. అందులో భాగంగానే మనుషులకు నిద్ర గురించిన పరిజ్ఞానం ఉండటం అంతే సహజం. నిద్ర ఎప్పుడు రావడం సహజమో, ఎంతసేపు నిద్రపోవాలో, సుఖనిద్రకు ఎలాంటి పరిసరాలు, పరిస్థితులు అనుకూలిస్తాయో మనుషులకు బాగా తెలుసు. బహుశా, ఈ జ్ఞానభారం వల్లనే నిద్రలేమి సమస్యలు కూడా మనుషుల్లోనే ఎక్కువ. 'ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు' అని మనకో నానుడి ఉంది. కొంత వరకు ఆ మాట నిజమే కావచ్చు గాని, సర్వసుఖాలు అందుబాటులో ఉన్నా, కంటి నిండా కునుకు లేక తిప్పలు పడే మనుషులు ప్రపంచమంతటా లెక్కకు మిక్కిలిగా ఉన్నారు.

'నిద్ర మంచిది, మరణం మెరుగైనది; అయితే, అత్యుత్తమమైనదేదీ ఇంకా పుట్టలేదు' అని జర్మన్ కవి, రచయిత హేన్రిక్ హేనీ అన్నాడు. మరణాన్ని మనవాళ్లు శాశ్వతనిద్రగా అభివర్ణిస్తారు. శాశ్వతనిద్రలోకి జారుకునేలోగా మనిషికి జీవనయాత్ర తప్పదు. జీవనయాత్ర సజావుగా సాగడానికి ప్రతిరోజూ తగినంత నిద్ర అవసరం. ప్రశాంతమైన నిద్రతోనే మనశ్శరీరాలు జవజీవాలను పుంజుకుంటాయి. దైనందిన నిత్య నైమిత్తిక కార్యకలాపాలకు సంసిద్ధమవుతాయి. రోజంతా పనిచేసి అలసి సొలసిన శరీరానికి విశ్రాంతి, మనసుకు ప్రశాంతత అవసరం. ఈ రెండూ నిద్రతోనే దొరుకుతాయి. అయితే, సంక్లిష్టమయమైన ఆధునిక జీవనశైలి మనుషులను నిద్రకు దూరం చేస్తోంది.

'కునుకు పడితె మనసు కాస్త కుదుట పడతది/ కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది' అన్నాడు మనసుకవి ఆత్రేయ. మనసుకు కుదురు లేనప్పుడు పట్టేది చెదురు మదురు నిద్రే! చెదురు మదురు నిద్రలో తీపికలలు కాదు, పీడకలలు వస్తాయి. 'కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునె రతికేళి? జిహ్వకున్/ వంటక మిందునే? యితర వైభవముల్ పదివేలు మానసం/బంటునె? మానుషంబుగల యట్టి మనుష్యున కెట్టివానికిన్/ గంటకుడైన శాత్రవుడొకండు తనంతటి వాడు గల్గినన్' అన్నాడు శ్రీనాథుడు. ఈ పద్యం 'కాశీఖండం'లోనిది. ఇది వింధ్యుడి స్వగతం. వింధ్యుడికి సమ ఉజ్జీ మేరువు. సూర్యుడు మేరువు చుట్టూ ప్రదక్షిణంగా పయనిస్తాడు. దేవతలు మేరుపర్వతాన్నే గౌరవిస్తారు. మేరువు కన్నా తానేమీ తక్కువ కాకున్నా, తనకు దక్కని గౌరవం మేరువుకు దక్కడం పట్ల అసూయతో రగిలిపోయే వింధ్యుడి కంటికి కునుకు పట్టకపోవడం సహజమే కదా! పురాణాల్లో మేరువు, వింధ్య పర్వతాలే అయినా, శ్రీనాథుడు రాసిన ఈ పద్యం మాత్రం మానవ ప్రవృత్తులకు అద్దం పడుతుంది. నిద్రను కరవు చేసే అనేకానేక కారణాల్లో సమ ఉజ్జీ అయిన ప్రత్యర్థితో తలెత్తే స్పర్ధ కూడా ఒకటి.

నిద్ర పట్ల అవగాహన మనుషులకు ప్రాచీనకాలం నుంచి ఉండేది. నిద్రకు భంగం కలిగించే అంశాలు, ప్రశాంతమైన నిద్ర ఆవశ్యకతను నాటి మానవులు బాగానే గుర్తించారు. ప్రాచీన నాగరికతలలో నిద్రను దేవతగా ఆరాధించేవారు. కావ్య పురాణేతిహాసాల్లో నిద్ర ప్రస్తావన విరివిగా కనిపిస్తుంది. రామాయణంలో కుంభకర్ణుడి నిద్ర, ఊర్మిళాదేవి నిద్ర సుదీర్ఘకాల నిద్రలకు ఉదాహరణలు. ఆకలి దప్పులను, నిద్రను జయించడానికి విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల అతిబల విద్యలను ఉపదేశించిన ఉదంతం కూడా రామాయణంలో ఉంది. అరణ్యవాస కాలంలోను, లంకలో రామరావణ యుద్ధకాలంలోను బల అతిబల విద్యలు లక్ష్మణుడికి బాగా అక్కరకు వచ్చాయి. అరణ్యవాసానికి వెళ్లినది మొదలుకొని, రావణ సంహారం తర్వాత శ్రీరామ పట్టాభిషేకం వరకు లక్ష్మణుడు నిద్రపోలేదు. అంతకాలమూ అతడి అర్ధాంగి ఊర్మిళ నిద్రపోతూనే ఉంది.

సరిగా రామ పట్టాభిషేకం జరుగుతుండగా, లక్ష్మణుడికి నిద్ర ముంచుకొచ్చి రెప్పలు మూతబడ్డాయి. అప్పుడు తన అవస్థకు తానే నవ్వుకున్నాడు లక్ష్మణుడు. పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడు నవ్విన నవ్వును అక్కడ ఉన్న ప్రముఖుల్లో ఒక్కొక్కరు ఒక్కోలా అర్థం చేసుకున్నారు. అదంతా వేరే కథ. పురాణాల ప్రకారం నిద్రకు దూరంగా ఎక్కువకాలం గడిపిన రికార్డు లక్ష్మణుడిదే! అయితే, న్యూయెన్ న్యోక్ మై కిమ్ అనే యాభయ్యేళ్ల వియత్నాం మహిళ గడచిన ముప్పయ్యేళ్లుగా కనీసం నిమిషమైనా నిద్రపోలేదట! ఇన్నాళ్లుగా నిద్రపోకున్నా, ఆమె ఆరోగ్యంగా ఉండటం చూసి వైద్యులు సైతం విస్తుపోతున్నారు. ఈ నిద్రలేని నీలాంబరి ఉదంతం ఒక నిద్రారాక్షసం.

కలిసి 'కూర్చోవడానికి' కాని కాలం!

కామెంట్



కరణ్ థాపర్

క్లబ్బులు స్నేహపూర్వకమైన వాతావరణంలో ఇతరులతో కలిసి కూర్చోవడానికి మనల్ని ప్రోత్సహిస్తాయి. క్లబ్బు లోపలికి మీరు ఒక్కరిగానే వచ్చి ఉండవచ్చు. కానీ ఒక సంతోషకరమైన బృందంలో ఒకరిగా కలిసిపోతారు. క్లబ్బు సభ్యులు గౌరవప్రదంగా ప్రవర్తిస్తారనే భావన అంతర్లీనంగా ఉంటుంది. అలాంటి పెద్ద మనుషులను చిన్నబుచ్చే సంగతి ఇది. దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ జింఖానా క్లబ్బు సభ్యుల ఖాతాలలో 'పాజిటివ్ క్రెడిట్ బ్యాలెన్స్' ఉండాలంటోంది. గుప్పెడుమంది డబ్బులు ఎగ్గొట్టి ఉండొచ్చు. మరీ అనుమానాస్పదంగా కనిపిస్తే తప్ప తినేందుకు మీ దగ్గర డబ్బులు ఉన్నాయా అని ఏ రెస్టారెంటూ అడగదు. అలాంటిది ఇంత పెద్ద క్లబ్బే ఇలా చేస్తే? కానికాలం అంటే ఇదే!

మీరు కనుక ఒక క్లబ్బులో సభ్యులై ఉన్నట్లయితే, అలా ఉండటం ఎంతో ప్రత్యేకమైనదని మీకు తెలిసి ఉంటుంది. సమస్థాయి వ్యక్తులు కలుసుకోవడానికి, సేద తీరేందుకు, అక్కడ తాము మాట్లాడేవి, చేసేవి బయటికి బహిర్గతం అవుతాయనే భయం లేకుండా ఒక సమూహంగా మసలుకునేందుకు బ్రిటిష్‌వాళ్లు ప్రవేశపెట్టినవే ఈ క్లబ్బులు. నిర్వచనం ప్రకారం అవి ఆంతరంగికమైనవి, గోప్యనీయతను కలిగి ఉండేవి. బహుశా అందువల్లే సభ్యులకు తమ క్లబ్బులు ప్రియమైనవిగా ఉండి, వారు తరచు వాటి పట్ల అపరిమితమైన విధేయతను కలిగి ఉంటారు.

దాంతోపాటుగా క్లబ్బు సభ్యులు 'పెద్ద మనుషులు'గా పరిగణన పొందుతారు. మహిళా సభ్యుల విషయంలోనూ ఇది నిజం. ఒక అలిఖిత – అయితే అందరూ ఎరిగిన – ప్రవర్తనా నియమావళి క్లబ్బుల్లో అమలులో ఉంటుంది. క్లబ్బు సభ్యులు ఎల్లప్పుడు గౌరవప్రదంగా ప్రవర్తిస్తారనే భావన అంతర్లీనంగా ఉంటుంది. సభ్యతగల పనులే చేస్తారని వారిపై నమ్మకం ఉంచవచ్చు.

సంప్రదాయం ప్రకారం, క్లబ్బు సభ్యులు సభ్యత్వ నియమావళి మేరకు తామక్కడ పొందే సేవలకు డబ్బు చెల్లిస్తారు. అది బారులో డ్రింక్స్‌కి అయినా, డైనింగ్ హాల్‌లో విందుకైనా; లేదా క్రీడల సదుపాయాలను వినియోగించుకున్నా, వాటిల్లో పాల్గొంచుకున్నా అందుకు అయిన ఖర్చును కచ్చితంగా, పూర్తిగా చెల్లించవలసి ఉంటుందనటంలో సందేహం లేదు. మొత్తమ్మీదైతే, ఈ మర్యాదస్తులు తమ చెల్లింపు నిబంధనలను గౌరవిస్తారు.

పాడు కాలం, ఇప్పుడేమైందంటే దేశ రాజధానిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన, సభ్యత్వానికి అపరిమితమైన డిమాండును కలిగి ఉన్న ఢిల్లీ జింఖానా క్లబ్ ఇక మీదట మునుపటిలా ఉండబోవటం లేదు. ఆ క్లబ్బు తన సభ్యత్వానికే అవమానకరంగా, అసంబద్ధంగా – సభ్యులు తాము పొందబోయే సేవలకు గాను ముందుగానే డబ్బును డిపాజిట్ చేయాలన్న పద్ధతిని ప్రవేశపెట్టింది! క్లబ్బు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి క్లబ్బు బారులో తాగాలన్నా, క్లబ్బు డైనింగ్ హాలులో తినాలన్నా ఇకపై క్లబ్బు సభ్యుల ఖాతాలలో 'పాజిటివ్ క్రెడిట్ బ్యాలెన్స్' ఉండి ఉండాలి. అంటే మిగులు డబ్బులు ఉండాలి. వార్షిక సభ్యత్వ



ఢిల్లీ జింఖానా క్లబ్ ముఖద్వారం

రుసుము కడుతున్నాం కదా అంటే ఇప్పుడు అదొక్కటే సరిపోదు.

విషయం ఏంటంటే, మనకు ఇష్టమైనప్పుడు క్లబ్బుకు వెళ్లి కూర్చోవడానికి సదుపాయం కల్పించటమనే క్లబ్బు ప్రధాన ప్రయోజనాన్ని ఈ కొత్త పద్ధతి నెరవేరకుండా చేస్తుంది. మీరు మీ క్లబ్బు ఖాతాలో మిగులు డబ్బు లేకుండా తినలేరు. తాగలేరు. అప్పుడిక పక్క వారి మీద పడిపోవటమొక్కటే మీకుండే మార్గం.

అది అధ్వాన్నమైన పరిస్థితి. క్లబ్బులు అనేవి స్నేహపూర్వకమైన వాతావరణంలో ఇతరుల కోసం మీరు డ్రింక్స్ కొనడానికి, లేదా వారితో కలిసి విందులో కూర్చోవడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తాయి. లోపలికి మీరు ఒక్కరిగానే వచ్చి ఉండవచ్చు. కానీ చివరికి మీరు ఒక సంతోషకరమైన బృందంలో ఒకరిగా కలిసిపోతారు. అయితే మీరు డిపాజిట్ చేసిన అడ్వాన్సు చాలినంతగా లేనప్పుడు మీరలా డ్రింక్స్‌ని కొనివ్వలేరు. లేదా ఫ్రెండ్ ఇచ్చిన డిన్నర్‌కు మీరు బిల్లు చెల్లించలేరు.

ఆఖరికి వాణిజ్యపరమైన రెస్టారెంట్లు కూడా తమ అతిథులతో ఇంతకన్నా గౌరవంగా, సాదరంగా వ్యవహరిస్తాయి. అక్కడ తినటం ముగించి, వెళ్లటానికి సిద్ధం అయ్యాకే బిల్లు చెల్లిస్తారు. తినటానికి ముందే వాళ్లేమీ అడ్వాన్సు డిపాజిట్ చేసి ఉండనక్కర్లేదు. మీరు మరీ అనుమానాస్పదంగా, నమ్మదగనివారిగా కనిపిస్తే తప్ప మీరేం తినదలచుకున్నారో దానిని తినేందుకు మీ దగ్గర డబ్బులు ఉన్నాయా అని ఏ రెస్టారెంటూ మిమ్మల్ని అడగదు. అయినప్పటికీ జిమ్ – జింఖానాను ముద్దుగా సభ్యులు ఇలాగే పిలుచుకుంటారు – ఇకపై కొత్త పద్ధతి అమలు చేయబోతోంది.

తన సభ్యత్వం పట్ల ఈ విధమైన అమర్యాదకర వైఖరికి క్లబ్బు చూపిస్తున్న సాకు ఏమిటంటే – కొంతమంది సభ్యులు తమ బిల్లులు చెల్లించటం లేదని! దురదృష్టవశాత్తూ, ఆ మాట నిజం. బకాయి పడిన వారి పేర్ల జాబితాను అందరికీ కనిపించేలా ఉంచినప్పటికీ కూడా వారికి చీమ కుట్టినట్లయినా ఉండటం లేదు. కానీ సభ్యులలో అలాంటి వారు కొద్ది మంది, లేదంటే కొంత భాగం. సభ్యత్వపు విధి విధానాలకు కట్టుబడి, బహుశా పది వేల మందికి పైగా ఉన్న సభ్యుల జాబితాలో అదే పనిగా, తీరు మార్చుకోకుండా బకాయి పడుతుండే సభ్యులు వందకు మించి ఉండరు. తరచు న్యాయబద్ధమైన, ఆమోదయోగ్యమైన కారణాల వల్ల బాకాయిలను ఆలస్యంగా చెల్లిస్తుండే వారిని ఉద్దేశపూర్వకంగానే నేను ఈ జాబితాలో చేర్చటం లేదు. ఇప్పుడు, మిగతా ప్రతి ఒక్కరూ – గౌరవప్రదంగా, అధిక సంఖ్యాకంగా ఉండేవారు – బకాయి పడుతున్న కొద్దిమంది విషయమై ప్రతిస్పందించటానికి క్లబ్బు ఇంతకన్నా మెరుగైన, ప్రభావవంతమైన మార్గాన్ని కనుగొనలేక పోయిన కారణంగా ఇబ్బంది పడాలా?

చూస్తుంటే క్లబ్బు సమాధానం 'అవును' అన్నట్లే కనిపిస్తోంది. అలా కనిపించటమే క్లబ్బు యాజమాన్యం గురించి ఆందోళన కలగటానికి కారణం. క్లబ్ అంటే ఏమిటో, అదెలా ఉండాలని కోరుకుంటారో యాజమాన్యం అర్థం చేసుకోలేక పోయింది.

ఏదేమైనా, ఇందుకు – దాటవేశారని చెప్పటానికి వీల్లేని – మరొక పరిష్కారం ఉంది. క్లబ్బు యాజమాన్యం నిజంగానే బిల్లు చెల్లింపులను బకాయి పెట్టే సభ్యుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన చెందుతున్నట్లయితే బయటి రెస్టారెంట్లలో మాదిరిగా తాగిన వెంటనే, లేదా తిన్న వెంటనే బిల్లు చెల్లించాలని వారిని కోరవచ్చు. నిజానికి లండన్‌లోని చాలా క్లబ్బులు ఈ పనే చేస్తున్నాయి. అది మరింత చిత్తశుద్ధిగా, మర్యాదగా ఉంటుంది. ఢిల్లీ జింఖానా క్లబ్ అటువైపుగా ఎందుకు ఆలోచించలేక పోయింది?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉన్నవి చేజారేనా?



యుగాలుగా కశ్మీర్ మీద పాకిస్తాన్ కన్నేసి ఉంచింది. కానీ అక్కడి బలోచిస్తాన్, పఖ్తూన్‌ఖ్వా దాని చేజారే పరిస్థితిని ఎదుర్కొంటోంది. పష్తూన్ల 'పీటీఎం', బలోచుల 'బీవైసీ' సంఘాలు స్వాతంత్ర్యోద్యమాన్ని పునరుద్ధరిస్తున్నాయి. సైన్యం అణిచివేత కొనసాగుతున్నప్పటికీ విస్తారమైన నిరసనలు జరుగుతున్నాయి.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

జన హింస



మీరు గనక ఎందులోనైనా విఫలమైతే, నైజీరియన్లు ఆ వార్తను పెంచి పెద్ద చేసి, తమలో తామే గుసగుసలు పెట్టి, చివరకు అదే మీకు తగిన శాస్తి అనేస్తారు.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

అమ్మ పాత్ర



పొద్దున్నే నా వేలు కోసుకున్నాను. అంతటా రక్తం (నేను బానేవున్నానిప్పుడు). కానీ ఒక్క క్షణం వెర్రిగా మా అమ్మ కోసం చుట్టూ చూశాను. వెంటనే నేనే అమ్మనని గుర్తొచ్చేసరికి నియంత్రణ వచ్చింది. నాకిప్పుడు 44 ఏళ్లు.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

అక్కర్లేదా?



ఒకవేళ నిజంగానే అమెరికా, రష్యా చర్చించుకొని, ఏదైనా ఒప్పందానికి రావాలని అనుకుంటే దానికి మోదీ సంవాదం అవసరం లేదని ఇప్పటికే స్పష్టమైపోయింది.

– సుశాంత్ సింగ్, కాలమిస్ట్

అన్నిసార్లు పంపుతున్నారా?



ఆదాయ పన్నుల శాఖ లేదా జీఎస్టీ నుంచి రిమైండర్ మెసేజులు వచ్చిన ప్రతిసారీ గనక నాకో రూపాయి వచ్చేట్టయితే, నేనెంత ధనికురాలిని అవుతానంటే నేను మరింత పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– నందితా అయ్యర్, రచయిత్రి

హరిత భవనాలే రక్ష!

జనాభాతో పాటుగా ఇంటి నిర్మాణాలు పెరిగి పర్యావరణ సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యలను నివారించడానికి ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన, పర్యావరణ అనుకూల జీవన శైలిని కొనసాగించడానికి హరిత భవనాలు ఎంతో ఉపయోగపడతాయి. పర్యావరణ అనుకూల మెటీరియల్, డిజైన్‌తో భవనాన్ని నిర్మించి, పర్యావరణ అనుకూలంగా ఏ భవనాలనైతే నిర్వహిస్తారో వాటిని 'హరిత భవనాలు' అంటారు. ఈ భవన నిర్మాణంలో స్థలం ఎంపికకూ ప్రాధాన్యం ఉంది. అంటే పర్యావరణ సున్నితమైన ప్రదేశాలలో హరిత భవనాలను నిర్మించరాదు. ఉదాహరణకు అధిక మొత్తంలో వ్యవసాయ దిగుబడిని ఇచ్చే సారవంతమైన వ్యవసాయ భూములను హరిత భవనాల నిర్మాణాల కోసం వాడరాదు. దీని వలన మనం ప్రకృతి సిద్ధంగా లభించిన విలువైన వ్యవసాయ భూమిని కోల్పోతాము. ఇది ఆహార ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది.

సహజసిద్ధంగా గాలి, వెలుతురు వచ్చే విధంగా వీటి నిర్మాణాన్ని చేపడతారు. వెలుతురు బాగా ఉండే గదులలో చదివే విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యం, వెలుతురు సరిగ్గా లేని గదిలో చదివే విద్యార్థుల కన్నా 20 నుండి 26 శాతం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలలో తేలింది. హానికర రసాయన పదార్థాలు కలిగిన లెడ్ పెయింట్లు భవనాల లోపల గాలి నాణ్యతను హానికరంగా మారుస్తాయి కావున వాటి స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడతారు. ఇండోర్ ప్లాంట్స్ ఏర్పాటు కూడా ఈ భవనాలలో ఉంటుంది. దీనివలన భవనాల లోపల గాలి నాణ్యత పెరుగుతుంది.

తక్కువ విద్యుత్‌ను వినియోగించే ఎల్ఈడీ బల్బులను, ఇతరత్రా తక్కువ విద్యుత్‌ను వినియోగించుకొనే ఎలక్ట్రానిక్ పరికరాలను వాడటం వలన ఈ భవనాలలో తక్కువగా విద్యుత్ ఖర్చవుతుంది. అదేవిధంగా సోలార్, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక విద్యుత్‌ను వాడటం వలన గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో హరిత భవనాలు కీలక పాత్ర వహిస్తాయి. హరిత భవన పైకప్పులో కాంతిని రిఫ్లెక్ట్ చేసే పదార్థాలను వాడటం వల్ల ఇంటి పైకప్పు వేడి తగ్గుతుంది. పైకప్పు భాగంలో చిన్న, చిన్న మొక్కలను పెంచడం వలన వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ వాయువులను ఇవి గ్రహిస్తాయి. అదేవిధంగా ఇంటి పై కప్పు భాగంలో జీవ వైవిధ్యం పెరిగి సీతాకోకచిలుకలు, పక్షులు వంటి వాటిని ఆకర్షించడం వలన భవనం ఆకర్షణీయంగా మారుతుంది.

ఈ భవనాలలో సేంద్రియ వ్యర్థ పదార్థాలను బయో గ్యాస్‌గా మార్చడం లేదా సేంద్రియ ఎరువుగా మార్చి ఉపయోగించే ఏర్పాట్లు ఉంటాయి. వాడిన నీటిని శుద్ధిచేసి తిరిగి గార్డెనింగ్, ఇతరత్రా పనులకు వినియోగించడం వలన నీరు వృథా కాదు. ఈ నిర్మాణాలలో వర్షపు నీరును పట్టి భూమిలోకి ఇంకిపోయేలా చేసే ఏర్పాట్లు ఉండడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న హరిత భవనాలు వాతావరణ మార్పుల నుండి మానవాళిని రక్షించగలుగుతాయి అనడం అతిశయోక్తి కాదు.

– డా॥ శ్రీధరాల రాము,
ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, హైదరాబాద్

అనామకంగా ఆరంభమై అభివృద్ధిపథంలో!

అనుభవం



డా॥ యలమంచిలి శివాజీ

అది 1992 అక్టోబర్ 9. కోట్ల విజయ భాస్కరరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే రోజు. హైదరాబాద్‌కు ఫోన్ చేస్తే, ఢిల్లీలోనే ఉన్నారని వర్తమానం. పీవీ క్యాబినెట్‌లో న్యాయ శాఖ, కంపెనీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారప్పుడు. ఢిల్లీ నివాసానికి ఫోన్ చేస్తే, విజయ భాస్కరరెడ్డి ఫోన్ ఎత్తారు. 'ఏమిటి సార్ ఈరోజే ప్రమాణ స్వీకారం అన్నారు. మీరింకా ఇక్కడే ఉన్నారేమిటం'టే– 'ఉదయం విమానం అందుకోలేక పోయాను. ప్రత్యేక విమానంలో వెళ్లబోతున్నా'న్నారు. సరే వారిని అభినందించి, విజయవాడలో దంత వైద్య కళాశాల నెలకొల్పమని సలహా ఇచ్చాను. 'ఊరుకో శివాజీ! నా ముందున్న ముఖ్యమంత్రి వైద్య కళాశాలల జోలికిపోయి ఉద్యోగం పోగొట్టుకొన్నాడు. నాకు ఈ సలహా ఇస్తున్నావు' అన్నారు. 'అది కాదులెండి, నేను హైదరాబాద్ వచ్చి వివరిస్తాను' అని అప్పటికా సంభాషణ ముగించాను.

మూడు నాలుగు రోజుల్లో హైదరాబాదు ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి సవివరంగా వివరించాను. అప్పటికి అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలో మాత్రమే దంత వైద్య విద్య ఉంది. దానిలో మొత్తం సీట్లు 32. అందులో 7 సీట్లు జమ్మూ–కశ్మీరుకు కేంద్ర ప్రభుత్వ కోటాలో పోతే... మిగిలిన 25 సీట్లలో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు వరుసగా 11, 6, 8 సీట్లు పంచుతారు. కనుక 'విజయవాడలో హెల్త్ యూనివర్సిటీలో ఒక కళాశాల నెలకొల్పితే, మరొక 40 సీట్లు వస్తాయి. దానికి పెద్దగా నిధులు కూడా అవసరం ఉండదు కదా! మొదటి, రెండు సంవత్సరాల చదువుకు – అనాటమీ, ఫిజియాలజీ, ప్యాథాలజీ, బాక్టీరియాలజీ, ఫార్మకాలజీలకూ; వాటి నాన్‌క్లినికల్ సబ్జెక్టులకు వైద్య కళాశాలలోనున్న వసతులు సరిపోతాయి కదా. మూడో సంవత్సరం వచ్చేసరికి కాస్త అవుట్ పేషెంట్ పార్టులో ఓ 10, 15 డెంటల్ థియరీలు, కాస్త ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్లకు వసతి వంటివి ఏర్పాటు చేసుకోవడానికి నామమాత్రపు కేటాయింపులు సరిపోతాయ'ని చెప్పాను. వైద్య విశ్వవిద్యాలయం కులపతిగా ఉన్న డాక్టర్ లింగం సూర్యనారాయణను పిలిపించి, దానికి అవసరమైన నివేదిక తయారు చేయమని పురమాయించమని కోరాను. ఇది ప్రభుత్వ రంగంలో నెలకొంటుంది గనక అవినీతి ఆరోపణలకు తావుండదనీ చెప్పాను.



ఈ సంగతి డాక్టర్ లింగం గారికి ముందుగానే తెలియజేస్తే – 'అమ్మో! వారిని కలవడం మాటలా? నావల్ల కాదని' కంగారుపడ్డారు. తరువాత రెండు, మూడు రోజులకు వారికి ఫోన్ చేసి చెప్పాను... ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కబురు వస్తుందనీ, కంగారు పడకుండా సవివరంగా నివేదిక తయారు చేసుకొని వెళ్లమనీ. 'ఫోను వచ్చింది – శివాజీ ఈరోజే వెడుతున్నాను' అని సెలవిచ్చారు.


ముఖ్యమంత్రి ఆ నివేదిక పరిశీలించి వెంటనే ఐదు లక్షల రూపాయలు కేటాయించి, విజయవాడ పాత ఆర్టీసీ బస్టాండు భవనాన్ని బదలాయించి, కాలేజీ మొదలు పెట్టమన్నారు. ఇకపై, ప్రభుత్వం నుండి నిధుల కోసం ఎదురు చూడకుండా, మీ కాళ్ల మీద మీరు నిలబడి కాలేజీ నడుపుకోవాలని కూడా హెచ్చరించారు. అలా 1992–93లో 40 వార్షిక ప్రవేశాలతో, విజయవాడలో హెల్త్ యూనివర్సిటీ యాజమాన్యంలో ఈ కాలేజీ పురుడు పోసుకుంది. ఇది అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో, ద్వితీయ దంత వైద్య కళాశాల. హెల్త్ యూనివర్సిటీ మొత్తం అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు చెందింది కనుక, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దానిలో ప్రవేశాలకు అవిభక్త రాష్ట్రమంతటికీ అన్ని జిల్లాలకూ పది సంవత్సరాల పాటు అర్హత ఉంది. ఇప్పుడు ఆ గడువు ముగిసింది కనుక విభజిత ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమయ్యింది.

ఇదిలా ఉండగా, డాక్టర్ లింగం పదవీ విరమణ తర్వాత వారి స్థానంలో డాక్టర్ సీఎస్ భాస్కరన్ వైస్ ఛాన్స్‌లర్ అయ్యారు. వారు బ్యాక్టీరియాలజీ ప్రొఫెసర్. వారికి హాస్పిటల్ పని, ఆపరేషన్లు, రోగులు, వైద్యం వంటి బాధ్యతలు ఉండవు. దానితో వారు అడ్మినిస్ట్రేషన్ మీద దృష్టి కేంద్రీకరించారు. గతంలో కూడా డాక్టర్ డి. జగన్నాథరెడ్డి, డాక్టర్ డి. భాస్కర్ రెడ్డి, డాక్టర్ హరినాథ్ వంటి వారు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్‌గాను, వైద్య విద్యాశాఖ సంచాలకులుగాను బాగా రాణించారు. డాక్టర్ భాస్కరన్ విజయవాడలో ప్రైవేట్ ప్రాక్టీసులో ఉన్న సీనియర్ దంత వైద్యులను పిలిచి 'ఈ కళాశాల అమ్మా, అబ్బా లేని అనాథ. మీరు ఈ ప్రాంతం వారు. ఇవి బతికి, బట్టగట్టేటట్లు కాపాడవలసిన గురుతర బాధ్యత మీ మీద ఉంది. జీతం–భత్యం ఆశించకుండా పని చేయండి' అని విన్నవించారు. అలాగే పనిచేసి, వారు దాన్ని నిలబెట్టారు. అదే నేడు బీడీఎస్‌తో పాటుగా ఎమ్‌డీఎస్ కోర్సుల్లో కూడా తర్ఫీదు నిస్తూ రాష్ట్రంలో అత్యుత్తమ కళాశాలగా నిలదొక్కుకుంది.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు

ధర్మనిరతే కవచం

విశ్వామిత్రుడు వచ్చి శ్రీరాముడిని యాగపరిరక్షణార్థం పంపించమని అడిగినప్పుడు, కేవలం పదిహేనేండ్ల బాలుడు, ఈ పసివాడు యాగానికి రక్షగా నిలబడడం ఏమిటి? అని కంగారుపడి, పంపించడానికి సంకోచించాడు దశరథ మహారాజు. తపస్సు చేయగా చేయగా కలిగిన సంతానం కాబట్టి దశరథుడి మనసులో ఆ కంగారు, దిగులు సహజమే! అయితే, అలా పంపమని అడిగిన విశ్వామిత్రుడు ఆ మాత్రం ఆలోచన లేకుండానే అడిగాడా? అన్నది ఆ క్షణాలలో దశరథుడు, శ్రీరాముడి మీదనున్న అపారమైన ప్రేమ కారణంగా ఆలోచించలేకపోయిన సంగతి.



జ్యోతిర్మయం

పిల్లల క్షేమానికి ఏది రక్షగా పనిచేస్తుంది? అని ప్రశ్న వేసుకున్నపుడు, ఆ పిల్లల తల్లిదండ్రులు ఎంత ధర్మబద్ధంగా జీవనాన్ని సాగిస్తారో అంత క్షేమంగా వారి పిల్లలు ఉంటారన్న సమాధానాన్ని సూచించిన సన్నివేశం ఇది. దశరథుడి సంకోచానికి విశ్వామిత్రుడు కోపగించుకోవడం చూసిన వశిష్ఠుడు కలగజేసుకుని 'దశరథ మహారాజా! దక్షప్రజాపతి కుమార్తెలైన జయకు, సుప్రభకు భృశాశ్వుడనే ప్రజాపతి ద్వారా కలిగిన కామరూపులు; మహా సత్వసంపన్నులు, అస్త్రములు అయినటువంటి నూర్గురు కొడుకులను విశ్వామిత్రుడు పొంది ఉన్నాడు. వాళ్ళల్లో ఏ ఒక్కడైనా కూడా యాగరక్షణ అనే పనికి సరిపోతాడు. ఇక శస్త్రాస్త్రాల సంగతంటావా? ఈయనకు తెలియని శస్త్రాలు, తలుచుకుంటే ఈయన సృష్టించలేని అస్త్రాలు లేవు. అటువంటి ఆయనతో పంపించడానికా నీవు సంకోచిస్తున్నావు?' అని ఊరడించి, దశరథుడితో ఇంకా ఇలా చెప్పాడు.

**చ॥ అనలము చేత గుప్తమగు నయ్యమృతంబును బోలె నీ తపో
ధనపరిరక్షితుం డగుచు దద్దయు నొప్పెడు నీ తనూభవుం
డని నకృతాస్త్రుడైనను నిరాయుధుడైన నిశాట కోటికిం
జెనకగ రాదు కౌశికుడు చెప్పగ గేవల సంయమీంద్రుడే.**

పూర్వం క్షీరసాగర మథనంతో లభించిన అమృతకలశం భయంకరమైన విషాగ్ని కింద దాచబడి ఉన్నట్లుగా, నీ కొడుకైన శ్రీరాముడనే అమృతకలశం నీ తపోధనం అనే ప్రాణశక్తి చేత పరిరక్షించబడుతూ ఉన్నది. అటువంటి స్థితిలో శ్రీరాముడు నిరాయుధుడుగా ఉన్నప్పటికీ ఆ రాక్షస సమూహం అతడిని ఏమీ చేయలేదు. కౌశికుడు కంటికి కనిపిస్తున్నట్లుగా కేవలం మునిమాత్రుడు కాదు సుమా!' అని వివరించాడు వశిష్ఠుడు 'భాస్కర రామాయణం' బాలకాండలోని పై సన్నివేశంలో. సంతానం ప్రాణాలకు వారి తల్లితండ్రుల ధర్మబద్ధ జీవనమే అన్నిటినీ మించిన రక్ష అని పైసన్నివేశం చాలా బలంగా చెప్పింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం: దక్షిణాయనం, వర్ష ఋతువు; శ్రావణ మాసం; తిథి: శు.పాడ్యమి సా.4.48 వరకు, తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష ప.3.20 వరకు, తదుపరి మఖ; వర్జ్యం: తె.4.18 నుండి 6.02 వరకు (తెల్లవారితే మంగళవారం); దుర్ముహూర్తం: ప.12.31 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు; అమృత ఘడియలు: ప.1.41 నుండి 3.22 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.29

నేడు సాగర్ గేట్లు ఎత్తివేత

నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్టు.. మధ్యాహ్నం 12 గంటలకు గేట్లు తెరవనున్న అధికారులు

సాగర్‌లోకి 3.22 లక్షల క్యూసెక్కుల వరద...576.1 అడుగుల వద్ద 271.9 టీఎంసీల నిల్వ


నిండు కుండలా నాగార్జున సాగర్ జలాశయం

సాక్షి, హైదరాబాద్/నాగార్జునసాగర్/దోమలపెంట: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు నాగార్జునసాగర్‌లోకి 3,22,817 క్యూసెక్కుల నీరు చేరుతుండగా. కుడి, ఎడమ కాలువల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ 37,873 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటినిల్వ 576.1 అడుగుల్లో 271.9 టీఎంసీలకు చేరుకుంది. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు.. పూర్తి నీటినిల్వ 312.05 టీఎంసీలు. మరో 41 టీఎంసీలు చేరితే సాగర్ పూర్తిగా నిండిపోతుంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమవారం సాయంత్రానికి సాగర్‌లో నీటినిల్వ గరిష్టస్థాయికి చేరుకుంటుంది. ఆపరేషన్ ప్రొటోకాల్ ప్రకారం దానికంటే ముందే గేట్లు ఎత్తి వరదను దిగువకు విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నాగార్జునసాగర్ గేట్లు పైకి ఎత్తి సుమారు 2లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తామని డ్యాం ఎస్ఈ వీపీఎస్.నాగేశ్వర్‌రావు ఆదివారం మధ్యాహ్నం ప్రకటించారు. సాగర్‌కు దిగువన ఉన్న నల్లగొండ, సూర్యాపేట, గుంటూరు, నర్సారావుపేట జిల్లాల్లోని కృష్ణానది తీర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు హెచ్చరిక జారీ చేశారు. సుంకేశుల, అటు జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,87,451 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 882.9 అడుగుల్లో 203.89 టీఎంసీలను నిల్వ చేస్తూ.. పదిగేట్లు 15 అడుగుల మేర ఎత్తి 3,69,250 క్యూసెక్కులు, కుడి కేంద్రంలో 23,146, ఎడమ కేంద్రంలో 35,315 క్యూసెక్కులను వినియోగిస్తూ విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు విడుదల చేస్తున్నారు. వెరసి 4,27,711 క్యూసెక్కులు సాగర్ వైపు వెళుతున్నాయి.

రెండో యూనిట్‌కు మరమ్మతులు ఎప్పుడు ?

నాగార్జునసాగర్‌లోని ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 8 యూనిట్లు ఉన్నాయి. అన్నీ పూర్తిస్థాయిలో నడిస్తే 810 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. ప్రస్తుతం 7 యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. రెండవ యూనిట్ మరమ్మతులకు గురై ఏడాదిన్నర కావొస్తున్నా చేయించలేదు. ఇప్పుడు వరద భారీగా వస్తున్నా ఆ యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై సాగర్ ఎస్ఈని వివరణ కోరగా మరమ్మతు చేసేందుకు ఇంజనీర్లు జపాన్ నుంచి రావాల్సి ఉందని.. అందువల్లే ఆలస్యమవుతోందని చెప్పారు.

గోదావరిలో వరద తగ్గుముఖం

సాక్షి, హైదరాబాద్: పరీవాహక ప్రాంతంలో వర్షాలు తెరపి ఇవ్వడంతో గోదావరిలో వరద క్రమంతా తగ్గుముఖం పడుతోంది. ఎగువ గోదావరి ప్రధానపాయతో పాటు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని, వాగులు, వంకల్లో ఉధృతి తగ్గింది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా, ఎగువ నుంచి 19,645 క్యూసెక్కుల వరద వస్తుండటంతో నీటి నిల్వ 44.49 టీఎంసీలకు చేరింది. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు వరద పూర్తిగా తగ్గింది.

ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, ప్రవాహాలు ఇవీ..:

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీశైలం	885	215.81	882.90	203.89	4,87,451	4,27,711
నాగార్జునసాగర్	590	312.05	576.10	271.9	3,22,817	37,873

తెలంగాణ కొత్త ఆర్వోఆర్ చట్టంతో భూ సంస్కరణలకు నాంది

- కొత్త ఆర్వోఆర్‌పై డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్చ


చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జీబీరెడ్డి. చిత్రంలో భూమి సునీల్‌కుమార్, లచ్చిరెడ్డి తదితరులు

సనత్‌నగర్(హైదరాబాద్): తెలంగాణలో తీసుకొచ్చే కొత్త రెవెన్యూ చట్టం-2024 (ఆర్వోఆర్ చట్టం) భూసంస్కరణల్లో పెనుమార్పు కానుందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. 18 రాష్ట్రాల చట్టాల అధ్యయనంతో ముసాయిదా తయారు చేశారని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈ చట్టం ఉంటుందని వక్తలు అన్నారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్వోఆర్ చట్టం ముసాయిదాపై బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో చర్చా కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొనగా, భూచట్టాల నిపుణుడు భూమి సునీల్‌కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జీబీరెడ్డి, విశ్రాంత రెవెన్యూ అధికారులు రవీంద్రబాబు, బాలరాజు, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణ, రమేష్ లొలేవార్‌లు అతిథులుగా హాజరయ్యారు.

అన్ని వర్గాలకు ఉపయోగపడేలా..

అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడేలా కొత్త ఆర్వోఆర్ చట్టం-2024 ముసాయిదా ఉందని భూచట్టాల నిపుణుడు భూమి సునీల్‌కుమార్ అన్నారు. రాబోయే 10-20 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని దీని రూపకల్పన జరిగిందన్నారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డుల్లో పేరు ఈ మూడు ఉన్నప్పుడే ఏ రైతుకైనా సంపూర్ణ భూమి హక్కులు దక్కుతాయని, వీటి కేంద్రంగానే కొత్త చట్టం ఉండబోతుందని చెప్పారు. కొత్త చట్టంలో వ్యవసాయేతర భూములకు కూడా భూమి రికార్డు రాబోతుందన్నారు.

కొత్త చట్టంతోనే రైతులకు సేవలు చేరువ

రైతులు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందాలంటే కొత్త ఆర్వోఆర్ చట్టంతోనే సాధ్యమని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. ప్రజల నుంచే చట్టం రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త చట్టం ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచిందని చెప్పారు. ఈ చట్టంతో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సేవలు అందడంతోపాటు సమస్యలను కూడా అక్కడే పరిష్కరించుకునే విధానంతో రాబోతుందని చెప్పారు. గ్రామానికో రెవెన్యూ అధికారి కూడా అందుబాటులో ఉంటూ సేవలందించే రోజులు కూడా వస్తామన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా, ప్రస్తుతం సీసీఎల్ఏకు రావాల్సిన పరిస్థితి ఉండేదని, కొత్త చట్టంలో అధికారుల వికేంద్రీకరణతో ప్రజలకు గ్రామ, మండల స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

రైతులు కోర్టు మెట్లు ఎక్కాల్సిన అవసరముండదు

కొత్త చట్టం ముసాయిదా ప్రజలు, రైతులకు రెవెన్యూ సేవలు అందుబాటులో ఉండేలా ఉందని ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ జీబీరెడ్డి అన్నారు. చిన్నచిన్న మార్పులు చేసుకొని చట్టంగా అందుబాటులోకి తెస్తే రైతులు కష్టాలు తీరుతాయన్నారు. కొత్త చట్టంతో రైతులు కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితి ఉండదని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సరిత, వైస్ ప్రెసిడెంట్లు శకుంతల, శ్రీనివాస్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాములు, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌పాక, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధా, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు.. మూడు ప్రాణాలు

- మద్యం మత్తులో దూసుకెళ్లిన కారు
- చెట్టును ఢీకొని ముగ్గురి దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మన్ననూర్: మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడిపిన యువకులు.. మలుపువద్ద అదుపు తప్పడంతో చెట్టును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బొల్లారానికి చెందిన సాయిప్రకాశ్ (28), కావలి రమేశ్ (22), కిషన్(21), గణేశ్‌లు మేడ్చల్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌లుగా పనిచేస్తున్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో శనివారం సాయంత్రం శ్రీశైలానికి కారులో బయలుదేరారు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో నలుగురు స్నేహితులు మద్యం తాగి కారులో వెళ్తున్న క్రమంలో.. వటువర్లపల్లికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో కారు అదుపు తప్పింది. ప్రధాన రహదారిలోని రోడ్డు మలుపు వద్ద పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిప్రకాశ్, కావలి రమేశ్, కిషన్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన గణేశ్‌ను సున్నిపెంట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

దళిత మహిళపై పోలీసుల కర్కశత్వం

- దొంగతనం కేసులో స్టేషన్‌కు తీసుకొచ్చి చిత్రహింస
- మైనర్ బాలుడినీ వదలని వైనం
- అమానుష ఘటనపై విచారణకు ఉన్నతాధికారుల ఆదేశం


సునీతను పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

షాద్‌నగర్ రూరల్: దొంగతనం కేసులో విచారిస్తామంటూ తీసుకొచ్చిన ఓ దళిత మహిళపై పోలీసులు కర్కషంగా వ్యవహరించారు. అంతేకాకుండా ఆమె మైనర్ కుమారుడిపై సైతం విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సైబరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

జూలై 24న చోరీ : షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ ఎస్సీ కాలనీలో నివాసం ఉండే నాగేందర్ ఇంట్లో గత నెల 24న దొంగతనం జరిగింది. తన ఇంట్లో 24 తులాల బంగారంతో పాటు, రూ.2 లక్షల నగదు చోరీ జరిగిందని, దీనికి కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులే కారణమంటూ ఆయన షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తీసుకొచ్చి.. చితకబాది : కేసు విచారణలో భాగంగా పోలీసులు భీమయ్య అతని భార్య సునీతతో పాటు 13 ఏళ్ల వారి కుమారుడిని గత నెల 30న షాద్‌నగర్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. దొంగతనాన్ని ఒప్పుకోవాలని డీఐ రామిరెడ్డితో పాటు ఇతర పోలీసు సిబ్బంది తనను, భర్తను విచక్షణారహితంగా కొట్టారని సునీత ఆరోపించింది. కాగా, తల్లి ముందే మైనర్ కొడుకును సైతం పోలీసులు దారుణంగా చితకబాది వారిని అర్ధరాత్రి ఇంటికి పంపించారు. కాగా, పోలీసులు కొట్టిన దెబ్బలకు తాళలేక సునీత నడవడానికి కూడా ఇబ్బందిపడుతుండటంతో కుటుంబ సభ్యులు ఆమెను మరుసటిరోజు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. చివరకు ఈ విషయం బయటకు తెలియడంతో దళిత సంఘాల నేతలు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సాయంతో ఆదివారం సునీతను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విచారణకు ఆదేశం : దళిత మహిళపై పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పం కావడం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకోవడంతో ఉన్నతాధికారులు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ : దళిత మహిళపై పోలీసులు చేసిన దాడి విషయాన్ని తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంలు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి బాధితురాలు సునీతను పరామర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. మహిళ అని చూడకుండా పోలీసులు సునీతను కొట్టడం సరికాదని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలన్నారు.

సైబరాబాద్ కార్యాలయానికి అటాచ్ : దొంగతనం కేసులో దళిత మహిళ, మైనర్ బాలుడిని షాద్‌నగర్ పోలీసులు చితకబాదిన ఘటనపై ఆదివారం సాయంత్రం సైబరాబాద్ సీపీ మహంతి స్పందించారు. షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) రామిరెడ్డిని సైబరాబాద్ కార్యాలయానికి అటాచ్ చేశారు.

షాద్‌నగర్ ఘటనపై సీఎం రేవంత్ సీరియస్

- సమగ్ర విచారణకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బంగారం చోరీ కేసులో ఓ దళిత మహిళ, ఆమె భర్తపై షాద్‌నగర్ పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలకు గురి చేసిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం దృష్టికి ఈ విషయం వెళ్లడంతో ఆయన పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఘటనతో సంబంధం ఉందని భావించిన వారిని వెంటనే అక్కడి నుంచి తప్పించి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేయాలని ఆదేశించారు. ఘటనకు బాధ్యులైన వారు ఎవరూ తప్పించుకోలేరని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేయడంతోపాటు వారికి అండగా ఉంటామని హామీఇచ్చారు.

దళిత మహిళపై దౌర్జన్యం హేయమైన చర్య: మాజీ మంత్రి హరీశ్‌రావు

దళిత మహిళపట్ల పోలీసులు కర్కషంగా వ్యవహరించిన తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకోవాలని దళిత దంపతులను చిత్రహింసలకు గురిచేయడం మానవ హక్కుల ఉల్లంఘనకు నిదర్శనమన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

సీపీఆర్ చేసి ప్రాణం పోసిన పోలీసులు


లక్ష్మణ్‌కి సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుళ్లు

గోవిందరావుపేట: ప్రమాదవశాత్తు గోడ మీది నుంచి పడిన వ్యక్తి స్పృహ కోల్పోగా...పోలీస్ కానిస్టేబుళ్లు సీపీఆర్ చేసి బతికించిన ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధి పస్రా చౌరస్తాలో ఆదివారం చోటుచేసుకుంది. వర్ధం లక్ష్మణ్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గోడ మీదినుంచి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్పృహ కోల్పోయాడు. ఈ క్రమంలో విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుళ్లు బి.మధు, ఎల్.మధు మంత్రి సీతక్క పర్యటన బందోబస్తు నిమిత్తం పస్రా చౌరస్తాలో ఉన్నారు. లక్ష్మణ్ పడిపోయిన విషయాన్ని కానిస్టేబుళ్లు గమనించారు. వెంటనే బి.మధు సీపీఆర్ చేయగా..ఎల్.మధు నోటి ద్వారా శ్వాస అందించడంతో లక్ష్మణ్‌కి స్పృహ వచ్చింది. దీనితో అక్కడున్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు. కానిస్టేబుళ్లను స్థానికులు అభినందించారు.

పిల్లల్ని కొట్టానన్న మనస్తాపంతో..

- తండ్రి బలవన్మరణం


నందు (ఫైల్)

దుబ్బాక టౌన్: పిల్లలు బడికి వెళ్లలేదన్న కోపంతో ఒక తండ్రి వారిపై చేయి చేసుకున్నాడు.. కానీ బిడ్డల్ని కొట్టానన్న తీవ్ర మనోవేదనతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోచమైన నందు (42) దౌల్తాబాద్ మండల కేంద్రంలో టీ స్టాల్ నడుపుతూ భార్య కవిత, కొడుకు, కూతురిని పోషించుకుంటున్నాడు. శనివారం ఇద్దరు పిల్లలు బడికి వెళ్లలేదని నందు కోపంతో వారిని కొట్టాడు. అనంతరం మనస్తాపం చెందిన ఆయన.. రాత్రి ఇంట్లో అన్నం కూడా తినలేదు.. తన చాయ్ దుకాణానికి వెళ్లి అందులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త ఉదయం వరకూ ఇంటి రాకపోవడంతో.. భార్య కవిత దుకాణం షట్టర్ తెరిచి చూడగా ఉరి వేసుకొని కనిపించాడు. నందు సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఆచారమే మృత్యుపాశమైంది!

- నెలసరి కారణంగా కుప్పిలో పడుకున్న ఆదివాసీ యువతిని కాటేసిన పాము
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి


సిడాం లక్ష్మి (ఫైల్)

గుడిహత్నూర్: ఆచారం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. నెలసరి సమయంలో పాటించాల్సిన కట్టుబాటు ఆ యువతికి శాపమైంది. ఈ విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామమైన న్యూ సోమార్‌పేట్‌లో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిడాం గిరిజాబాయి-భీంరావ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె సిడాం లక్ష్మి (26) పోడు వ్యవసాయం చేస్తున్న తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ ఎద్దులు, మేకలు చూసుకుంటోంది. కాగా, లక్ష్మికి శనివారం నెలసరి రాగా, వారి ఆచారం ప్రకారం ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విడిది (కుప్పి)లో నెలసరి అయిపోయే వరకు ఉండాలి. దీంతో లక్ష్మి శనివారం రాత్రి కుప్పిలోకి వెళ్లి నిద్రపోయింది. రాత్రి కుప్పిలోకి వచ్చిన పాము కాటు వేసింది. నిద్రమత్తులో లక్ష్మి గమనించలేదు. ఆదివారం ఉదయం మెలకువ వచ్చేసరికి కాలు బరువుగా, నొప్పిగా ఉండటంతో తల్లికి విషయం చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆటోలో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు చికిత్స ప్రారంభించినప్పటికీ అప్పటికే విషం శరీరమంతా పాకడంతో లక్ష్మి మృతి చెందింది.

17 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి సభ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీలో 17 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ జరగనుంది. దళిత, బహుజన, వామపక్ష, తెలంగాణ విద్యార్థి సంఘాల నేతృత్వంలో ఈనెల 7న మధ్యాహ్నం 2 గంటలకు ఆర్ట్స్ కాలేజీలోని 57వ తరగతి గదిలో సభను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రథమ వర్ధంతి సభకు పీహెచ్‌డీ స్కాలర్స్ సునీల్ శెట్టి, సలీం పాషాలు అధ్యక్షత వహించగా.. అరుణోదయ విమలక్క, సినీ దర్శకుడు నర్సింగరావు, విశ్రాంత ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, హరగోపాల్, కోదండరాం, అన్సారీతో పాటు తెలుగు శాఖ అధ్యాపకులు కాశీం, సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, గద్దర్ కూతురు వెన్నెలతో పాటు ఓయూ పూర్వవిద్యార్థి నేతలు హాజరుకానున్నట్లు ఆహ్వానితులు, పీహెచ్‌డీ స్కాలర్ కంచర్ల బద్రి వెల్లడించారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని పేర్కొన్నారు.

నాట్యమయూరికి తుది వీడ్కోలు

- కుటుంబ సభ్యులు, శిష్యులు, అభిమానుల మధ్య యామినీ కృష్ణమూర్తి అంత్యక్రియలు పూర్తి
- సంతాపం తెలిపిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, జేపీ నడ్డా
- ఆమె అంకిత భావం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని వ్యాఖ్య


యామినీ కృష్ణమూర్తి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రసిద్ధ నాట్య కళాకారిణి, పద్మవిభూషణ్ యామినీ కృష్ణమూర్తి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం పూర్తయ్యాయి. ఢిల్లీలోని గ్రీన్‌పార్క్ శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులు, శిష్యులు, కళాకారులు, పలువురు ప్రముఖులు ఆమెకు తుది వీడ్కోలు పలికారు. సాయంత్రం జరిగిన అంతిమయాత్రలో వందలాది మంది అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు.. యామినీ కృష్ణమూర్తి పార్థివదేహాన్ని హౌజ్‌ఖాస్‌లోని బల్‌బీర్ సక్సేనా మార్గ్‌లో ఆమె నిర్వహిస్తున్న 'యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్స్'లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు, కళాకారులు, అభిమానులు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కళా రంగానికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. యామినీ కృష్ణమూర్తి లేనిలోటు తీర్చలేనిదంటూ ఆవేదనకు గురయ్యారు.

కళా, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు: రాష్ట్రపతి ముర్ము

'ప్రముఖ నర్తకి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యామినీ కృష్ణమూర్తి మరణం గురించి తెలిసి ఆవేదనకు గురయ్యాను. ఆమె భరతనాట్యం, కూచిపూడిలో నిష్ణాతురాలు. ఆమె మరణం కళా, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఆమె కుటుంబానికి, స్నేహితులకు, అనుచరులకు నా సానుభూతి' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

తరతరాలకు స్ఫూర్తి: ప్రధాని మోదీ

'డాక్టర్ యామినీ కృష్ణమూర్తి మరణించడం బాధ కలిగించింది. భారతీయ శాస్త్రీయ నృత్యం పట్ల ఆమెకున్న నైపుణ్యం, అంకితభావం తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. దేశ సాంస్కృతిక యవనికపై చెరగని ముద్ర వేశారు. ఆమె మన వారసత్వాన్ని సుసంపన్నం చేయడానికి ఎంతో కృషి చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా సంతాపం' అని ప్రధాని నరేంద్రమోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

నృత్యకారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారు: నడ్డా

'యామినీ కృష్ణమూర్తి మరణ వార్త తెలిసి ఆవేదన చెందాను. ఆమె అసాధారణ నైపుణ్యం, భారతీయ శాస్త్రీయ నృత్యానికి చేసిన కృషి ఎనలేనిది. ఆమె తన కళలో రాణించడమే కాకుండా, ఒక మార్గదర్శిగా ఎంతోమంది నృత్యకారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారు. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఓం శాంతి' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు.

దర్రీస్ చేనేత కార్మికులకు 'కొండా లక్ష్మణ్‌బాపూజీ' అవార్డులు


దర్రీస్‌పై మహాత్మాగాంధీ చిత్రంతో ఆడెపు శ్రీనివాస్


దర్రీస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంతో సామల సదానందం

వరంగల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని (ఆగస్టు 7న) పురస్కరించుకుని దర్రీస్ నేత కార్మికులు వరంగల్ కొత్తవాడకు చెందిన ఆడెపు శ్రీనివాస్, సామల సదానందం.. కొండా లక్ష్మణ్‌బాపూజీ రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. కొత్తవాడ నుంచి ఐదుగురు నేత కార్మికులు పోటీ పడగా దర్రీస్‌పై మహాత్మాగాంధీ చిత్రంతో శ్రీనివాస్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంతో సదానందం అవార్డులను దక్కించుకున్నా రు. వీరికి హైదరాబాద్ పీపుల్స్‌ప్లాజాలో అవా ర్డులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవార్డులకు ఎంపికైన చేనేత కార్మికులను టీపీసీసీ చేనేత విభాగం వర్కింగ్ ప్రెసి డెంట్ చిప్ప వెంకటేశ్వర్లు అభినందించారు.

దీక్ష విరమించిన నేతన్నలు

- నేతన్నలతో చర్చించిన ప్రభుత్వ విప్, కలెక్టర్


కలెక్టరేట్‌లో నేతన్నలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: వస్త్రపరిశ్రమలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిరిసిల్లలో గత కొద్ది రోజులుగా నేతన్నలు చేపట్టిన దీక్షలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హామీతో ఆదివారం విరమించారు. కలెక్టరేట్‌లో జరిగిన చర్చల్లో విప్, కలెక్టర్‌లతోపాటు హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్, సెస్ చైర్మన్, జిల్లా అధికారులు, పవర్‌లూమ్ యజమానులు, ఆసాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే బతుకమ్మ చీరల బకాయిలు పలుమార్లు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. స్కూల్ యూనిఫామ్ క్లాత్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలు మినహా అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఇప్పటికే ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించామని శ్రీనివాస్ గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాల్లో పవర్‌లూమ్ పరిశ్రమకు అందిస్తున్న రాయితీలు ప్రోత్సాహకాలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పవర్‌లూమ్ పరిశ్రమలో విద్యుత్ సబ్సిడీ సమస్య పరిష్కరిస్తామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు హామీ ఇచ్చారు. చర్చల అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తాలో దీక్ష స్థలానికి చేరుకున్నారు. ఖీమ్యానాయక్ నేతన్నలకు నిమ్మరసం అందజేసి దీక్ష విరమింపజేశారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ ఏడీ సాగర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, జేఏసీ నాయకులు తాటిపాముల దామోదర్, మండల సత్యం, మూషం రమేశ్, గోవిందు రవి, పంతం రవి, వేముల దామోదర్, మండల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్ డిబేట్‌కు రాను: కమల

ఏబీసీ చానెల్‌లో చర్చకు సిద్ధమని వెల్లడి



వాషింగ్టన్: ఫాక్స్ న్యూస్ చానెల్‌లో డిబేట్‌కు రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ తోసిపుచ్చారు. నిజానికి అధ్యక్షుడు జో బైడెన్ ఆ పార్టీ అభ్యర్థిగా ఉండగా ఆయనతో సెప్టెంబర్ 10న ఏబీసీ చానల్లో రెండో డిబేట్‌కు ట్రంప్ అంగీకరించారు. అనంతరం బైడెన్ బదులు హారిస్ అభ్యర్థి అవడం తెలిసిందే. ఏబీసీ బదులు ఫాక్స్ న్యూస్ చానల్లో సెప్టెంబర్ 4న డిబేట్‌కు సిద్ధమని ట్రంప్ శనివారం ప్రకటించారు. దీన్ని హారిస్ తప్పుబట్టారు. ''ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్న ట్రంప్ ఇప్పుడేమో ఫలానా సమయంలో, ఫలానా చోటే అనడం ఆశ్చర్యకరం. అంగీకరించిన మేరకు సెప్టెంబర్ 10న ఏబీసీ న్యూస్‌లో చర్చకు నేను సిద్ధం. ఆయన పాల్గొంటారని ఆశిస్తున్నా'' అన్నారు. డిబేట్‌కు ట్రంప్ భయపడుతున్నారని హారిస్ ప్రచార బృందం వ్యాఖ్యానించింది. ఆయన తమాషాలు మానుకోవాలని హితవు పలికింది.

2029లోనూ ఎన్డీఏదే అధికారం: అమిత్ షా



చండీగఢ్: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మనుగడపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అనుమానాలను హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. తమ ప్రభుత్వం దిగ్విజయంగా మరో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోవమే గాక 2029లోనూ అధికారంలోకి వస్తుందని ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలు మరోసారి అదే పాత్రకు ఇప్పట్నుంచే సిద్ధం కావాలన్నారు. ''ప్రతిపక్షాలు ఏమైనా చెప్పనీయండి. 2029లోనూ ఎన్డీఏదే అధికారం. మోదీయే ప్రధాని'' అని పేర్కొన్నారు. ''ప్రతిపక్షాలు కాస్త విజయానికే ఎన్నికల్లో గెలిచేసినట్లు సంబరపడుతున్నాయి. కాంగ్రెస్ గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో కలిపి సాధించిన సీట్లను బీజేపీ ఒక్క 2024 ఎన్నికల్లోనే సాధించింది!'' అని అన్నారు. మోదీ ప్రభుత్వం కొనసాగదంటూ కావాలనే అయోమయం సృష్టించేందుకు మళ్లీమళ్లీ విపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్నారు.

దేశంకాని దేశంలో.. తమది కాని యుద్ధంలో...

సమిధలుగా మనోళ్లు

రష్యాలో ఉద్యోగాలు, విద్య పేరిట ఉచ్చు • బలవంతంగా ఉక్రెయిన్ యుద్ధంలోకి

ఏజెంట్ల చేతిలో నిలువునా మోసం • ప్రధాని చర్చించినా వదలని రష్యా

భవిష్యత్తు మీద బంగారు కలలతో ఆశలకు రెక్కలు కట్టుకొని ఆకాశంలోకి ఎగిరారు. ఉపాధి దొరికితే కొత్త ఉషోదయాలు చూస్తామనుకున్నారు. కానీం చివరకు తమది కాని యుద్ధంలో నిస్సహాయంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున తలపడుతున్న భారత యువకుల విషాదమిది. ఎందుకిలా జరుగుతోంది? తమది కాని దేశంలో, తమకు సంబంధమే లేని యుద్ధంలో వారు ఎందుకిలా బలవుతున్నట్టు...?

అతని పేరు రవి మౌన్. హరియాణాకు చెందిన 22 ఏళ్ల యువకుడు. రష్యాలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఏజెంట్ చెప్పాడు. నమ్మిన కుటుంబం భూమి తెగనమ్మి మరీ ఏజెంట్‌కు రూ.11.5 లక్షలు ముట్టజెప్పింది. తీరా జనవరి 13న రష్యాకు వెళ్లాక ఏజెంట్ మోసగించినట్టు అర్థమైంది. ఇప్పుడతని ముందు రెండే ఆప్షన్లు. పదేళ్ల జైలు. లేదంటే ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాటం. పదేళ్ల జైలు కంటే తనకిష్టం లేకున్నా యుద్ధ క్షేత్రాన్ని ఎంచుకున్నాడు రవి. ఈ విషయం కుటుంబానికి తెలియనివ్వలేదు. రష్యా సైనిక దుస్తుల్లో ఉన్న భారత యువకుల వీడియోలో అతన్ని చూశాకే వారికి తెలిసింది. చివరగా మార్చిలో కుటుంబంతో మాట్లాడాడు. అప్పటినుంచి వారికతని సమాచారమే లేదు. యుద్ధంలో మరణించిన వారి మృతదేహాలను పూడ్చేందుకు రాత్రంతా గోతులు, కందకాలు తవ్వడమే పని! నాలుగు నెలల తర్వాత యుద్ధభూమిలో ప్రాణాలొదిలాడు. రవి సోదరునితో పాటు రష్యాలోని భారత రాయబార కార్యాలయం కూడా సోమవారం దీన్ని ధ్రువీకరించింది. డ్రైవర్ ఉద్యోగం ఆశ చూపి యుద్ధానికి ఎలా బలి పెడతారన్న రవి కుటుంబం ప్రశ్నకు బదులిచ్చేదెవరు...?

భారీ వేతనాలు ఎర చూపి...

ఇది ఒక్క రవి కథే కాదు. ఎంతోమంది భారత యువకులకు భారీ వేతనంతో ఉద్యోగాలంటూ ఊరించి రష్యాకు తీసుకెళ్తున్నారు. చివరికిలా బలవంతంగా యుద్ధాన్ని నెత్తిన రుద్దుతున్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి మధ్య చాలామంది భారతీయులు ఇలా రష్యా సైన్యంలో చేరారు. వారికి్కూడా అక్కడికి వెళ్లేదాకా ఆ సంగతి తెలియదు! 2023 డిసెంబర్‌లో హర్ష్ కుమార్ అనే యువకున్ని బెలారస్‌కని చెప్పి తీసుకెళ్లిన ఏజెంట్ మధ్యలోనే వదిలేశాడు. రష్యా సైన్యానికి చిక్కడంతో యుద్ధంలో పాల్గొనాల్సి వచ్చింది. అమృత్‌సర్‌కు చెందిన తేజ్‌పాల్‌సింగ్ పరిస్థితీ అంతే. ఏజెంటుకు రూ.2 లక్షలు చెల్లించి మరీ ఉద్యోగం కోసం రష్యా వెళ్లి చివరకు సైన్యంలో తేలాడు. చివరగా మార్చి 3న కుటుంబంతో మాట్లాడారు. జూన్‌లో మరణించాడు. పశ్చిమ బెంగాల్‌లోని కాలింపాంగ్‌కు చెందిన ఉర్గెన్ తమాంగ్ క్రిమియా యుద్ధ ప్రాంతం నుంచి మార్చిలో వీడియో పంపాడు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం, మంచి జీతం పేరిట ఏజెంట్ మోసగించాడని వాపోయాడు. 10 రోజులు నామమాత్ర ఆయుధ శిక్షణ ఇచ్చి బలవంతంగా వార్ జోన్‌లోకి నెట్టారని వెల్లడించాడు. తన యూనిట్‌లోని 15 మంది రష్యనేతర సైనికుల్లో 13 మంది ఎలా దుర్మరణం పాలయ్యారో వివరంగా చెప్పుకొచ్చాడు. ఏపీ నుంచి కూడా పలువురు యువకులు ఈ వలలో చిక్కి ఉక్రెయిన్ యుద్ధక్షేత్రానికి చేరినట్టు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఇతని పేరు సయ్యద్ ఇలియాస్ హుసేనీ. కర్నాటకలోని కలబురిగి వాసి. వెనక ఉన్నది అతని మిత్రులు అబ్దుల్ నయీం, మహ్మద్ సమీర్ అహ్మద్. వీళ్లు, తెలంగాణలోని నారాయణపేటకు చెందిన మొహమ్మద్ సూఫియాన్ దుబాయ్ విమానాశ్రయంలో పని చేసేవారు. రష్యాలో సెక్యూరిటీ గార్డులు కావాలంటూ యూట్యూబ్‌లో ప్రకటనలు చూశారు. నెలకు లక్షకు పైగా జీతం వస్తుందన్న ఏజెంట్ మాటలు నమ్మి నలుగురూ గత డిసెంబర్లో రష్యా వెళ్లారు. వారిని బలవంతంగా సైన్యంలో చేర్చుకుని ఉక్రెయిన్ సరిహద్దులకు పంపారు. అక్కడి నుంచి ఇలియాస్ తమ దుస్థితిని ఇలా గోప్యంగా వీడియో తీసి పంపాడు. ఇలియాస్ తండ్రి నవాజ్ అలీ హెడ్ కానిస్టేబుల్. తన కొడుకును, అతని స్నేహితులను ఎలాగైనా సురక్షితంగా తీసుకు రావాలంటూ అప్పటినుంచీ అతను ఎక్కని గడప లేదు.

నేరం నిరుద్యోగానిదే...

సంపాదనకు విదేశీ బాట, ప్రవాస భారతీయుని హోదా మన సమాజంలో గౌరవ చిహ్నాలు. గ్రామీణ నిరుద్యోగిత మరీ ఎక్కువ ఉన్న పంజాబ్, హరియాణా యువత కెనడా, యూరప్ దేశాలకు విపరీతంగా వెళ్తుంటారు. కానీ ఆ దేశాలు వీసా నిబంధనలు కఠినతరం చేశాయి. రష్యన్ స్టాంప్ ఐరోపా దేశాలకు వెళ్లడానికి మార్గం సుగమం చేస్తుందనే ఆశతో పంజాబ్, హరియాణా యువకులు రష్యా బాట పడుతున్నారు. తీరా వెళ్లాక ఏజెంట్ల చేతిలో మోసపోయి యుద్ధంలో తేలుతున్నారు. రష్యా సైన్యంలో మనోళ్లు 40 మంది దాకా ఉన్నట్టు విదేశాంగ శాఖ గణాంకాలు చెబుతున్నా వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది.

8 మంది భారతీయుల మృతి: కేంద్రం

విదేశీ యువతను రష్యా ఇలా ఉక్రెయిన్ యుద్ధానికి బలి పెడుతున్న నేపథ్యంలో తమ పౌరులు ఆ దేశాలకు వెళ్లకుండా పలు దేశాలు గట్టి చర్యలు తీసుకుంటున్నాయి. నేపాల్ వంటి చిన్న దేశాలు కూడా ఈ విషయంలో నిబంధనలను కఠినతరం చేశాయి. మన దేశంలో అలాంటి చర్యల ఊసే లేదు! కనీసం మోసగిస్తున్న ఏజెంట్లపైనా చర్యల్లేవు. సరికదాం, రష్యాలో ఉపాధి కోసం వెళ్లే భారతీయులు జాగ్రత్తగా ఉండాలనే ప్రకటనలతో కేంద్రం సరిపెడుతోంది! మన యువకులు ఉక్రెయిన్ యుద్ధంలో బలవుతున్న వైనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలి రష్యా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యేకంగా చర్చించినా లాభం లేకపోయింది. మనోళ్లను స్వదేశానికి పంపేందుకు రష్యా అధికారులు ససేమిరా అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో 8 మంది భారతీయులు రష్యా తరఫున పోరాడుతూ మరణించినట్టు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తాజాగా గత గురువారం రాజ్యసభలో వెల్లడించారు. ''12 మంది భారతీయులు ఇప్పటికే రష్యా సైన్యాన్ని వీడినట్టు సమాచారముంది. మరో 63 మంది కూడా సైన్యం నుంచి త్వరగా విడుదల చేయాలని రష్యా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు'' అని వెల్లడించారు. రష్యా సైన్యం తరఫున యుద్ధక్షేత్రంలో పోరాడుతున్న భారతీయులను వెనక్కు పంపేలా ఆ దేశంతో అత్యున్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్టు చెప్పారు.

ఇలా మోసగిస్తున్నారు...

నిరుపేద యువతను వారికే తెలియకుండా రష్యా సైన్యంలోకి పంపేందుకు ఏజెంట్లు ప్రధానంగా లక్షల్లో జీతం, మెరుగైన జీవితాన్ని ఎరగా చూపుతున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఏడు నగరాల్లో సీబీఐ చేసిన దాడుల్లో భారీ మానవ అక్రమ రవాణా రాకెట్ వెలుగు చూసింది. దాని సభ్యులను విచారించగా ఈ వివరాలు బయటికొచ్చాయి.

- ఈ 'రష్యాలో ఉపాధి' ప్రచారానికి వారు ప్రధానంగా సోషల్ మీడియాను వాడుకుంటున్నారు.
- ఒకసారి బాధితులు తమ వల్లో పడగానే స్థానిక ఏజెంట్లు రంగంలోకి దిగుతారు. రంగుల కల చూపి ఒప్పిస్తారు.
- పలు సందర్భాల్లో ఉన్నత విద్యను కూడా ఎర వేస్తున్నారు.
- రష్యాలో దిగీ దిగగానే స్థానిక ఏజెంట్లు వాళ్ల పాస్‌పోర్టులు లాగేసుకుంటారు.
- ఆనక బలవంతంగా రష్యా సైన్యంలో చేరక తప్పని పరిస్థితులు కల్పిస్తారు.

'వక్ఫ్' అధికారాల కట్టడి!

- బోర్డుల్లో మహిళలకు ప్రాతినిధ్యం!
- 40 సవరణలకు కేబినెట్ ఆమోదం
- వచ్చే వారం పార్లమెంటులో బిల్లు
- సహించబోం: పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టాన్ని సమూలంగా మార్చేందుకు కేంద్రం సిద్ధమైంది. వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేస్తూ వక్ఫ్ చట్టానికి సవరణలకు కసరత్తు పూర్తి చేసింది. మొత్తం 40 సవరణలకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన మంత్రి వర్గ సమావేశం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఏదైనా ఆస్తిని వక్ఫ్ ప్రాపర్టీగా గుర్తించే వక్ఫ్ బోర్డు అధికారాన్ని పరిమితం చేయడమే సవరణల లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి. వాటి ప్రకారం వక్ఫ్ బోర్డు క్లెయిం చేసే ఆస్తులకు వెరిఫికేషన్ ప్రక్రియ తప్పనిసరి. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర బోర్డులలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం కూడా సవరణల్లో ఒకటి. బిల్లును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టవచ్చని సమాచారం. ఈ చర్యలను ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్రంగా ఖండించింది. వక్ఫ్ బోర్డుల అధికారాలు తదితరాల్లో ఎలాంటి జోక్యాన్నీ సహించేది లేదని ప్రకటించింది. అవసరమైతే కోర్టుకు వెళ్లయినా వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేసింది. వక్ఫ్ బోర్డులు సుమారు 9,40,000 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 8,70,000 ఆస్తులను పర్యవేక్షిస్తున్నాయి. వక్ఫ్ చట్టం 1995కు యూపీఏ ప్రభుత్వం 2013లో కొన్ని సవరణలు చేసి బోర్డుల అధికారాన్ని పెంచింది. పుణ్య, మతపరమైన లేదా ధార్మిక ప్రయోజనాల కోసం ఆస్తిని ఇవ్వడాన్ని వక్ఫ్ అంటారు. ఈ ఆస్తులను నియంత్రించడానికి చట్టం స్థాపించబడింది.ఈ భూములపై వచ్చే ఆదాయం పేద ముస్లింల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ కొరకు వాడాలి. దాతలు యిచ్చిన ఈ భూముల్ని అమ్మే అధికారం వక్ఫ్ బోర్డుకు సైతం లేదు. అయితే రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు విస్తృతమైన హక్కులున్నాయి. ఇలాంటి ఆస్తులను సర్వే చేయడానికి ఆలస్యమవుతోందని ప్రభుత్వం గతంలోనే గుర్తించింది. ఆస్తుల దుర్వినియోగాన్ని నివారించడానికి, వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షించడంలో జిల్లా మేజిస్ట్రేట్లను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పలు మార్పులు చేయాలని నిర్ణయించింది.

మత స్వేచ్ఛకు వ్యతిరేకం: ఒవైసీ

వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేసే ప్రతిపాదనను ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ''దీని వెనుక బీజేపీ హిందూత్వ ఎజెండా ఉంది. మత స్వేచ్ఛను దెబ్బతీయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. వక్ఫ్ ఆస్తులను లాక్కునేందుకే ఈ సవరణలు. ఇది మతస్వేచ్ఛకు విరుద్ధం'' అని ఆరోపించారు.

టిక్.. టిక్.. టిక్...

మిగిలింది 19 రోజులే

- ఇంకా ఐఎస్ఎస్‌లోనే సునీత
- 23 కల్లా బయల్దేరి తీరాలి
- లేదంటే క్రూ-9 మిషన్‌కు బ్రేక్



స్టార్‌లైనర్‌కు మరమ్మతులు చేస్తున్న వ్యోమగామి (ఇన్‌సెట్లో) సునీత

వాషింగ్టన్: బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికే (ఐఎస్ఎస్) పరిమితమైన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ విషయంలో ఉత్కంఠ పెరుగుతోంది. వారు మరో 19 రోజుల్లో వారం అక్కడి నుంచి బయల్దేరకపోతే మరో కీలక ప్రయోగాన్ని నిలిపివేయక తప్పదు. అందుకే నాసా సైంటిస్టులు, బోయింగ్ ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. అయినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు.

ఎందుకీ ఆందోళన?

విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ సంస్థ తొలిసారి అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్టను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు సునీత, విల్మోర్ జూన్ 5న ఐఎస్ఎస్‌కు బయలుదేరారు. అయితే నింగిలోకి దూసుకెళ్తున్న క్రమంలోనే అందులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. 28 థ్రస్టర్లకు గాను 5 మొరాయించాయి. సర్వీస్ మాడ్యూల్‌లో ఐదు చోట్ల హీలియం లీకేజీలు బయటపడ్డాయి. సౌనా సైంటిస్టులు భూమి నుంచే రిమోట్ కంట్రోల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. తర్వాత స్టార్‌లైనర్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమై జూన్ 13న సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారు. షెడ్యూల్ ప్రకారం వారం తర్వాత స్టార్‌లైనర్‌లో వెనక్కు రావాలి. కానీ దానికి పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తే తప్ప బయల్దేరలేని పరిస్థితి! మరోవైపు స్పేస్‌ఎక్స్ 'క్రూ-9 మిషన్'లో భాగంగా నాసా వ్యోమగాములు జెనా కార్డ్‌మాన్, నిక్ హేగ్, స్టెఫానీ విల్సన్, అలెగ్జాండర్ గోర్బునోవ్ ఈ నెల 18న ఐఎస్ఎస్‌కు బయలుదేరాల్సి ఉంది. వారు 23 కల్లా అక్కడికి చేరేలా గతంలోనే షెడ్యూల్ ఖరారైంది. ఐఎస్ఎస్ నుంచి స్టార్‌లైనర్ వెనక్కి వస్తే తప్ప 'క్రూ-9'ను పంపలేని పరిస్థితి! దాంతో ఏం చేయాలో అర్థం కాక నాసా తల పట్టుకుంటోంది. దీనికి తోడు ఐఎస్ఎస్‌లో సునీత ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్నట్టు సమాచారం. స్టార్‌లైనర్ త్వరలో సిద్ధం కాకుంటే ఆమెను రప్పించడానికి ప్రత్యామ్నాయం చూడాల్సి రావొచ్చు.

లవ్ జిహాద్‌కు జీవిత ఖైదు: అసోం

గువాహటి: హిందూ అమ్మాయిలను ముస్లింలుగా మారుస్తున్న 'లవ్ జిహాద్' దోషులకు యావజ్జీవ ఖైదు పడేలా కొత్త చట్టం తెస్తామని బీజేపీ పాలిత అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆదివారం ప్రకటించారు. ''ఎన్నికల వాగ్దానాలనే నెరవేర్చబోతున్నాం. లవ్ జిహాద్‌తో సంబంధమున్న వారికి జీవితఖైదు తప్పదు. ఇకపై అసోంలో పుట్టిన వారినే స్థానికులుగా గుర్తిస్తాం. వారికే ప్రభుత్వ ఉద్యోగాల అర్హత ఉంటుంది'' అన్నారు.

బ్రిటన్‌లో వలసదారులపై దాడులు తీవ్రం

ఇప్పటికే 100 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

లండన్: వలసలకు వ్యతిరేకంగా కొన్ని గ్రూపులు ఇచ్చిన పిలుపుతో బ్రిటన్‌వ్యాప్తంగా హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. లివర్‌పూల్, హల్, బ్రిస్టల్, లీడ్స్, బ్లాక్‌పూల్, స్టోక్ ఆన్ ట్రెంట్, బెల్‌ఫాస్ట్, నాటింగ్‌హామ్, మాంచెస్టర్‌లలో శనివారం వలసదారులుండే హోటళ్లపై దాడులు జరిగాయి. పలు చోట్ల పోలీసులతో ఆందోళనకారులు బాహాబాహీకి దిగారు. 100 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతివాదుల చర్యలను ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రధాని కెయిర్ స్టార్మర్ ఆదేశించారు. నేరపూరిత చర్యలకు తగు మూల్యం తప్పదని హోం మంత్రి వివెట్ కూపర్ హెచ్చరించారు. ఇంగ్లిష్ డిఫెన్స్ లీగ్ (ఈడీఎల్) అనే గ్రూపు ఈ గొడవలకు కారణమని చెబుతున్నారు. వారం క్రితం సౌత్‌పోర్ట్‌లో కత్తిపోట్లకు ముగ్గురు చిన్నారులు బలైన ఘటన అనంతరం వలసదారులే లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. శరీరం రంగును బట్టి దాడులు చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

'వర్గీకరణ తీర్పును అంగీకరించం'



లక్నో: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సమర్థించబోమని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదివారం స్పష్టం చేశారు. ''ఎస్సీ, ఎస్టీల ప్రజలందరూ అఘాయిత్యాలను ఎదుర్కొన్నారు. ఇందులో అందరూ సమానమే. ఏ ఒక్క కులానికీ మినహాయింపు లేదు. వెనుకబాటుతనంలో కూడా ఈ వర్గ ప్రజలంతా సమానంగా ఉన్నందున వర్గీకరణ సరికాదు'' అన్నారు. వర్గీకరణ అనుకూల తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్లు అవసరమైన వారిలో 90 శాతం మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టారు.

ఎన్నికల్లేకుండానే పార్లమెంటరీ కమిటీలు

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రక్రియ లేకుండానే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) వంటి కీలక కమిటీల ఏర్పాటు మొదలైంది. గత లోక్‌సభ హయాంలో వీటిని ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయగా ఈసారి అందుకు విరుద్ధంగా బిర్లా ఆయా కమిటీల సభ్యులను ఏకాభిప్రాయం ఆధారంగా స్పీకర్ ఓం నియమించనున్నారు. పీఏసీతోపాటు అంచనాల కమిటీ తదితరాలు ఏర్పాటయ్యాయి. వీటికి చైర్ పర్సన్లను స్పీకర్ త్వరలో నామినేట్ చేయనున్నారు.

వానలతో వణుకుతున్న ఉత్తరాది

న్యూఢిల్లీ: పశ్చిమ, మధ్య భారతాన్ని ఎడతెరిపి లేని వానలు వణికిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌తోపాటు జార్ఖండ్‌లో భారీ వర్షాలతో నదులు ఉప్పొంగుతున్నాయి. కశ్మీర్‌లో కుండపోత వానల కారణంగా శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో, కశ్మీర్‌తో లద్దాఖ్‌కు సంబంధాలు తెగిపోయాయి. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆదివారం నాటికి కేరళలో మృతుల సంఖ్య 221కి చేరింది. హిమాచల్‌లో 11 మంది చనిపోగా జాడ తెలియకుండాపోయిన 40 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన 370 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మహారాష్ట్రలో పుణేలో భారీ వర్షాలతో నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.

భారత్‌పై చైనా వాటర్ బాంబ్!

బీజింగ్: చైనా మనపై మరో కుయుక్తికి దిగుతోంది. తన అధీనంలోని టిబెట్ గుండా భారత్‌లోకి ప్రవహించే బ్రహ్మపుత్ర నదిపై భారీ జలవిద్యుత్కేంద్రం, డ్యామ్‌ను నిర్మించాలని తలపోస్తోంది. అదే జరిగితే అరుణాచల్ ప్రదేశ్, అసోంలకు తాగు, సాగు నీటి కష్టాలు తప్పవు. అంతేకాదు, యుద్ధమే వస్తే డ్యామ్‌ను నింపేసి ఒక్కసారిగా గేట్లన్నీ ఎత్తి భారత్‌లో పలు ప్రాంతాలను వరదతో ముంచెత్తే కుట్ర ఇందులో దాగుందని ఆస్ట్రేలియన్ స్ట్రాటజీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ అభిప్రాయపడింది. 'జల రాజకీయాలు: భారత్, చైనా భద్రతా పోరులో బ్రహ్మపుత్ర పాత్ర' పేరిట ఈ మేరకు తాజాగా నివేదిక విడుదల చేసింది. ''బ్రహ్మపుత్ర జలాలు అరుణాచల్ వద్ద భారత్‌లోకి మహోధృతంగా ప్రవహిస్తాయి. అక్కడే భారీ డ్యామ్‌కు చైనా ప్లాన్ చేస్తోంది. విద్యుదుత్పత్తి కోసమని చెబుతున్నా ప్రాజెక్టు నీటిమట్టం, నిల్వ, కిందకు వదిలే సమయం, పరిమాణం వంటి సమాచారాన్ని భారత్‌తో చైనా పంచుకునే అవకాశాల్లేవు. కనుక ఒక్కసారిగా వచ్చిపడే వరద ఉధృతిని ఎదుర్కొనేందుకు తగు ఏర్పాట్లు చేసుకునేందుకు భారత్‌కు అస్సలు సమయం ఉండదు. ఇలా డ్యామ్‌తో భారత్‌పైకి వాటర్‌బాంబ్‌ను చైనా గురిపెడుతోంది'' అని పేర్కొంది.

వయనాడ్ విలయానికి...

ఉమ్మడి కుటుంబం బలి!

నలుగురి మృతదేహాలు లభ్యం • ఇంకా 12 మంది జాడ గల్లంతు

వయనాడ్: అప్పటిదాకా ఇంటినిండా 16 మంది సభ్యుల సందడితో కళకళలాడిన ఆ ఉమ్మడి కుటుంబం ఒక్కసారిగా కళతప్పింది. కొండల మీదుగా దూసుకొచ్చిన ప్రకృతి ప్రళయం కుటుంబాన్ని అమాంతం మింగేసింది. చూరల్మల కుగ్రామంలో ఆ ఉమ్మడి కుటుంబంలో 42 ఏళ్ల మన్సూర్ ఒక్కడే మిగిలాడు. విపత్తు రోజున ఊళ్లో లేకపోవడంతో బతికిపోయాడు. తన ఇంట్లో 16 మందిని కొండలు కబళించాయంటూ విలపిస్తున్నాడు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ విలయానికి బలైన వారి సంఖ్య 221కి చేరినట్టు కేరళ ఆదివారం ప్రకటించింది. వాస్తవ సంఖ్య 370 దాటినట్టు స్థానిక మీడియా చెబుతోంది.

జీవనదిలో నిర్జీవ దేహాలు

వయనాడ్ తదితర తీరవాసులకు జీవనాడిగా పేరొందిన చలియార్ నది ఇప్పుడు విలయానికి గుర్తుగా మారింది. కొండచరియలకు బలైన వారి మృతదేహాలు ఆరు రోజులైనా ఇంకా నది ప్రవాహంలో కొట్టుకొస్తున్నాయి! ఘటనాస్థలి మీదుగా 40 కి.మీ.ల పొడవునా తీరం వెంట గాలింపు కొనసాగుతోంది.


సైన్యానికి సెల్యూట్.. బాలుడి లేఖ

వయనాడ్‌లో అన్వేషణ, సహాయక పనుల్లో సైన్యం కృషిని రాయన్ అనే స్థానిక చిన్నారిని కదలించింది. 'మీరు నిజంగా గ్రేట్' అంటూ మూడో తరగతి చదువుతున్న ఆ బాలుడు ఆర్మీకి లేఖ రాశాడు. ''ధ్వంసమైన నా వయనాడ్‌లో బాధితులను ఆర్మీ కాపాడుతున్న తీరు చూసి గర్వపడుతున్నా. మీ ఆకలిని కేవలం బిస్కెట్లతో చంపుకుంటూ శరవేగంగా బ్రిడ్జి కట్టడం టీవీలో చూశా. నేను కూడా ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తా'' అని పేర్కొన్నాడు. ''నువ్వు ఆర్మీ యూనిఫాంలో మాతో కలిసి పనిచేసే రోజు కోసం ఎదురుచూస్తున్నాం'' అంటూ ఆర్మీ అతనికి తిరుగు లేఖ రాసింది!

బంగ్లాలో మళ్లీ ఘర్షణలు

97 మంది మృతి

- విద్యార్థులు, యువత ఆందోళనలు హింసాత్మకం
- హసీనా రాజీనామాకు డిమాండ్, దేశవ్యాప్త కర్ఫ్యూ



ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు, విద్యార్థులు చేపట్టిన సహాయ నిరాకరణోద్యమం తొలిరోజే హింసాత్మకంగా మారింది. అధికార ఆవామీ పార్టీ కార్యకర్తలకు, ఆందోళకారులకు మధ్య ఆదివారం దేశవ్యాప్తంగా 13 జిల్లాల్లో జరిగిన ఘర్షణల్లో ఏకంగా 97 మంది మరణించారు. ఆందోళనల ధాటికి రాజధాని ఢాకాలో దుకాణాలు మూతబడ్డాయి. షాబాగ్‌లో వేలాది మంది విద్యార్థులు తదితరులు గుమికూడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బంగాబంధు షేక్ ముజీబ్ మెడికల్ కాలేజీలో వీరంగం సృష్టించారు. వాహనాలను తగలబెట్టారు. దాంతో రోగులు, వైద్యులు, విద్యార్థులు భయంతో వణికిపోయారు. దేశ విమోచన పోరాట అమరుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాను తగ్గించాలంటూ యువత, ఆందోళనకారులు ఇటీవల చేపట్టిన భారీ ఆందోళనల్లో 200కు పైగా చనిపోవడం తెలిసిందే. అందుకు బాధ్యత వహిస్తూ హసీనా గద్దె దిగాలంటూ నిరసనకారులు తాజాగా మళ్లీ ఉద్యమబాట పట్టారు. దాంతో దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. ఫేస్‌బుక్, వాట్సప్, మెసేంజర్, ఇన్‌స్టాగాం సేవలను నిలిపేశారు. 4జీ ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపేయాలని మొబైల్ ఆపరేటర్లను ఆదేశించారు. ఉద్యమం చేస్తున్న వారిలో యువత లేరని, ఉగ్రవాదులే ఉన్నారని హసీనా ఆరోపించారు. వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాజా పరిస్థితిపై ఆర్మీ, పోలీసు విభాగాల అధిపతులతో ఆమె సమీక్ష జరిపారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుందామంటూ నిరుద్యోగులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం, వారు తిరస్కరించడం తెల్సిందే.

రాజుకున్న చిచ్చు...

బంగ్లాదేశ్ విముక్తి యోధుల వారసులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ల నిర్ణయం ఇటీవల బంగ్లాలో చిచ్చు రేపడం తెలిసిందే. దాంతో సుప్రీంకోర్టు వాటిని 5 శాతానికి తగ్గించింది.

ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం

- హెజ్‌బొల్లా ప్రతీకార దాడులు
- ఇజ్రాయెల్‌పై నేడు ఇరాన్ దాడి!
- అమెరికా అధికారుల అంచనా

జెరూసలేం/టెల్ అవీవ్: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత తారస్థాయికి చేరుతోంది. లెబనాన్‌కు చెందిన షియా ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'హెజ్‌బొల్లా' ఇజ్రాయెల్‌పై తాజాగా రాకెట్లు ప్రయోగించింది. మొషావ్ బీట్ హిల్లెల్ ప్రాంతంలో పలువురు పౌరులు గాయపడినట్లు సమాచారం. తమపై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగానే హెజ్‌బొల్లా ఈ చర్యకు దిగింది. మరోవైపు ఇరాన్ కూడా సోమవారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్‌పై భీకర దాడులకు దిగొచ్చని ఆ దేశంతో పాటు అమెరికా అధికారులు కూడా అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా సైన్యం ఇప్పటికే రంగంలోకి దిగుతోంది. ఇరాన్ వెనక్కి తగ్గుతుందని న్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశాభావం వెలిబుచ్చారు.



హెజ్‌బొల్లా ముఖ్య నేత అలీ హతం

దక్షిణ లెబనాన్‌లోని బజౌరీ పట్టణంపై ఇజ్రాయెల్ తాజాగా డ్రోన్ దాడిలో హెజ్‌బొల్లా ముఖ్యనేత అలీ అబిద్ అలీ మరణించాడు. హెజ్‌బొల్లా కూడా దీన్ని ధ్రువీకరించింది. గాజాలో ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మరణించారు. టెల్ అవీవ్‌లో పాలస్తీనా పౌరుని దాడిలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు.

కంటైనర్ నౌకపై హౌతీల దాడి

హౌతీ తిరుగుబాటుదారులు శనివారం గల్ఫ్ ఆఫ్ అడెన్‌లో సౌదీ అరేబియాకు వెళ్తున్న నౌకపై క్షిపణి దాడికి పాల్పడ్డారు. దానికి నష్టం వాటిల్లేదని తెలిసింది.



వెంటాడి పట్టుకున్నారు..

అబిడ్స్ కట్టెలమండిలో కిడ్నాప్‌నకు గురైన బాలికను రంగారెడ్డి జిల్లా కొత్తూరు వరకు పోలీసులు ఛేజ్ చేసి రక్షించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. -8లో



క్రీడా సంబురం

సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు పాల్గొన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/23.0

నగర పరిధిలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం పడవచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతానికి కృషి చేయండి: ఆమ్రపాలి

లక్డీకాపూల్: నేటినుంచి ఈ నెల 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజువారీ కార్యక్రమాలను నిబద్ధతతో చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రధాన భూమిక పోషించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విభాగాల అధికారులు ప్రజలతో మమేకమై కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సూచనలు, భాగస్వామ్యంతో నగరం నిరంతరంగా పరిశుభ్రత పచ్చదనంతో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. నగర అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం, ప్రజలు సహకారం అందించినప్పుడే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని కమిషనర్ ఆమె పేర్కొన్నారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చివరి రోజున వన మహోత్సవ కార్యక్రమం ఉన్నప్పటికీ మొదటి రోజు నుంచే మొక్కలను ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో కుటుంబానికి అవసరమైన పూల మొక్కలతో పాటు, ఉసిరి, అల్ల నేరేడు, అశ్వగంధ, మనీ ప్లాంట్, గోరింటాకు, సీతాఫలం, పనస, మల్లె, కరివేపాకు, కలబంద తదితర మొక్కలను పంపిణీ చేయనున్నారు. వార్డు కార్యాలయాలు, పార్కులు, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో మొక్కలను పంపిణీ చేసేందుకు జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం ఏర్పాట్లు చేసింది.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- నేటి నుంచి మెడికల్ క్యాంప్‌లు

లక్డీకాపూల్: నగరంలో సీజనల్ వ్యాధుల నివారణకు ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. మెడికల్ క్యాంప్‌లలో సహాయ వైద్య ఆరోగ్య అధికారులు, సీనియర్, సహాయ ఎంటమాలజీ అధికారులు దోమల కారణంగా సంక్రమించే వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తారు. గుర్తించిన 108 వార్డులలోని 495 కాలనీల్లో హాట్ స్పాట్ మస్కిటో బ్రోన్ డిసీజ్ నివారణకు ఈ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జోనల్, డిప్యూటీ కమిషనర్లు షెడ్యూల్ ప్రకారం హెల్త్ క్యాంపు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. ఏఎంహెచ్‌ఓలు, సీనియర్, సహాయ ఎంటమాలజీలు యాంటీ లార్వా అడల్ట్ మాస్కిటో, ఫాగింగ్ చర్యలు చేపట్టనున్నారు.

మంచి నవల సినిమాగా మారే అవకాశం ఎక్కువ: దర్శకుడు వంశీ



రచయితలతో దర్శకుడు వంశీ, తనికెళ్ల భరణి

బంజారాహిల్స్: నవలతోనే తన సాహిత్య ప్రస్థానం మొదలైందని.. ఒక మంచి నవల సినిమాగా మారే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రముఖ దర్శకుడు వంశీ అన్నారు. ఆన్వీక్షికి-చదువు సంయుక్తంగా నిర్వహించిన 2023- ఉగాది నవలల పోటీ బహుమతి ప్రదానోత్సవం ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వంశీ విచ్చేసి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు చాలా జరిగాయని, సినిమా, సాహిత్యం వేర్వేరు దారుల్లో ప్రయాణిస్తున్న ఈ సమయంలో ఆన్వీక్షికి ద్వారా చేపట్టిన ఈ ప్రయత్నం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సినీ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. తెలుగులో పుస్తకాలు కొనే వాళ్లు పూర్తిగా లేరని, అనుకునే పరిస్థితి నుంచి ఒక పుస్తకం వేస్తే నెల రోజుల్లోనే వెయ్యి కాపీలు అమ్ముడవడంతో పాటు ఇంత పెద్ద ఎత్తున అవార్డు కార్యక్రమం నిర్వహించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. రూ.6 లక్షల ప్రైజ్ మనీతో మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో దాదాపు 150 మంది రచయితలు పాల్గొన్నారని, 28 నవలలను ఎంపిక చేసి ఆరు నెలల్లో ఈ వీటిని పాఠకులకు అందుబాటులో తేనున్నట్లు ఆన్వీక్షికి-చదువు నిర్వాహకుడు వెంకట్ సిద్ధారెడ్డి తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కడలి సత్యనారాయణ, బూడూరి సుదర్శన్ పేర్కొన్నారు.

సంగీతంతో ఆరోగ్యం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ రాధారాణి తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సంగీతం మనసును తేలికపర్చడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కోలుకునేలా చేస్తుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జాతీయ వాద్య కళాకారుల సంఘం, రాగవర్ధిని కల్చరల్ సొసైటీ సౌజన్యంతో జరిగిన పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి మహోత్సవం కార్యక్రమంలో జస్టిస్ రాధారాణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంగీతానికి మన భావోద్వేగాలు, ప్రవర్తన, సంభాషణ తదితరాలపై సానుకూల ప్రభావం చూపే శక్తి ఉందన్నారు. మ్యూజిక్‌తో ప్రతి ఒక్కరూ ఆనందంగా, రిలాక్సింగ్‌గా ఉండవచ్చన్నారు. మ్యూజిక్ థెరఫీ అనేది జీవితంపై సానుకూల ప్రభావాలను చూపిస్తుందని పేర్కొన్నారు. అనంతరం కళారత్న డీవీ మోహనకృష్ణ ఆధ్వర్యంలో బాలమురళి.. గాన రవళి సంగీత, సాంస్కృతిక మధుర గీతాలాపన అద్భుతంగా సాగింది. విశ్రాంత అదనపు రవాణా కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయశంకర్, తిరుపతి ఎస్వీ వర్సిటీ నాదస్వర పాఠశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వి. సత్యనారాయణ, ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్ర రత్న, డాక్టర్ ఎం. ప్రభాకర్‌రావు, పాత్రికేయులు ఎస్. వినయ్ కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ రంగయ్య, వంశీ రామరాజు, జాతీయ వాద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్‌వీ చెన్నారావు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కె.నర్సింహారావు, ఎల్.వెంకటరమణ, తెలంగాణ సంఘం కోశాధికారి వేముల శ్రీనివాసరావు, మహిళా సంఘం ప్రతినిధి ఎస్. మీరాబీ, సంగీత దర్శకులు డాక్టర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.





ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) వ్యాధిపై ఎన్‌జీఓ క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన పరుగు, సైక్లింగ్ ఆదివారం ఆద్యంతం ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది. నడవలేని కొందరు చిన్నారులను వారి కుటుంబ సభ్యులు వీల్‌చైర్లలో తీసుకువచ్చి ఇందులో పాల్గొనడం విశేషం. - రాయదుర్గం

ఉస్మానయా!

గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం

- అసెంబ్లీలో సీఎం ప్రకటనతో హర్షాతిరేకాలు
- సీఎం రేవంత్ అమెరికా పర్యటన తర్వాత..
- ఈ నెల 15న శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: ఎంతోమంది పేద రోగుల కల నిజం కానుంది. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న ఆ తరుణం రానే వచ్చింది. ఇన్నాళ్లు కోర్టు కేసులతో కొనసాగుతూ వచ్చిన ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో అందరి కళ్లల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. గోషామహల్ పోలీసు మైదానంలో కొత్త ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం 30 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ నెల 15న ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అమెరికా పర్యటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని చెబుతున్నారు.

750- 1000 పడకలతో..

బహుళ అంతస్తుల్లో ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ఆస్పత్రిలో 750 నుంచి 1,000 పడకల వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఓపీ విభాగంతో పాటు ఇన్‌పేషెంట్లకు అవసరమైన వార్డులు, పడకలు, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆపరేషన్ థియేటర్లు నిర్మించనున్నారు. సీసీటీవీల నిఘా, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణకు అనుగుణంగా ఈ భవనాన్ని నిర్మించాలని యోచిస్తున్నారు. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

నీటిపై రాతలే..

2014లో అప్పటి సీఎం కేసీఆర్ ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించారు. వారం రోజుల్లో పాత భవనాన్ని ఖాళీ చేసి దాని స్థానంలో కొత్త భవనం నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఆమేరకు తెలంగాణ తొలి బడ్జెట్లో రూ.200 కోట్లు కేటాయించారు. తాత్కాలికంగా పేట్లబురుజు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రులకు పలు వార్డులను తరలించాలని నిర్ణయించి, ఆ మేరకు ఆయా ఆస్పత్రుల్లో పడకలు కూడా సిద్ధం చేశారు. అక్కడికి వెళ్లేందుకు వైద్యులు నిరాకరించడంతో రోగుల తరలింపు నిలిచిపోయింది. ఇదే ఆస్పత్రి ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో మరో రెండు బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించినా, అడుగు కూడా ముందుకు పడలేదు.

ఇక్కడికి రవాణా సాధ్యమేనా..?

గోషామహల్ పోలీస్ మైదానంలో నిర్మించాలని ప్రతిపాదనలు చేస్తున్న తరుణంలో ఇక్కడ పరిస్థితులు రోగుల సేవలకు అనుకూలంగా ఉంటాయా? అనే విషయంలో కొందరు పెదవి విరుస్తున్నారు. ఈ ప్రాంతానికి చేరుకునేందుకు రోగులకు రవాణా సౌకర్యాలు అంతగా లేవని చెబుతున్నారు. బేగంబజార్ ప్రాంతంలో తీవ్రమైన ట్రాఫిక్ ఉంటుంది. ఎమర్జెన్సీ కోసం వచ్చే రోగులు అక్కడికి ఎలా చేరుకుంటారనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణం జరిగేంత వరకు ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆస్పత్రిలోనే సేవలు అందించనున్నారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణం చేపట్టి సేవలు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

పాత భవనానికి ఘన చరిత్ర..

ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హయాంలో (1918-25) ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం జరిగింది. సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో అలనాటి ప్రముఖ ఆర్కిటెక్ట్ విన్సెంట్ మార్గదర్శకత్వంలో ఈ మహా సౌధం వెలసింది. అప్పటి నుంచి ఇక్కడ తెలంగాణలోని అన్ని జిల్లాల ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందుతూ వస్తున్నాయి. కాలక్రమేణా ఈ ఆస్పత్రిపై ప్రభుత్వాల శీతకన్నుతో నిర్వహణ లోపాల కారణంగా శిథిలమవుతూ వస్తోంది. నాలుగేళ్ల క్రితం ఖాళీ చేసిన ఈ భవనంపై ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కొందరు ఆ భవనాన్ని కూల్చేసి మొత్తం స్థలంలో కొత్త భవనం నిర్మించాలని అంటుండగా, పాత భవనాన్ని అలాగే ఉంచి పక్కనే ఉన్న స్థలంలో నిర్మించాలని మరికొందరు డిమాండ్ చేశారు. ఇక ఈ భవనాన్ని అలాగే ఉంచి గోషామహల్ పోలీస్ మైదానంలో ఆస్పత్రిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ వివాదం ఇక్కడితో సద్దుమణిగింది.



కొర్రీల గ్యారంటీ!

- డేటా సవరించుకున్నా.. ప్రయోజనం సున్నా..
- కలెక్టరేట్, జీహెచ్ఎంసీలలో ప్రజాపాలన కేంద్రాలు
- అయినా వర్తించని విద్యుత్ జీరో బిల్లు, రూ. 500 వంటగ్యాస్
- లబోదిబోమంటున్న పేద కుటుంబాలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'గ్యారంటీ' వర్తింపు సవాలక్ష కొర్రీలుగా తయారైంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో వివరాలు సవరించుకుంటున్నా.. వర్తింపు మాత్రం అందని ద్రాక్షగా మారింది. కలెక్టరేట్, జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేసి సవరణలకు వెసులుబాటు కల్పించడంతో దరఖాస్తుదారులు బారులుతీరుతున్నారు. అయినా.. విద్యుత్ జీరో బిల్లుతో పాటు వంటగ్యాస్ సబ్సిడీ వర్తించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. కొన్ని కుటుంబాలు విద్యుత్ జీరో బిల్లుకు అర్హత సాధించినా.. గ్యాస్ సబ్సిడీకి నోచుకోలేకపోతున్నాయి.

తెల్ల రేషన్‌కార్డులున్నా..

తెల్ల రేషన్‌కార్డు గ్యారంటీ పథకాలకు ప్రామాణికంగా మారింది. ప్రభుత్వం సైతం బీపీఎల్ కుటుంబం గుర్తింపునకు తెల్ల రేషన్ కార్డు పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించిన విషయం విదితమే. గ్రేటర్ పరిధిలో సుమారు 24.74 లక్షల కుటుంబాలు గ్యారంటీ పథకాల వర్తింపునకు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో సుమారు 19.01 లక్షల కుటుంబాలకు మాత్రమే తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. మిగతా కుటుంబాలకు రేషన్ కార్డులు లేవు. అర్హుల్లో సైతం 40 శాతం కుటుంబాలకు కూడా పథకాలు వర్తించడం లేదు. దీనిపై పేదల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావడంతో అధికార యంత్రాంగం దరఖాస్తుల సవరణకు అవకాశం కల్పించింది. గత నెలలో ప్రజాపాలన కేంద్రాలు ప్రారంభించి దరఖాస్తుల సవరణ ప్రక్రియ చేపట్టింది. వంద కుటుంబాల్లో కనీసం పది కుటుంబాలకు కూడా వర్తింపు దక్కడంలేదు. సంబంధిత అధికారులను సంప్రదించినా స్పష్టత లేకుండాపోవడంతో పేద కుటుంబాలు తీవ్ర నిరాశలో కూరుకుపోయాయి. అధికారులు ఇకనైనా స్పందించాలి.







ఎట్టకేలకు స్పందించారు

'ఎన్నాళ్లీ నరకం' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. వరంగల్ జాతీయ రహదారిపై అసంపూర్తి దశలో నిలిచిపోయిన ఉప్పల్- నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అధికారులతో కలిసి ఫ్లై ఓవర్ నిర్మాణంపై అక్కడికక్కడే సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ రహదారిపై భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది.



ఇష్టారాజ్యం!

వికేంద్రీకరణతో బల్దియాలో పెరిగిన అవినీతి

- అధిక సంఖ్యలో అధికారులున్నా అక్రమాల కట్టడి సున్నా
- డిప్యుటేషన్లపై వచ్చినవారు పనులు చేయరు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది. రాష్ట్ర ఆడిట్ విభాగం వెల్లడించిన వివరాల మేరకే నిధులు పక్కదారి పడుతున్నా, సొంత జేబుల్లోకి మళ్లించుకుంటున్నా కనిపెట్టలేకపోతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేసుకోవచ్చు. అక్కడక్కడా వెలుగుచూసిన అక్రమాలు, అవకతవకలే రూ.కోట్లలో ఉంటున్నాయంటే అన్నీ జల్లెడ పడితే ఇంకెన్ని ఉంటాయో మరి!

వికటించిన వికేంద్రీకరణ

అక్రమాలు పెచ్చు పెరగడానికి అధికార వికేంద్రీకరణ కూడా ఒక కారణమని చెప్పక తప్పదు. వికేంద్రీకరణతో మెరుగైన ఫలితాలుంటాయని, అన్ని పనుల మంజూరు, బిల్లుల చెల్లింపుల వంటి అధికారాలన్నీ జోన్లకు బదలాయించారు. దాంతో జోన్లు, సర్కిళ్ల స్థాయిలో ఆడింది ఆట.. పాడింది పాటగా సాగుతున్నా పట్టించుకున్న వారు లేరు. వికేంద్రీకరణకు ముందు ఆయా విభాగాలు ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉండేవి. బిల్లులు ఇక్కడి నుంచే ఆమోదం పొందేవి. వారం వారం సమీక్షలతో పనులెలా జరుగుతున్నాయో, నిధులెలా ఖర్చవుతున్నాయో తెలిసేది. వికేంద్రీకరణతో ప్రధాన కార్యాలయంతో సంబంధం లేకుండా పోయింది. సమీక్షలు లేవు. ఉన్నతాధికారులంటే లెక్కలేకుండా పోయింది. కమిషనర్ స్థాయిలోని వారు వీడియో కాన్ఫరెన్స్‌ల వంటివి నిర్వహించడం మినహా జోన్లు, సర్కిళ్లకు- ప్రధాన కార్యాలయానికి సంబంధం లేకుండా పోయింది. తనిఖీల్లేకుండా పోయాయి. దాంతో ఆయా స్థాయిల్లో అవకతవకలు జరుగుతున్నా దృష్టికి రావడం లేదు. జీహెచ్ఎంసీలో ప్రత్యేకంగా ఫైనాన్స్ విభాగం, ఫైనాన్షియల్ అడ్వైజర్లు, అన్ని విభాగాల్లోనూ ఉన్నతాధికారులు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా సర్వీసు రికార్డులు లేకుండానే కుటుంబ పెన్షన్లు, పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు, ఖజానాకు రావాల్సిన ఆస్తిపన్ను వసూళ్ల సొమ్ములు సొంత జేబుల్లోకి పోతున్నాయంటే అందుకు బాధ్యులెవరు? ఉన్నతస్థాయిలోని వారికి వాటితో సంబంధం లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రకటనలు, ట్రేడ్ లైసెన్సులు, ఎస్టేట్స్ వంటి వాటి ద్వారా రావాల్సినంత ఆదాయం రావడం లేదు. అయినా పట్టించుకున్నవారు లేరు. అన్నీ చక్కదిద్దితే ఖజానా కళకళలాడే అవకాశాలున్నా పట్టింపులేదు.

అధికారులున్నా.. పనులు సున్నా

జీహెచ్ఎంసీకి డిప్యుటేషన్లపై వస్తున్న వారు ఇక్కడి నుంచి కదలకుండా పాతుకుపోతుండటంతో అధికారులు పెరుగుతున్నారే తప్ప అక్రమాల కట్టడి మాత్రం జరగడం లేదు. దీంతో అక్రమాల్లో వారికీ వాటాలున్నాయా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ జరిగినా వెళ్లకుండా కొందరు పాత స్థానాల్లోనే కొనసాగుతుండటం ఇందుకు ఊతమిస్తోంది. ఇతర విభాగాలనుంచి డిప్యుటేషన్లపై ఉన్నవారు ఏళ్లకేళ్లుగా కొనసాగుతున్నా వారిని ఎందుకు మాతృసంస్థలకు పంపించలేకపోతున్నారో అర్థం కాదు. వారి వల్ల బల్దియా ఖజానాకు భారమే తప్ప పైసా ప్రయోజనం లేదన్న అభిప్రాయాలున్నాయి.

అంతర్గత బదిలీల్లోనైనా చక్కదిద్దుతారా?

రాష్ట్రస్థాయిలో బదిలీలు పూర్తయ్యాయి. ఏళ్లగా పాతుకుపోయిన వారు పెద్దగా బయటకు వెళ్లలేదు. డిప్యుటేషన్ మీద దాదాపుగా పదేళ్లగా ఉంటున్నవారూ కదల్లేదు. ఇక అంతర్గత బదిలీలు జరగనున్నాయి. ఈ బదిలీల్లోనైనా ఏళ్లకేళ్లుగా పాతుకుపోయిన వారిని కమిషనర్ మారుస్తారా? లేక ఉన్నచోటనే కొనసాగిస్తూ కొందరిని మాత్రమే బదిలీలు చేస్తారా అన్నది వేచి చూడాల్సిందే. అంతేకాదు. జీహెచ్ఎంసీలో పనుల్లేకుండా ఉంటున్నవారూ తక్కువేం లేరు. పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగనిదే బల్దియాను ఎవరూ బాగు చేయలేరనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

ఫ్లై ఓవర్‌పై అదుపు తప్పిన బైక్

- గోడకు ఢీకొని రోడ్డుపై పడి..
- ఇద్దరు యువకుల దుర్మరణం
- గచ్చిబౌలి ఠాణా పరిధిలో ఘటన
- స్నేహితుల దినోత్సవం రోజున విషాదం
- మృతులు ఏపీలోని గుంటూరు జిల్లా వాసులు



రోహిత్ (ఫైల్)



బాల ప్రసన్న (ఫైల్)

రాయదుర్గం: స్నేహితుల దినోత్సవం రోజు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం పాలయ్యారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కుమారుడు వి.బాల ప్రసన్న (24) ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చాడు. ఇదే జిల్లా మర్రిచెట్టుపాలేనికి చెందిన తన స్నేహితుడు కె.రోహిత్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో కలిసి బాలప్రసన్న మియాపూర్‌లోని హఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం వేకువజామున బైక్‌పై వెళ్తున్నారు. రోహిత్ వాహనం నడిపిస్తుండగా ప్రసన్న వెనక సీటులో కూర్చున్నాడు. మసీదుబండ నుంచి హఫీజ్‌పేట్ మార్గంమధ్యలో కొత్తగూడ జంక్షన్ ఫ్లైఓవర్ మూల మలుపు వద్ద వీరి బైక్ అదుపు తప్పి ఫ్లై ఓవర్ గోడను ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలలకు, ఇతర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రసన్నను కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి, రోహిత్‌ను మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో రోహిత్ మృతిచెందాడు. బాల ప్రసన్న 5.18 గంటలకు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. 48 నిమిషాల వ్యవధిలో ఇద్దరు స్నేహితులూ మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులు పేర్కొన్నారు.

సాక్షి సోమవారం । 5 । ఆగస్టు । 2024


క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్

క్రీడా సంబురం

- ఘనంగా 31వ ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- హాజరైన రైల్వే ఉన్నతాధికారులు
- 15 జోనల్ రైల్వేల నుంచి 275 మంది క్రీడాకారులు


చాంపియన్‌షిప్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే ఉన్నతాధికారులు


రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: క్రీడాపోటీలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా స్నేహాన్ని పెంపొందించడం, జ్ఞాపకాలను సృష్టించుకోవడానికి దోహదపడుతాయని ఎస్‌సీఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు, సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్ కుమార్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆల్ ఇండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ -2024 ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు పావురాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం అలవడుతుందన్నారు. కఠినమైన శిక్షణ, సవాళ్లను అధిగమించడానికి ఛాంపియన్‌షిప్‌లు దోహదపడుతాయన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌తో సహా 15 జోనల్ రైల్వేల నుంచి 275 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. వంద మీటర్ల స్ప్రింట్ నుంచి హై జంప్ వరకు క్రీడాకారులు అసాధారణ నైపుణ్యాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక చాంపియన్‌షిప్ భారతీయ రైల్వే చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ (డీఎస్‌సీ) డెబస్మిత సి. బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

- యువతిపై లైంగికదాడి
- నిందితుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.అనంతపురం జిల్లాకు చెందిన యువతి (34) వెంగళరావునగర్‌లో ఉంటూ బేగంపేటలోని ఓ ఐటీ శిక్షణ సంస్థలో హెచ్‌ఆర్ శిక్షణ తరగతులకు హాజరవుతుంది. అదే శిక్షణ సంస్థలో కేవీ సంతోష్ చైతన్య అనే యువకుడు శిక్షణ పొందుతున్నాడు. ఇదిలా ఉండగా వర్షం కురిస్తే సదరు యువతి అద్దెకు ఉంటున్న ఇంట్లో నీరు కారుతుండటంతో శిక్షణ కేంద్రానికి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని సంతోష్ చైతన్యకు చెప్పడంతో తన తల్లి,చెల్లితో కలిసి ఇల్లు చూసి పెడతానని ఆమెకు హామీ ఇచ్చాడు. దీంతో సదరు యువతి జూన్ 5న ప్రకాష్‌నగర్‌లోని సంతోష్ చైతన్య ఇంటికి వెళ్లగా ఆమెను గదిలోకి తీసుకెళ్లి లైంగిక పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఐదు రోజుల పాటు ఆమెను తన ఇంట్లోనే ఉంచుకున్నాడు. ఆ తర్వాత పెళ్లి విషయమై ప్రశ్నించగా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు జులై 11న షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. వారు సంతోష్ చైతన్యను పిలిపించి నిలదీయగా తాను పెళ్లి చేసుకోనని చెప్పడంతో షీ టీమ్ పోలీసులు కేసును బేగంపేట పీఎస్‌కు బదిలీ చేశారు. బేగంపేట పోలీసులు అతడిని పిలిచి మాట్లాడగా బాధితురాలిని పెళ్లి చేసుకుంటానని లిఖితపూర్వకంగా పేర్కొన్న సంతోష్ చైతన్య ఆ మర్నాటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వెంటాడి పట్టుకున్నారు..

కట్టెలమండిలో బాలిక అపహరణ
- రంగారెడ్డి జిల్లా కొత్తూర్ వరకు చేజింగ్
- అపహరణకు గురైన బాలికను రక్షించిన పోలీసులు
- నిందితుడిపై బాలిక బంధువుల దాడి



వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్

అబిడ్స్: అబిడ్స్ కట్టెలమండిలో కిడ్నాప్‌నకు గురైన బాలికను రంగారెడ్డి జిల్లా, కొత్తూరు వరకు పోలీసులు ఛేజ్ చేసి రక్షించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ ఏసీపీ చంద్రశేఖర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక తన సోదరుడి కుమార్తెతో కలిసి (6) శనివారం మధ్యాహ్నం అబిడ్స్ కట్టెలమండిలోని పుట్టింటికి వచ్చింది. అక్కడ తన మరో సోదరుడి కుమారుడైన రుతిక్ (4) కలిసి సదరు బాలిక ఆడుకునేందుకు సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్దకు వెళ్లింది. కొద్దిసేపు ఆడుకున్న తర్వాత రుతిక్ ఇంటికి తిరిగి రాగా బాలిక తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన ప్రియాంక కుటుంబ సభ్యులతో కలిసి బాలికకోసం గాలించింది. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి బాలికను ఆటోలో ఎక్కించుకుని వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. ఆటోనెంబర్ ఆధారంగా పోలీసులు అఫ్జల్‌గంజ్ వరకు ఆటోను చేధించారు. అక్కడి నుండి అతను బాలికను బస్సులో తీసుకెళుతున్నట్లు గుర్తించారు. బస్సు నెంబర్ ఆధారంగా జహంగీర్‌పీర్ దర్గాకు వెళ్తున్న బస్సును గుర్తించారు. బాలికను అతను కొత్తూరు మండలం, ఎనుమాముల గ్రామానికి తీసుకెళ్లినట్లు గుర్తించిన పోలీసులు ఆదివారం ఉదయం కొత్తూరు పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లి నిందితుడు బీహార్‌కు చెందిన మహ్మద్ బిలాల్ అన్సారీ(32)ని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బాలికను రక్షించి నగరానికి తీసుకు వచ్చారు. నిందితుడు మహ్మద్ బిలాల్ బాలికను కిడ్నాప్ చేసి ఆమె తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేయాలని పథకం పన్నినట్లు డీసీపీ వెల్లడించారు. నిందితుడు గతంలో పబ్లిక్‌గార్డెన్స్ సమీపంలో ఉంటూ గోకుల్‌చాట్‌లో కొన్ని రోజులు పనిచేసినట్లు తెలిపారు. ఇటీవల కొత్తూరు ప్రాంతంలోని ఓ నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పనిలో చేరాడని, అదే గ్రామంలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నట్లు డీసీపీ తెలిపారు. బాలికకు సైకిల్ కొనిస్తానని మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడన్నారు. నిందితుడిపై గతంలో పలు కేసులు ఉన్నాయని కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అతను గతంలో ఓ బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అతను బీహార్‌లో వాహన చోరీ కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని, కొత్తూరు పీఎస్ పరిధిలోనూ చోరీ కేసు నమోదై ఉందని డీసీపీ వివరించారు. బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

నిందితుడిపై దాడి

నిందితుడిని ఆదివారం మధ్యాహ్నం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా బాధితురాలి బంధువులు, బస్తీవాసులు అతడిపై మూకుమ్మడిగా దాడి చేసి చితకబాదారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని అతడిని రక్షించారు.

ఎయిర్‌పోర్టు కిషన్‌గూడ ర్యాంపు మూసివేత

శంషాబాద్: జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ పనుల్లో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి కిషన్‌గూడ వైపు ఉన్న ర్యాంపు రహదారిని మూసివేశారు. ఇక్కడ సర్వీసు రోడ్లు, డ్రెయిన్ పనుల కారణంగా మరో 45 రోజుల పాటు ఈ రహదారి వాహనదారులకు అందుబాటులో ఉండదని సైబరాబాద్ పోలీసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు ప్రవేశం నుంచి వచ్చే వాహనాలు ట్రామాకేర్ వద్ద యూ టర్న్ తీసుకుని హైదరాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే దారులు యథాతథంగా ఉంటాయన్నారు.

200 మంది నిషాచరులు చిక్కారు!

సైబరాబాద్‌లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసులు మందుబాబుల మత్తు దించుతున్నారు. వీకెండ్స్‌లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ (డీడీ)లు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన డీడీల్లో 200 మంది నిషాచరులు పోలీసులకు చిక్కారు. వారిలో 153 మంది ద్విచక్ర వాహనదారులు కాగా, 11 మంది త్రీవీలర్లు, 31 మంది ఫోర్ వీలర్లు, ఐదుగురు భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారిలో 28 మంది మందుబాబుల బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) మోతాదు 200 ఎంజీ, 550 నమోదయింది. ఆయా వాహనదారులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

విజయవంతంగా హైదరాబాద్ మారథాన్ డ్రై రన్



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగబోయే ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ డ్రై రన్ విజయవంతంగా ముగిసింది. 5కే, 10కే తో పాటు హాఫ్ మారథాన్, ఫుల్ మారథాన్ మార్గాల్లో రన్నర్లు పరిగెత్తారు. హాఫ్ మారథాన్ నెక్లెస్ రోడ్డులో ఉదయం 5 గంటలకు ప్రారంభమైంది. 10కే రన్ ఉదయం 6.15 గంటలకు హైటెక్స్ క్యాంపస్ వద్ద ప్రారంభమైంది. 5కే రన్ గచ్చిబౌలి స్టేడియం క్యాంపస్ వద్ద ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైంది. అందరూ గచ్చిబౌలి స్టేడియం వద్ద తమ రన్‌ను ముగించారు. ఈ నెల 24న హైదరాబాద్ మారథాన్ జరగనుంది. ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ నుంచి గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. హైదరాబాద్ ప్రజల సంస్కృతిలో రన్నింగ్‌ను భాగం చేయాలనే ఉద్దేశంతో హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ కృషి చేస్తోంది.

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాఠి

జవహర్‌నగర్: విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని బఫెలో యూనివర్సిటీ అధ్యక్షులు, ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాఠి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బఫెలో యూనివర్సిటీ అధ్యక్షులు, ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాఠి న్యూయార్క్, బిట్స్ పిలానీ వీసీ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ కె.త్రిపాఠి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని భవిష్యత్తును నిర్దేశించుకోవాలన్నారు. నేటి యువత బలమైన నమ్మకంతో భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. టెక్నాలజీతోనే మానవ మనుగడ ముడిపడి ఉందన్నారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితేనే విజయం సాధ్యమన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1600 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కడ గలగల.. ఇక్కడ వెలవెల!


ఎండిపోయిన ఈసీ వాగు

జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం
- జంట జలాశయాలకు చేరని చుక్క నీరు
- ఇప్పటికీ పాతాళంలోనే గంగమ్మ..
- శేరిలింగంపల్లి, సరూర్‌నగర్‌లో వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కృష్ణాగోదావరి నదులు వరదలతో ఉప్పొంగుతుంటే జిల్లాలోని జంట జలాశయాలకు మాత్రం చుక్కనీరు చేరడం లేదు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడమే ఇందుకు కారణం. ఫలితంగా ఇటు హిమాయత్‌సాగర్ ఎగువన ఉన్న ఈసీ వాగు సహా అటు ఉస్మాన్‌సాగర్ ఎగువన ఉన్న మూసీ వాగులు చుక్కనీరు లేక వెలవెలపోతున్నాయి. దీంతో నగరానికి తాగునీరు అందించే కీలకమైన ఈ జంట జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. 2.56 టీఎంసీల సామర్థ్యం ఉన్న హిమాయత్‌సాగర్‌లో ప్రస్తుతం 1755.45 అడుగుల ఎత్తులో(సుమారు 1.95 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, 2.96 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఉస్మాన్‌సాగర్‌లో 1778.95 అడుగుల ఎత్తులో (సుమారు 2 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ఈ రెండు జలాశయాల నుంచి దిగువన ఉన్న పాతబస్తీకి రోజుకు సగటున 15 ఎంజీడీ వాటర్ నగరానికి సరఫరా అవుతుండటం, ఎగువ నుంచి చుక్కనీరు కూడా వచ్చి చేరకపోవడంతో వీటిలోని నీటినిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గిపోతోంది.

240.06మి.మీ.వర్షపాతం నమోదు

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జులైలో సాధారణంగా 242.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 240.06మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. శంకర్‌పల్లి, నందిగామ, తలకొండపల్లి, కేశంపేట, ఆమనగల్‌లో సాధారణం కంటే కొంత ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, మెయినాబాద్, మంచాల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చౌదరిగూడెం, కొందుర్గు, మాడ్గుల, హయత్ నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చేవెళ్ల, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్ మండలాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. కందుకూరు, రాజేంద్రనగర్, గండిపేట, ఫరూఖ్ నగర్, శంషాబాద్‌లలో అత్యల్ప వర్ష పాతం నమోదైంది. తక్కువ వర్షపాతం నమోదు కావడంతో పంటల సాగు కూడా ఘననీయంగా తగ్గింది. ఆయా మండలాల్లోని కీలకమైన చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలపోతుండటంతో, వ్యవసాయ బోర్లు కూడా వట్టిపోవడంతో వాటి కింద వరి సహా ఇతర పంటల సాగు తగ్గిపోయింది.

పాతాళంలో గంగమ్మ

ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయింది. గత ఏడాది 8.96 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు..ప్రస్తుతం 13.08 మీటర్ల లోతుకు వెళ్లినా కన్పించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. సరూర్‌నగర్‌లో గత ఏడాది 8.26 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు..ఈ సారి ఏకంగా 20.51 మీటర్ల లోతుకు పడిపోయాయి. శేరిలింగంపల్లిలో గత జులైలో 11.12 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు.. ఈ జులైలో 17.81 మీటర్ల లోతుకు పడిపోయాయి. అదే విధంగా ఇబ్రహీంపట్నంలో 12.52మీటర్ల నుంచి 17.53 మీటర్ల లోతుకు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 5.65 మీటర్ల లోతు నుంచి 9.95 మీటర్ల లోతుకు, కొత్తూరులో 8.87 మీటర్ల నుంచి 13.89 మీటర్ల లోతుకు, మహేశ్వరంలో 9 మీటర్ల నుంచి 13.89 మీటర్లలోతుకు, యాచారంలో 6.41 మీటర్ల నుంచి 10.49 మీటర్ల లోతుకు, తలకొండపల్లిలో 12.28 మీటర్ల నుంచి 18.85 మీటర్ల లోతుకు పడిపోయింది. బాలాపూర్‌లో 7.2 మీటర్ల లోతు నుంచి 10 మీటర్ల లోతుకు పడిపోయింది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా జరిగే ఫ్యూజో మీటర్ల పరిధిలోని మండలాల్లోనే భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

నగరంలో నేడు

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తిరుమల చారిటబుల్ ట్రస్ట్, సాధన సాహితీ స్రవంతి సంయుక్తంగా సాయంత్రం 6 గంటలకు లక్డీకాపూల్‌లోని రవీంద్రభారతిలో కే.వీ రాఘవాచార్యులు స్మారక పండిత పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. ఈ పురస్కారాన్ని డాక్టర్. పెరంబుదూర్ శ్రీరంగాచార్యులుకు, నిరంతర చైతన్యశీలి డాక్టర్ కేవీ రమణాచార్య స్ఫూర్తి పురస్కారాన్ని విద్యావేత్త భాష్యం శ్రావన్ కుమార్‌కు ప్రదానం చేయనున్నారు.
- 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దేశభక్తి పాటల పోటీలు జరుగుతాయి. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వందేమాతరం ఫౌండేషన్ ఈ పోటీలు నిర్వహిస్తుంది.
- కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 4 గంటల నుంచి శ్రావణ మాస ప్రత్యేక పూజలు జరుగుతాయి.
- ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా క్యాటరర్స్ ఆధ్వర్యంలో మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి సదస్సు, ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- అశోకా లేల్యాండ్ ఎక్స్‌పో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుంది.
- ట్యూబ్స్ అండ్ పైప్స్ ఫెయిర్ 2024 మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుంది.

నడుస్తున్న కారులో మంటలు..

సనత్‌నగర్: నడుస్తున్న కారులో నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు..క్షణాల్లో మంటలు వ్యాపించాయి. దీంతో కారు నడుపుతున్న వ్యక్తి అప్రమత్తమై భార్యతో సహా కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈసీఐఎల్ సమీపంలోని దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీకి చెందిన రవీందర్, అతడి భార్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి వీరు నిజాంపేట నుంచి దమ్మాయిగూడ వైపు హోండా సిటీ కారులో వస్తుండగా బేగంపేట పీ అండ్ టీ ఫ్లైఓవర్ పైకి రాగానే కారు ఇంజిన్‌లో నుంచి పొగలు రావడాన్ని గుర్తించి కిందికు దిగారు. రవీందర్ కారు బానెట్ తెరిచి చూసేలోగా మంటలు వ్యాపించాయి. వెంటనే డయల్ 101కు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదు. అయితే కారు పాక్షికంగా కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో మేడ్చల్‌కు చెందిన ముగ్గురు మెకానిక్‌ల దుర్మరణం


సాయిప్రకాష్, కిషన్, రమేష్ (ఫైల్)

మేడ్చల్: శ్రీశైలం వెళుతున్న ముగ్గురు మెకానిక్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. మేడ్చల్ మున్సిపాలిటీ, అత్వెల్లిలోని జయరాం ఆటోమోటివ్ (మహేంద్ర ట్రాక్టర్ షోరూం)లో కొంపల్లికి చెందిన సాయిప్రకాష్(24) ,బొల్లారానికి చెందిన కిషన్(22) కోస్గి కి చెందిన రమేష్(21) లు జయరాం మెకానిక్‌లుగా పని చేస్తున్నారు. శనివారం తమ బంధువుల కారు తీసుకుని సికింద్రాబాద్‌లో మరో స్నేహితుడితో కలిసి శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. నాగర్ కర్నూల్ జిల్లా, వటువార్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురూ మృతి చెందారు. చేతికి అందివచ్చిన యువకులు మరణించడంతో మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ప్రాణం తీసిన వేగం

అతివేగంగా బైక్‌ను నడపడంతో ఎగిరిపడి వెనుక కూర్చున్న యువకుడి దుర్మరణం


జై స్వామి శంకర్(ఫైల్)

మాదాపూర్: ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడపడంతో వెనక కూర్చున్న మరో యువకుడు ఎగిరిపడి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమలాపురం ప్రాంతానికి చెందిన ప్రవీణ్(25), అరిగాలి జైస్వామి శంకర్(24) సికింద్రాబాద్‌లోని పారడైజ్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఇన్సూరెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ కేపీహెచ్‌బి రోడ్ నెంబర్ 6లో నివాసముంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున వారు ఇద్దరూ స్నేహితులను కలిసేందుకు బైక్‌పై బయలుదేరారు. ప్రవీణ్ బైక్ నడుపుతుండగా జైస్వామి శంకర్ వెనక కూర్చున్నాడు. జేఎన్‌టీయూ నుంచి మాదాపూర్ వైపు వెళుతుండగా అతివేగం కారణంగా మాదాపూర్‌లోని ఎస్ఐపీ ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పడంతో ప్రవీణ్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక కూర్చున్న జైస్వామి శంకర్ ఎగిరి కిందపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న లారీ చక్రాలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయస్వామి గుడి స్థలం కబ్జా


హనుమాన్‌ గుడి స్థలంలో అక్రమ నిర్మాణాలు

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్‌ బస్తీలో హనుమాన్‌ దేవాలయం గుడిని ఆనుకుని ఉన్న 30 గజాల ఆలయ స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ ప్రభుత్వ స్థలాన్ని విక్రయించినట్లుగా ఆరోపణలు వినవస్తున్నాయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు. బస్తీ ఏర్పడినప్పుడే ఈ గుడికి స్థలం కేటాయించడం జరిగిందని, పక్కనే ఉన్న 30 గజాల స్థలం గుడికి చెందినదేనని, ఇటీవల ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూల్చివేయాలని కోరారు. స్థలం స్వాధీనం చేసుకునే వరకు పోరాటం చేస్తామని, జిల్లా కలెక్టర్‌, షేక్‌పేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

డబుల్‌ బెడ్‌రూంలు ఇప్పిస్తానని మోసం

బంజారాహిల్స్‌: ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లను తనకున్న రాజకీయ పలుకుబడితో ఇప్పిస్తానని నమ్మించి ఓ సినీ నటిని మోసగించిన నిందితుడిపై జూబ్లీహిల్స్‌ పోలీసులు చీటింగ్‌ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీకృష్ణానగర్‌లో నివసించే నడింపల్లి సుజాత సీరియల్‌ యాక్టర్‌గా, సినిమాల్లో హెయిర్‌ డ్రెస్సర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో సినీ నటీనటులను కారులో షూటింగ్‌ల్లో దింపేందుకు నియమించుకున్న ఎస్‌.శ్రీనివాస్‌రెడ్డితో ఆమెకు పరిచయం ఏర్పడింది. తనకు చాలామంది రాజకీయ నాయకులు తెలుసునని, డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. ఆమె తనతో పాటు పనిచేస్తున్న మరికొందరి నుంచి రూ.6.52 లక్షలు వసూలు చేసి శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చింది. అయితే ఎంతకీ డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు ఇప్పించకపోగా ఇటీవల మాటమార్చాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాకు రావాల్సిన బిల్లులు చెల్లించండి

పంజగుట్ట: గత సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఉచిత చేప పిల్లల సరఫరా చేసిన రైతులకు ఇంకా బిల్లులు రాలేవని వెంటనే బిల్లులు చెల్లించాలని తెలంగాణ చేప పిల్లల ఉత్పత్తి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన చేపపిల్లల ఉత్పత్తి రైతు, తెలంగాణ ముదిరాజ్‌ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి బొల్ల వెంకట్‌ ముదిరాజ్‌ మాట్లాడుతూ తాము 2023 - 24 సంవత్సరానికిగాను మత్స్యశాఖ ద్వారా పిలవబడిన టెండర్‌లో పాల్గొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపపిల్లల సరఫరా గత సంవత్సరం ఆగస్టు నుంచి నవంబర్‌ నెలలోపు పూర్తి చేశామని తెలిపారు. వాటి బిల్లు జనవరి మాసంలో రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని ఆయన పేర్కొన్నారు. చేపపిల్లల పెంపకం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, సరఫరాకు రవాణా ఖర్చులు అధికభారమయ్యిందని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన తమకు రావల్సిన బిల్లులు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమకు రావల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో 2024 - 25 సంవత్సరానికి గాను టెండర్‌ వేయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు.

'ది రెసిలెంట్‌ పాత్‌' పుస్తక ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంగీతారెడ్డి

బంజారాహిల్స్‌: అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ హోం గ్రోన్‌ సీఈవో సుబ్రహ్మణ్యం యడవల్లి రాసిన తొలి పుస్తకం 'ది రెసిలెంట్‌ పాత్‌'ను హోటల్‌ దసపల్లాలో అపోలో హాస్పిటల్స్‌ గ్రూప్‌ జాయింట్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సంగీతారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకం మన జీవనానికి సంబంధించిన ప్రత్యేకమైన దృక్కోణాలను అందిస్తుందన్నారు. మార్పును స్వీకరిస్తూ.. వేగవంతమైన ప్రపంచంలో అభివృద్ధి చెందడం తెలుపుతుందన్నారు. ఇది మన బాహ్య వాతావరణం తాలూకా గందరగోళంలో సమతుల్యత, అంతర్గత సామరస్యాన్ని కనుగొనేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

ప్రత్యేక పూజలు


జీటీఎస్‌ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జీటీఎస్‌ కాలనీ సమీపంలోని శ్రీవీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్‌ టెంపుల్‌)లో ఆదివారం అమావాస్యను పురస్కరించు కుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం 8.30 గంటల నుంచే పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయంలో ముఖ్యంగా కాలసర్ప శాంతి హోమం, రాహుకేతు పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. జీటీఎస్‌ టెంపుల్‌ ప్రధాన అర్చకులు దేవేందర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

పంజగుట్ట: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు 250 గజాల స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రతీ నెలకు రూ. 25 వేల పింఛన్‌ వెంటనే ఇవ్వాలని తెలంగాణ అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మణ్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరామ్‌ చొరవ తీసుకుని ముఖ్యమంత్రితో త్వరలోనే అమరుల కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయించాలని ఆయన కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళ, ఉపాధ్యక్షుడు నాగరాజుతో కలసి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడతాయని తమ కుటుంబ సభ్యులు వారి ప్రాణాలను తృణప్రాయంగా వదిలారని అలాంటి వారి కుటుంబ సభ్యులను గత 10 సంవత్సరాలుగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమరుల కుటుంబాలకు సమయం ఇచ్చి వారి సాదక బాధలు వినాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సరస్వతి, చంద్రకాంత్‌, ప్రవీణ్‌, నరేష్‌, ధన్‌రాజ్‌, కనకరాజులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి, గృహజ్యోతికి

దరఖాస్తుల వెల్లువ

కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదని స్పష్టం చేసిన అధికారులు

- ప్రజాపాలన దరఖాస్తు పత్రాలు సమర్పించాలని సూచన
- వార్డు కార్యాలయాల్లోనూ దరఖాస్తుల స్వీకరణ


ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

బంజారాహిల్స్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారం చేపట్టేందుకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గ్యాస్‌ సబ్సిడీ, మహాలక్ష్మీ పథకం, 200 యూనిట్ల లోపు విద్యుత్‌ వినియోగం (గృహజ్యోతి పథకం)లో భాగంగా ప్రజాపాలన కౌంటర్లలో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలామంది వాటికి సరైన పత్రాలు సమర్పించకుండా ఉండడంతో ఈ పథకాలకు అనర్హులయ్యారు. అర్హత ఉండి కూడా సరిగ్గా దరఖాస్తు చేసుకోని కారణంగా గ్యాస్‌ సబ్సిడీ, గృహజ్యోతి 200 యూనిట్ల లోపు విద్యుత్‌ పథకాలకు దూరమయ్యారు. దీంతో గత పార్లమెంట్‌ ఎన్నికలకు ముందు అర్హులైన వారందరూ సరైన పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సర్కిల్‌ కార్యాలయాల్లో మరోసారి సంబంధిత పత్రాలను జతచేసి దరఖాస్తులు అందజేశారు. సరిగ్గా వీటి స్క్రూటినీ జరుగుతున్న సమయంలోనే పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌ అడ్డురావడంతో అప్పుడు దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయి మరోవైపు తీసుకున్న వారి దరఖాస్తులను కూడా స్క్రూటినీ చేయలేకపోయారు. దీంతో గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాలు అర్హత ఉన్నా సరే తమకు లబ్ధి చేకూరడం లేదని గత కొంతకాలంగా చాలా మంది సర్కిల్‌ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత జులై 22వ తేదీ నుంచి ఆయా సర్కిల్‌ కార్యాలయాల్లో, వార్డు కార్యాలయాల్లో అభయహస్తం దరఖాస్తులను మళ్లీ స్వీకరిస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వస్తుండడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఖైరతాబాద్‌, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, హిమాయత్‌నగర్‌, షేక్‌పేట, ఎర్రగడ్డ, రహమత్‌నగర్‌, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్‌, బోరబండ డివిజన్లకు సంబంధించిన మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు సర్కిల్‌ కార్యాలయాల్లోనూ, వార్డు కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేశారు. చాలామంది ఈ కౌంటర్లలో తమ దరఖాస్తులను అందజేసేందుకు బారులు దీరుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో కొన్ని అంశాలను ప్రస్తావించకపోవడం, ఆధార్‌, రేషన్‌కార్డు సరిగ్గా లేకపోవడం తదితర లోపాలతో తిరస్కరణకు గురయ్యారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన ఫైల్‌ నెంబర్‌ను తాజాగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో చూపిస్తే సదరు అధికారి వెంటనే ఆ ఫారాన్ని తెరిచి వివరాలను నమోదు చేస్తారు.

10 నిమిషాల్లోనే ఆన్‌లైన్‌..

ప్రజాపాలనలో దరఖాస్తు చేసినప్పటి రశీదు, రేషన్‌కార్డు, కుటుంబ యజమానురాలి ఆధార్‌ కార్డు, 200 యూనిట్ల లోపు ఉన్న ఇంటి కరెంటు బిల్లు సమర్పిస్తే 10 నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో నమోదు పొందుపరుస్తున్నారు. వెంటనే ఆ రెండు పథకాలకు అర్హులుగా మారతారు. మళ్లీ ఈ సేవలను పునఃప్రారంభించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏ డివిజన్‌ కౌంటర్లు ఎక్కడంటే..

- వెంకటేశ్వరకాలనీ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు అభయహస్తం దరఖాస్తుల వివరాలను ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయంలో నమోదు చేయవచ్చు.
- బంజారాహిల్స్‌ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు తమ అభయహస్తం దరఖాస్తులను ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయంలో అందజేయవచ్చు.
- జూబ్లీహిల్స్‌ డివిజన్‌ పరిధిలోని ప్రజలు మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాలకు సంబంధించిన వివరాల దరఖాస్తులను ఖైరతాబాద్‌ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 కార్యాలయంలో అందజేయవచ్చు.
- షేక్‌పేట డివిజన్‌ దరఖాస్తులను షేక్‌పేట స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో తీసుకుంటున్నారు.
- ఖైరతాబాద్‌ డివిజన్‌ ప్రజల దరఖాస్తులను శాఖా మైదానంలో ఉన్న వార్డు కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.
- సోమాజీగూడ డివిజన్‌ దరఖాస్తులను పంజగుట్ట ఆఫీసర్స్‌ కాలనీలోని జలమండలి కార్యాలయం వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.

నేటితో ముగియనున్న వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల కాటన్‌, సిల్క్‌, డిజైనరీ చీరలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్‌ సిల్క్‌ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్‌ నేటితో ముగియనున్నది. ఈ ప్రదర్శనలోని చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుభకార్యాలకు, పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంలో ఈ ఎగ్జిబిషన్‌ను 70 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని ఇండియన్‌ సిల్క్‌ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

వేడుకగా మ్యూజిక్‌ వర్క్‌షాప్‌ గ్రాండ్‌ ఫినాలే



సాక్షి, సిటీబ్యూరో: కోమండూరి రామాచారి ఆధ్వర్యంలో లిటిల్‌ మ్యూజిషియన్స్‌ అకాడమీ ఏటా నిర్వహించే గ్లోబల్‌ మ్యూజిక్‌ వర్క్‌షాప్‌ గ్రాండ్‌ ఫినాలే ఆదివారం జరిగింది. శ్రీనగర్‌ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఈ కార్యక్రమం జరిగింది. అమెరికా, బ్రిటన్‌, నార్వే, కెనడా తదితర దేశాల నుంచి 75 మంది ప్రవాస భారతీయ విద్యార్థినీ విద్యార్థులకు ఐదు రోజులపాటు వర్క్‌షాప్‌ జరిగింది. ముగింపు వేడుకలకు మాజీ డీజీపీ హెచ్‌జే దొర పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్‌, గాయని మంగ్లీ, గీతా మాధురి, సాహితీ చాగంటి, రమ్య బెహరా పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై

'ఫెర్నాండెజ్‌' ఉద్యోగుల వాకథాన్‌


వాకథాన్‌లో ఫెర్నాండెజ్‌ హాస్పిటల్‌ ఉద్యోగులు

పాల్గొన్న 100 మంది ఉద్యోగులు

బంజారాహిల్స్‌: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఫెర్నాండెజ్‌ హాస్పిటల్‌ ఆధ్వర్యంలో కేబీఆర్‌ పార్కు వేదికగా ఆదివారం 'వాకథాన్‌' నిర్వహించారు. 'క్లోజింగ్‌ ది గ్యాప్‌.. బ్రెస్ట్‌ ఫీడింగ్‌ సపోర్ట్‌ ఫర్‌ ఆల్‌' థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తల్లీబిడ్డ ఇద్దరికీ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. తల్లిపాలు ఇవ్వడం, దాని ప్రాధాన్యతను తెలియజేయడం, తల్లులకు ఈ విషయంపై అవగాహన కల్పించడం, ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ వాకథాన్‌ కొనసాగింది. తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, సవాళ్లను వివరించే స్లోగన్స్‌తో పాటు తల్లిపాల అవగాహనను పెంపొందించే ప్లకార్డులను పట్టుకుని వాక్‌థాన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్నాండెజ్‌ ఫౌండేషన్‌ సీనియర్‌ కన్సల్టెంట్‌ పీడియాట్రిషియన్‌, సోషల్‌ ఇనిషియేటివ్స్‌ హెడ్‌ డాక్టర్‌ ప్రమోద్‌ మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యానికి, తల్లుల సాధికారతకు తల్లిపాలు ఎంతో కీలకమన్నారు. తల్లిపాల శ్రేష్ఠత గురించి తెలియజేయడం మనందరి కర్తవ్యమన్నారు. నియోనాటాలజీ విభాగం హెడ్‌ డాక్టర్‌ తేజో ప్రతాప్‌ ఓలేటి మాట్లాడుతూ అందరి సమష్టిగా కృషి చేసి తల్లులు, వారి జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

బహుజనుల కోసం పోరాడేది బీఎస్పీ మాత్రమే


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌ సిద్ధార్థ తదితరులు

ఖైరతాబాద్‌: బహుజనుల కోసం ఎల్లప్పుడు పోరాడేది, పోరాడుతూనే ఉండేది బీఎస్పీ మాత్రమే అని బిఎస్పీ పార్టీ సెంట్రల్‌ కో ఆర్డినేటర్‌, మాజీ పార్లమెంట్‌ సభ్యుడు అశోక్‌ సిద్ధార్థ్‌ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ పార్టీ సమావేశంలో సిద్ధార్థ్‌ మాట్లాడుతూ బహుజనుల సామాజిక స్థితిగతుల గురించి మాట్లాడుతూ నాడు కాన్సీరాం, మాయావతి ఎటువంటి పదవులు ఆశించకుండా కేవలం బహుజనుల శ్రేయస్సు లక్ష్యంగా కేంద్రంలో ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. ఇది అణగారిన కులాల పట్ల వారి నిబద్ధత తెలుపుతోందని, మళ్లీ నేడు కులాల వారీగా చీలిన ప్రాంతీయ పార్టీలు, అటు మతవాదంతో బీజేపీ, ఇంకో వైపు కాంగ్రెస్‌తో ఒరిగేది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ డీజీపీ, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ పూర్ణచంద్ర రావు, తెలుగు రాష్ట్రాల ఇతర కార్యవర్గ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

చంపేస్తామని క్రికెటర్‌కు బెదిరింపు కాల్స్‌

పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్‌: ఏడాదిలోగా నిన్ను దారుణంగా హత్య చేస్తామంటూ వరుస బెదిరింపు కాల్స్‌తో భయభ్రాంతులకు గురైన ఓ క్రికెటర్‌ తనకు ప్రాణహాని ఉందంటూ జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-10లోని ప్లాట్‌ నెంబర్‌ 145లో నివసించే టి.అరవింద్‌ (23) ప్రొఫెషనల్‌ క్రికెటర్‌. గత నెల 21వ తేదీన అర్ధరాత్రి ఆయనకు గుర్తుతెలియని రెండు నెంబర్ల నుంచి ఫోన్‌ చేసి నిన్ను చంపేస్తామంటూ బెదిరించారు. గత ఏడాది డిసెంబర్‌ 20వ తేదీ అర్ధరాత్రి కూడా ఇలాగే గంటన్నర పాటు ఇవే నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్‌ వచ్చాయని, తనను చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఆయన జూబ్లీహిల్స్‌ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తన ఇంటికి ఏర్పాటు చేసుకున్న సీసీ టీవీ వైర్లను కూడా కట్‌ చేశారని, తన కారు టైర్ల పంక్చర్‌ చేశారని, పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌కు గాయాలు

వెంగళరావునగర్‌: డ్రంక్‌అండ్‌ డ్రైవ్‌లో కారును ఆపకుండా బారికేడ్లను కారుతో ఢీకొట్టిన ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు మైత్రీవనం సమీపంలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఎస్‌ఆర్‌నగర్‌ ఐసీఐసీఐ బ్యాంక్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కారును చెకింగ్‌ వద్ద ఆపకుండా వెళుతున్నాడు. అతనిని ఆపడానికి హెడ్‌కానిస్టేబుల్‌ బి.ఎం.సుభాన్‌ బారికేడ్లు అడ్డు పెట్టాడు. అయితే కారు డ్రైవర్‌ బారికేడ్లను కారుతో ఢీకొట్టి వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సంఘటనలో హెచ్‌.సి.సుభాన్‌కు గాయాలయ్యాయి. దీంతో మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాపులో దొంగతనం

వెంగళరావునగర్‌: పాన్‌షాపులో దొంగలు ప్రవేశించి సిగరెట్లు, నగదు దోచుకుపోయిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బోరబండకు చెందిన మహ్మద్‌ కౌసర్‌ యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్‌ వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్ళాడు. ఇంటి నుంచి అర్ధరాత్రి దాదాపు 3.30 సమయంలో సీసీ టీవీని పరిశీలించగా దొంగ షాపులో ప్రవేశించడం గమనించాడు. హుటాహుటిన పాన్‌షాపునకు రావడంతో అప్పటికే దొంగ రూ.55 వేలు ఖరీదు చేసే సిగరెట్లు, రూ.14 వేలు నగదును దోచుకెళ్ళాడు. బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండలో ఫ్రెండ్‌షిప్‌ డే

రహమత్‌నగర్‌ (బోరబండ): బోరబండ డివిజన్‌ స్నేహితులు దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్‌ నాయకురాలు, కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ సతీమణి హబీబా సుల్తానా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డివిజన్‌కు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హబీబా సుల్తానా మాట్లాడుతూ సృష్టిలో వెలకట్టలేనిది ఒక్క స్నేహం మాత్రమేనని గుర్తు చేశారు. నిజమైన స్నేహం ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. అనంతరం కేక్‌కట్‌ చేసి మహిళలకు ఫ్రెండ్‌షిప్‌ బ్యాండ్‌లను కట్టారు.



విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


కల్చరల్‌ ఫెస్ట్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు...

ఉత్సాహభరితంగా 'మిలాంజ్‌-2024'

బంజారాహిల్స్‌: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ప్రతిఏటా తాము ఇంటర్‌ స్కూల్‌ పోటీలను నిర్వహిస్తున్నామని ఇవి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయని పాఠశాల ఫౌండర్‌, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.7లోని మెరీడియన్‌ స్కూల్‌లో ఇంటర్‌ స్కూల్‌ కల్చరల్‌ కాంపిటీషన్‌ పోటీలు మిలాంజ్‌-2024 పేరుతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నగరంలోని 20 పాఠశాలలకు చెందిన సుమారు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్నారు. భరతనాట్యం, కూచిపూడి, కథక్‌తో పాటు పాశ్చాత్య నృత్యాలు, సంగీతం, వీధి నాటకాలు, మైమ్‌, కల్చరల్‌ డిబేట్‌, ఫేషియల్‌ ఫ్యాంటసీ, పద్యాల పోటీలు వంటి వివిధ రకాల కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సెన్సార్‌ బోర్డు సభ్యురాలు, రచయిత డాక్టర్‌ శ్రీలేఖ కోచెర్లకోట ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ విద్యార్థులకు ఏ రంగంలో అయితే ప్రతిభ కనబర్చుతున్నారో అదేరంగంలో ప్రోత్సహించే మంచి గుర్తుపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపాల్‌ నిషిరాణా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు సహకారం అందిస్తా


ఉత్సవాల్లో పాల్గొన్న సీఎన్‌ రెడ్డి

రహమత్‌నగర్‌: కొండ పోచమ్మ, బండ మైసమ్మ, ఎల్లమ్మ ఆలయ నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తానని కార్పొరేటర్‌ సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. అలాగే భక్తులు సైతం తమవంతు సహకారం అందించి ఆలయ నిర్మాణానికి దోహదపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్‌ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎన్‌ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అమ్మవారి బోనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రధానంగా మహిళలు ఈ ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గుర్తు చేశారు. ముద్దంగుల శేఖర్‌ మాట్లాడుతూ క్వారీలో వెలిసిన అమ్మవారు ఎంతో మహిమ గలవారని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులు, దాతలు సహకరించి తోడ్పాలని ఆయన కోరారు. తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక యువజన సంఘం నగర అధ్యక్షుడు యాది, వడ్డెర సంఘం నాయకులు మోహన్‌, వెంకటేశ్‌, అనిల్‌, మల్లేశ్‌లతోపాటు డివిజన్‌ కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

గోల్కొండ రిసార్ట్స్‌ పేరుతో మోసం

రూ. 29,425 వసూళ్లు చేసిన సైబర్‌ నేరగాళ్లు

బంజారాహిల్స్‌: గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌ అండ్‌ స్పా రిసెప్షనిస్టు పేరుతో మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. షేక్‌పేటలోని ఆదిత్య ఎంప్రెస్‌ టవర్స్‌లో నివసించే రాహుల్‌శర్మ (28)స్పాకు వెళ్లేందుకుగాను గూగుల్‌లో సెర్చ్‌ చేస్తుండగా దొరికిన నెంబర్‌ ఆధారంగా ఫోన్‌ చేశాడు. అవతలి నుంచి తాను గోల్కొండ రిసార్ట్స్‌ అండ్‌ స్పా రిసెప్షనిస్టు అని పరిచయం చేసుకున్నారు. రిసార్ట్స్‌ అండ్‌ స్పా ఫీజుకు గాను రూ.14,725 చొప్పున రెండుసార్లు ఖాతాకు బదిలీ చేయించారు. అయితే మీ దగ్గరి నుంచి డబ్బులు రావడం లేదని, ఎక్కడ లోపం ఉందంటూ తామిచ్చిన నెంబర్‌పై క్లిక్‌ చేయాల్సిందిగా సూచించారు. దీంతో అనుమానం వచ్చిన రాహుల్‌శర్మ మరోసారి ప్రశ్నించగా అవసరమైతే మీరు ఇక్కడికి వచ్చి చెక్‌ చేసుకోవాల్సిందిగా చెప్పారు. దీంతో ఆయన గోల్కొండ రిసార్ట్స్‌కు వెళ్లి ఆరా తీయగా అక్కడ అలాంటి వారు ఎవరూ పనిచేయడం లేదని, ఫేక్‌ వెబ్‌సైట్‌, ఫోన్‌నెంబర్‌ ఉపయోగించి మోసం చేశారని రిసార్ట్స్‌ యజమాని తెలిపింది. రెండు విడతలుగా తాను రూ.29,425 పోగొట్టుకున్నానని, ఈ సైబర్‌ మోసంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిలింనగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాహుల్‌శర్మకు వచ్చిన ఫోన్‌ కాల్‌ను పరిశీలించగా అది రాజస్థాన్‌ నుంచి వచ్చిందని, సుశీల మీనా పేరుతో నెంబర్‌ నమోదై ఉందని గుర్తించారు. ఈ ఘటనపై ఫిలింనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం విద్యార్థుల లగ్గం ప్రాజెక్టు



లగ్గం లాగిన్..

- ఒకే క్లిక్‌తో కావాల్సిన సంబంధం
- బి–డిజైన్ విద్యార్థుల ప్రయోగం
- సాంకేతిక నైపుణ్యంతో సరికొత్త అధ్యయనం

నాంపల్లి: పెళ్లి కార్డుతో వివాహ వేడుక ఆరంభమై .. మూడు ముళ్ల బంధంతో ముడివేసుకుని సంపూర్ణ దాంపత్యంతో ముగుస్తుంది. ఈ మధ్యలో జరిగే తంతువునే 'లగ్గం' అని పిలుస్తారు. ఒక లగ్గం జరగాలంటే వధువు, వరుడు ఇద్దరూ ఉండాలి. ఒకప్పుడు వివాహం చేయాలంటే అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాలు చూసి పెళ్లిళ్లు చేసేవారు. కానీ ఇప్పుడంతా సీన్ రివర్స్. ప్రపంచీకరణ నేపథ్యంలో తరాలు చూడటానికి ముందే ఆన్‌లైన్‌లోనే పరిచయమైపోతున్నారు. ఒకరికొకరు నచ్చితే అందులోనే పెళ్లికి ఒప్పేసుకుంటున్నారు. ఆస్తులు, అంతస్తుల కంటే మనసులు నచ్చితే చాలంటూ పెద్దలను ఒప్పిస్తున్నారు. ఒకప్పుడు ఒక పెళ్లి చేయాలంటే మంచి సంబంధం దొరకాలనే వారు. అందుకోసం ఏళ్ళకు ఏళ్లు వేచి చూసేవారు. ఇందుకోసం పెళ్లిళ్ల పేరయ్యలను ఆశ్రయించేవారు. ప్రస్తుతం వారి స్థానంలో మ్యాట్రిమోనీ సంస్థలు పుట్టుకొచ్చాయి. కులాలు, మతాలు, గోత్రాలతో పాటు వధువు వరుల చిత్రాలను మ్యాట్రిమోనీ సంస్థల్లోనే వెతుకుతున్నారు. మార్కెట్లో మ్యాట్రిమోనీ సంస్థలకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులు 'లగ్గం' అనే ప్రాజెక్టును రూపొందించారు.

బి–డిజైన్ విద్యార్థుల ప్రాజెక్టు...

బి–డిజైన్‌లో నాలుగు సంవత్సరాల కాల వ్యవధి కలిగిన విజువల్ కమ్యూనికేషన్ కోర్సును అభ్యసించే మూడో సంవత్సరం విద్యార్థులు తమ ప్రాయోగిక పరీక్షల్లో భాగంగా పెళ్లికి సంబంధించిన పలు అంశాలపై లోతైన అధ్యయనం చేసి మార్కెట్‌కు సరికొత్త ప్రాజెక్టును పరిచయం చేస్తున్నారు. లగ్గం పేరిట లాగిన్ అంటూ సరికొత్త మ్యాట్రిమోనీ ప్రాజెక్టు ద్వారా వధువరుల ముందుకు వచ్చేశారు. సంబంధాలను కుదర్చడంతో పాటు, మార్కెట్‌లో హోదాకు తగ్గట్టు పెళ్లి వేడుకకు రూపకల్పన చేయడం, పెళ్లికి అవసరమైన సౌకర్యాలను సమకూర్చడం చేస్తున్నారు. ప్రాయోగిక పరీక్షల్లో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసి పట్టుకుని తమ ఉపాధికి కూడా బాటలు వేసుకునేందుకు ప్రయోగాలు చేస్తున్నారు. బి–డిజైన్ కోర్సులో ఫ్యాకల్టీ నేర్పించే సాంకేతిక నైపుణ్యాలను పుణికి పుచ్చుకుని కార్పొరేట్ సంస్థలకు తమ సత్తా ఏమిటో చూపిస్తున్నారు. అక్కడా ఉద్యోగాలు దక్కకుంటే సొంతంగా మ్యాట్రిమోనీ సంస్థను ఏర్పాటు చేసుకుంటామనే స్థాయిలో స్కిల్స్‌ను నేర్చుకుంటున్నారు.

తొందరగా ప్లేస్‌మెంట్స్..



బి–డిజైన్‌లోని విజువల్ కమ్యూనికేషన్ కోర్సులో చేరితే తొందరగా ప్లేస్‌మెంట్ దొరుకుతుందని చేరాను. ప్లేస్‌మెంట్ లేకున్నా ఉపాధి కల్పనకు ఈ కోర్సు ఎంతగానో దోహదపడుతుంది. మంచి ఫ్యాకల్టీతో బోధనలు జరుగుతున్నాయి. ప్రతి విషయాన్ని ఒక టాస్క్‌లాగా తీసుకుని చదువుతున్నాం. కోర్సు పూర్తయితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశిస్తున్నాం. – క్యూటీ, మూడో సంవత్సరం విద్యార్థి, సూర్యాపేట

ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ కావడమే లక్ష్యం



విజువల్ కమ్యూనికేషన్ కోర్సును అభ్యసించేందుకు కామారెడ్డి నుంచి వచ్చాను. తెలుగు వర్సిటీలో మూడో సంవత్సరం చదువుతున్నాను. ఈ కోర్సు ద్వారా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అవుతాను. ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేస్తూ స్థిరపడాలని ఉంది. లేదంటే మంచి స్టూడియోను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతాను. – శ్రీధర్, మూడో సంవత్సరం విద్యార్థి, కామారెడ్డి



లోకల్.. వోకల్స్..

లైవ్ మ్యూజిక్.. ట్రెండీ కన్సర్ట్స్..

మ్యూజిక్.. మ్యూజిక్.. మ్యూజిక్.. గత కొంతకాలంగా నగరంలో లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు ఆదరణ బాగా పెరుగుతోంది. ముఖ్యంగా వారాంతాల్లో రెస్టో బార్స్, కేఫ్, పబ్స్‌లో ఈ లైవ్ మ్యూజిక్ సందడి కనిపిస్తోంది. గతంలో ఫేమస్ దేశీయ, విదేశీ బ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే లైవ్ మ్యూజిక్ కన్సర్ట్‌ల కోసం నగరవాసులు, సంగీత ప్రియులు ఆసక్తిగా ఎదురు చూసేవారు. కానీ ప్రస్తుతం నగర యువత నుంచి పెద్దల వరకూ స్థానిక మ్యూజిక్ బ్యాండ్స్‌ను ఆదరిస్తున్నారు. వారి మ్యూజిక్‌ని ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా స్నేహితులతో, కుటుంబ సభ్యులతో వారాంతాల్లో సాయంకాలం డైనింగ్‌కు వెళ్లడం నగరంలో పస్తుతం ట్రెండ్‌గా మారింది. ఈ నేపథ్యంలో నగరంలో కూడా అధిక సంఖ్యలో మ్యూజిక్ బ్యాండ్స్ పుట్టుకొస్తున్నాయి. సింగర్లు, గిటారిస్టులు, కీ బోర్డ్ ప్లేయర్లు ఇలా సంగీతంతో ప్రయాణం చేస్తున్న ఆర్టిస్టులకు ఇదొక కెరీర్‌గా మారింది.

– సాక్షి, సిటీబ్యూరో

సరికొత్త ట్రెండ్‌గా మినీ షోస్..

ఆదరణ పొందుతున్న బ్యాండ్స్..

వారాంతంలో లైవ్ షోల జోరు...

రెస్టో బార్స్, కేఫ్స్, పబ్స్.. వేదిక ఏదైనా..

కెరీర్‌పై మ్యూజిక్ ఆర్టిస్టుల ఫోకస్..

ప్రస్తుత యువతరానికి లైవ్‌లో మ్యూజిక్ వినడం అనేది ఓ వ్యాపకంలా మారింది. ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన ట్రెండ్స్‌ను అందిపుచ్చుకోవడంలో హైదరాబాద్ నగరం ఎల్లప్పుడూ ముందుంటుంది. ఇలాంటి పలు కారణాలతో నగరంలో మ్యూజిక్ కన్సర్ట్‌ల నిర్వహణ విపరీతంగా పెరిగింది. వీటికి అనుగుణంగానే దాదాపు 50 నుంచి 60 మ్యూజిక్ బ్యాండ్స్ రూపుదిద్దుకున్నాయి. ఒక్కో బృందంలో ఐదు నుంచి ఏడుగురు సభ్యులతో ఆర్టిస్టులు ఉండగా కొన్ని బృందాల్లో పది మంది వరకూ తమ సంగీత కళా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.





సినిమాల్లో సైతం...

ఒక అంచనా ప్రకారం నగరంలో దాదాపు 1500 మంది సంగీత కళాకారులు ఈ మ్యూజిక్ కన్సర్ట్‌లతో బిజీగా ఉన్నారని తెలుస్తుంది. సింగర్లు, వయోలిన్ నిపుణులు, గిటారిస్ట్స్, వోకల్ ఆర్టిస్టులు, కీ బోర్డ్ ప్లేయర్లు, ఉత్సాహాన్ని పెంచే డ్రమ్ ఆర్టిస్టులు ఇలా పలువురికి ఇదొక ప్రత్యామ్నాయ కెరీర్‌గా మారింది. ఇందులోని సభ్యుల్లో చాలా మంది సినిమాలకు సైతం పనిచేస్తున్నారు. అంతేకాకుండా సినిమాల్లో ప్లేబ్యాక్ సింగర్లుగా, మ్యూజీషియన్లుగా ప్రసిద్ధి చెందిన వారు సైతం ఈ లైవ్ కన్సర్ట్‌లు నిర్వహిస్తుండడం విశేషం. ఒక్కో ఈవెంట్‌కు లక్ష నుంచి 2 లక్షల వరకూ డిమాండ్ ఉండగా.. ఫేమస్‌గా నిలిచిన బ్యాండ్‌లు, ఇప్పటికే ఇండస్ట్రీలో నిలిచిన బ్యాండ్స్‌కు 4, 5 లక్షల వరకూ పేమెంట్‌లు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో సొంత బ్యాండ్‌లను తయారు చేసుకున్నారు పలువురు స్టార్ సింగర్లు, మ్యూజీషియన్లు.

సోషల్ సెలబ్రిటీలుగా బ్యాండ్స్..

మాకు.. సంగీత ప్రియులను సంతృప్తి పరచడం కన్నా మించిన లక్ష్యం మరొకటి ఉండదు. ఈ మధ్య కాలంలో ఈ మినీ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు ఆదరణ పెరగడం చాల సంతోషంగా ఉంది. స్వతహాగా దాదాపు పదేళ్లకు పైగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. ఎన్నో సినిమాల్లో పాటలు పాడాను, పాడుతున్నాను. ఇలా మా రుద్ర బ్యాండ్‌లో ఉన్న పలువురు సినిమాలకు పనిచేస్తున్నారు. వీటితో పాటుగానే మ్యూజిక్ కన్సర్ట్స్‌లో మా ప్రతిభను ప్రదర్శిస్తున్నాం. నెలలో కనీసం 10, 12 ఈవెంట్లలో మా మ్యూజిక్ ప్రేక్షకులను అలరిస్తుంది. రెస్టో బార్‌లు, క్లబ్స్, ప్రైవేటు ఫంక్షన్‌ల నుంచి మాకు ఆహ్వానం అందుతుంది. సినిమాల్లోని పాటలనే అధునాతన ట్రాక్‌లకు అన్వయిస్తూ, విభిన్నంగా సంగీతాన్ని ప్రదర్శిస్తుంటాం. 9 వందల షోలలో నేను పాటలు పాడాను. ఈ అనుభవంతోనే గతేడాది రుద్ర బ్యాండ్ నా మిత్రుడు జయంత్‌తో కలిసి ప్రారంభించాం. సీజన్‌లో ప్రతి నెలా 15 వరకూ ఈవెంట్లను చేయగలుగుతున్నాం. మమ్మల్ని సోషల్ సెలబ్రిటీలుగా గుర్తిస్తుండటం సంతోషాన్నిస్తుంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు వంటి పలు నగరాల్లో కూడా ప్రదర్శనలు చేశాం.

– రాఘవేంద్ర, రుద్ర బ్యాండ్ వ్యవస్థాపకులు, ప్రముఖ సింగర్

బంజారాహిల్స్‌లో ఫర్నెస్ట్రీ..

ఢిల్లీకి చెందిన అత్యాధునిక ప్రీమియం ఫర్నిచర్ బ్రాండ్ 'ఫర్నెస్ట్రీ' హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. బంజారాహిల్స్‌లో 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొలి ఎక్స్‌పీరియన్స్ స్టూడియోను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫర్నెస్ట్రీ ఫౌండర్ మాన్సీ అలెన్ మాట్లాడుతూ.. కస్టమర్లు కోరుకున్న విధంగా ప్రీమియం ఫర్నీచర్, వాల్ ఆర్ట్ వంటి గృహాలంకరణలను తయారు చేసి ఇస్తామని తెలిపారు. కస్టమర్లకు డిజైన్ కాన్సెప్ట్‌లను విజువలైజ్ చేయడానికి ప్రత్యేకమైన కాంప్లిమెంటరీ మూడ్ బోర్డ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ స్టూడియోలో ఆధునిక, సంప్రదాయ హస్తకళను మిళితం చేస్తూ డైనింగ్ టేబుల్స్, స్థానిక కళాకారుల వాల్ ఆర్ట్, స్కాండినేవియన్ డిజైన్‌తో జపనీస్ సౌందర్యాన్ని మిళితం చేసే జపాండీ ఫ్యూజన్ ఫర్నిచర్ వంటివెన్నో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో







సిబ్లింగ్ రైటర్స్..!



- రచయితలుగా రాణిస్తున్న అక్కా, తమ్ముళ్లు
- 'కరపత్ర' పేరుతో పలువురికి లేఖలు రాస్తూ సేవ
- 'యూత్‌ఫుల్' పుస్తకాలతో ఆకట్టుకుంటున్న తోబుట్టువులు
- యంగ్ రైటర్స్‌కు స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రవళిక, ప్రవర్ష

వారిది ఓ మధ్యతరగతి కుటుంబం.. ఇద్దరూ అక్కా, తమ్ముళ్లు.. చిన్నప్పటి నుంచీ ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నారు.. వారి ముందుతరాల్లో ఎవరికీ పుస్తకాలు రాయడమనే మాటే తెలియదు.. అసలు వాటిని చదవడమే గగనమైన కుటుంబం నుంచి వచ్చారు.. అనూహ్యంగా ఇద్దరికీ తెలుగుపై మమకారం పెరిగింది. సాధారణంగా బీటెక్ చదువుకున్న వారిలో చాలా మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేస్తూ కాలం గడిపేస్తుంటారు. కానీ వీరిద్దరూ అందుకు భిన్నం. అక్క ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ చదువుకోగా.. తమ్ముడేమో విశాఖలోని గీతమ్ యూనివర్సిటీలో బీటెక్ చదివాడు. కానీ వీరిద్దరూ భాషలో పట్టు సాధించి పుస్తకాలు రాస్తూ తమకు తోచినంతలో తెలుగుకు సేవ చేస్తున్నారు. అక్కా, తమ్ముళ్ల ప్రవళిక, ప్రవర్ష జర్నీ ఒక్కసారి చూద్దాం..

– సాక్షి, సిటీబ్యూరో

తెలుగులో రాయాలనే ఆకాంక్ష అయితే ఉంది.. కాకపోతే పుస్తకాలు రాయడం ఇంట్లో ఎవరికీ అలవాటు లేదు. దీంతో వినూత్నమైన ఆలోచన వారి మదిలో మెదిలింది. 2017లో 'కరపత్ర' పేరుతో అవసరం ఉన్న వారికి లేఖలు రాయడం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు విషయంలో మహేశ్‌పోలోజు అనే మరో రచయిత వీరిద్దరికీ తోడయ్యాడు. వీరు ముగ్గురూ కలసి దాదాపు వెయ్యికి పైగా ఉత్తరాలు రాసిచ్చారు. లేఖలు అందుకున్న వారు అభినందనలతో ముంచెత్తడంతో రచయిత కావాలనే తృష్ణ వారిలో మరింత పెరిగింది.

ఛాయాదేవి చెత్త కథలు..

ప్రవళిక తొలిసారిగా 2017 సమయంలోనే 'ఛాయాదేవి చెత్త కథలు' పేరుతో తన తొలి పుస్తకాన్ని తీసుకొచ్చింది. అక్కను స్ఫూర్తిగా తీసుకుని ప్రవర్ష కూడా తన తొలి పుస్తకాన్ని 'కథనై.. కవితనై' పేరుతో వెలుగులోకి తీసుకొచ్చారు. ప్రవళిక మరో పుస్తకాన్ని ఇప్పటికే పూర్తి చేయగా, ప్రవర్ష 'అభినిర్యాణం' పేరుతో రెండో పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు.

అసిస్టెంట్ డైరెక్టర్‌గా..

ప్రవర్ష మూడేళ్లు ఓ ఐటీ కంపెనీలో జాబ్ చేశాడు. కానీ తనకు అస్సలు సంతృప్తినివ్వలేదు. ఇక తనకు ఇష్టమైన రంగంలో రాణించాలని నిర్ణయించుకుని ఆ జాబ్ మానేసి పుస్తకాలు రాయడం ప్రారంభించాడు. పుస్తక రచయిత మాత్రమే కాదు.. అటు సినిమాలకు పాటలు రాయడం హాబీగా మార్చుకున్నాడు. ప్రస్తుతం ఓ డైరెక్టర్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు.

ఆకట్టుకున్న పర్ఫ్యూమ్ మేకింగ్..

సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక ఇంటీరియర్ ఉత్పత్తులపై అవగాహన అందించేందుకు హన్స్ గ్రోహె ఇండియా ఆధ్వర్యంలో ఐటీసీ కోహినూర్ హోటల్‌లో 'మేక్ ఇట్ యువర్స్' పేరిట జరిగిన పర్ఫ్యూమ్ తయారీ కార్యక్రమం ఆకట్టుకుంది. హాజరైనవారు తమకు నచ్చిన పరిమళాలను ఎంపికచేసుకుని పర్ఫ్యూమ్స్‌ను కస్టమైజ్ చేసుకునే అవకాశం కల్పించారు. అదే విధంగా బాత్‌రూమ్‌కు పర్యావరణ హితమైన రీతిలో థీమ్, ప్రశాంతత జతచేసి రూపొందించిన వినూత్న డిజైన్.. ది టీల్‌క్లబ్‌ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. డ్రోన్ షో, డీజే మ్యూజిక్‌తో ఆకట్టుకున్న ఈ వెరైటీ ఈవెంట్‌కి నగరానికి చెందిన ఇంటీరియర్ డిజైనర్స్, ఆర్కిటెక్ట్స్ హాజరయ్యారు.



ఇండియా ఛీర్స్ ఫర్ నీరజ్..



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ జావలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా ఈ నెల 6న పారిస్ ఒలింపిక్స్‌లో తన సత్తా చూపనున్న నేపథ్యంలో ఆయన విజయాన్ని కాంక్షిస్తూ శామ్‌సంగ్ ఇండియా 'ఛీర్స్ ఫర్ నీరజ్ 'ను ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తాజా ఒలింపిక్స్‌లో కోట్లాది మంది భారతీయుల ఆశాకిరణమైన నీరజ్ చోప్రాకు తాము ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా శుభాకాంక్షలు తెలపొచ్చన్నారు. అంతేకాక 98704–94949 నెంబరుకు 'NEERAJ' అని వాట్సాప్ మెసేజ్ పంపడం ద్వారా, అలాగే తమ సోషల్ మీడియా చానెల్‌కు ట్యాగ్ చేయడం ద్వారా అందించవచ్చని వెల్లడించారు.

'మ్యూజిక్ ఆఫ్ హోప్'...



సాక్షి, సిటీబ్యూరో: శిశు ర్వేత్తి, పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణిః అనే విశ్వాసాన్ని అనుసరిస్తూ. వంధ్యత్వానికి చికిత్సలో సంగీతాన్ని మిళితం చేస్తూ 'మ్యూజిక్ ఆఫ్ హోప్' పేరిట ఓ ట్యూన్‌ను నగరానికి చెందిన ఫెర్టీ–9 ఫెర్టిలిటీ సెంటర్ రూపొందించింది. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవ వేడుకల ముగింపును పురస్కరించుకుని దీనిని విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మానసిక ఆరోగ్యంపై సంగీతం గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, ఒత్తిడి, ఆందోళనను తగ్గించి ప్రశాంతత, విశ్రాంతి భావాన్ని కలిగిస్తుందని నిరూపితమైన నేపథ్యంలో ఈ ట్యూన్ ప్రత్యేకంగా తయారు చేశామన్నారు. అదే విధంగా 'టుగెదర్ ఇన్ ఐవీఎఫ్' పేరిట వంధ్యత్వానికి సంబంధించిన అపోహలను పోగొట్టడం లక్ష్యంగా నిర్వహించిన ప్రచారంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో 15 వేర్వేరు ప్రదేశాల్లో వీధి నాటకాలు లేదా నుక్కడ్ నాటకాలను ప్రదర్శించామని వివరించారు.

మరో సర్కారీ హత్య

పోలీసుల కళ్లెదుటే కత్తులు దూసిన టీడీపీ నేతలు

శ్రీశైలం నియోజకవర్గం సీతారామాపురంలో అతి కిరాతకంగా వైఎస్సార్‌సీపీ నేత హతం

- ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల కళ్లెదుటే సుబ్బరాయుడిని ఇంట్లో నుంచి బయటికి లాగి చంపిన వైనం
- రాత్రి 9.30 గంటల నుంచే పోలీసులను అప్రమత్తం చేసిన మరో నేత జయనారపురెడ్డి
- అదనపు బందోబస్తుకు విన్నవించినా పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు
- ఊరంతా చూస్తుండగా 'పచ్చ' ముఠా విధ్వంసం.. పక్కా ప్రణాళికతోనే హత్య
- 'పచ్చ ముఠా' ఊరు దాటేంత వరకు గ్రామంలోకి రాని అదనపు పోలీసు బలగాలు
- చంపేందుకు ఎక్కువ మంది రావడంతో ఏమీ చేయలేక పోయామన్న పోలీసులు
- 12.20-12.30 గంటల మధ్య హత్య జరిగాక అదనపు బలగాల రాక
- జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఘటన





సుబ్బరాయుడు (ఫైల్)

హత్యకు గురైన పసుపులేటి పెద్ద సుబ్బరాయుడు

సాక్షి ప్రతినిధి కర్నూలు: నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో శనివారం అర్ధరాత్రి 12.20 గంటలకు టీడీపీ నేతలు పోలీసుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి సుబ్బరాయుడు అలియాస్ పెద్దన్న(65) ఇంట్లోకి వెళ్లి బయటకు లాగి.. కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు గుడ్లప్పగించి చూస్తుండగా సుబ్బరాయుడు అతి దారుణంగా ప్రాణాలు కోల్పోయాడు. హత్య జరిగే ప్రమాదముందని మూడు గంటల ముందే పోలీసులకు సమాచారం ఇచ్చినా, కనీస చర్యలు తీసుకోకపోవడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. హత్య జరిగిన తీరు, ఘటన పూర్వపరాలు నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం, పోలీసుల వైఫల్యమే ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. సీతారామాపురంలో రాత్రి 9.45 గంటలకు టీడీపీ నేత శేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేత పెద్దిరెడ్డి ఇంటికి వెళ్లాడు. పెద్దిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో మహిళలను ఇష్టానుసారం బూతులు తిట్టాడు. ఊళ్లో కేకలు వినపడంతో వైఎస్సార్‌సీపీ నేత జయనారపురెడ్డి వెళ్లి మహిళలను దూషించడం సరికాదని చెప్పారు. దీంతో శేఖర్‌రెడ్డి వెనుదిరిగాడు. 'నారపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయాళ్ల కథ తేల్చాల్సిందే..' అని ముఠాను పోగు చేశాడు. ఆ గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి నంద్యాలలో ఉంటే అతనికి సమాచారం ఇచ్చాడు. ఇదంతా గమనించిన జయనారపురెడ్డి.. ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. ఫోన్ చేసిన 40 నిమిషాలకు ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో అక్కడికి వచ్చారు. టీడీపీ నేతలు గుంపులు గుంపులుగా వచ్చి శేఖర్‌రెడ్డి ఇంటి వద్ద పోగవుతుండటాన్ని చూస్తూనే ఉన్నారు. ఇంతలోనే శ్రీనివాసరెడ్డి మూడు కార్లతో తన ఇటుకల ఫ్యాక్టరీ, గోడౌన్ సమీపానికి చేరుకున్నారు.

జయనారపురెడ్డిని పథకం ప్రకారం పక్కకు పంపి..

ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్.. జయనారపురెడ్డిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. మహానంది పోలీసుస్టేషన్‌కు వెళ్లి, అక్కడ ఫొటో దిగి తన వాట్సాప్‌కు పంపాలని చెప్పారు. ఇక్కడ ఇంత జరుగుతుంటే తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం ఏంటని.. పోలీసు బందోబస్తును పిలిపించండని నారపురెడ్డి కోరాడు. 'సీఐ, డీఎస్పీకి ఫోన్ చేసిన స్పందించడం లేదు.. నువ్వు స్టేషన్‌కు వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఎస్‌ఐ చెప్పడంతో ఐదుగురితో కలిసి నారపురెడ్డి మహానంది స్టేషన్‌కు వెళ్లి ఫొటో దిగి ఎస్‌ఐకి పంపారు. నారపురెడ్డి ఊరు దాటగానే శ్రీనివాసరెడ్డి ముఠా ఒక్కసారిగా ఊళ్లోకి దూసుకొచ్చింది. శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డితో పాటు 30-35 మంది నేరుగా సుబ్బరాయుడి ఇంటిపై పడ్డారు. తొలుత సుబ్బరాయుడిని ఇంట్లోంచి బయటికి లాక్కొచ్చారు. అడ్డొచ్చిన భార్య సుబ్బమ్మపై రాడ్లతో దాడి చేసి గాయ పరిచారు. ఆమె చేయి, కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకోకూడదని బెదిరిస్తూ శ్రీనివాసరెడ్డి ముఠా విధ్వంసం సృష్టించింది. అప్పటికే ఊళ్లో వాళ్లంతా అక్కడికి చేరుకున్నారు. మరో వైపు పోలీసులు చూస్తూనే ఉన్నారు. అందరి కళ్లెదుటే సుబ్బరాయుడిని కత్తులతో పొడిచి.. రాడ్లు, రాళ్లతో కొట్టి అతి కిరాతకంగా చంపేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ముఠా ఊరు దాటి వెళ్లిపోయింది.



మృతుడి ఇంటి వద్ద ధారగా పారుతున్న రక్తం

ముందుగానే ఎందుకు బందోబస్తు పంపలేదు?

రాత్రి 9.30 గంటలకు గొడవ జరిగింది. జయనారపురెడ్డి పోలీసులకు అప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. 10.10 గంటలకు ఎస్‌ఐ వచ్చాడు. ఎస్‌ఐ ముందే హత్యకు ప్రణాళికలు జరుగుతున్నా, ఎందుకు అదనపు బందోబస్తును పిలిపించలేకపోయాడు? సీఐకి విషయం తెలుసు. ఆపై డీఎస్పీ నోటీసుకు వెళ్లింది. అయినా ఎందుకు బందోబస్తు పంపలేదు? మూడు గంటల పాటు రాని బందోబస్తు 12.30 గంటలకు సుబ్బరాయుడు హత్య జరిగాక.. అదీ శ్రీనివాసరెడ్డి ముఠా ఊరు దాటిన తర్వాత మాత్రమే ఎందుకొచ్చింది? సీతారామాపురం నుంచి డీఎస్పీ, ఎస్పీ ఆఫీసుకు 12 కిలోమీటర్లు. 10 నిమిషాల్లో రావచ్చు. ఎందుకు 3 గంటల తర్వాత బందోబస్తు ఊళ్లోకి వచ్చింది? ఈ ప్రశ్నలకు పోలీసులు, ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలి.


హత్య విషయం ఎమ్మెల్యేకు ముందే తెలుసా?

ఎన్నికల ఫలితాల తర్వాత చెప్పినట్లు 'అందరి కథా తేలుస్తా.. చర్మం వలుస్తా.. ఎవ్వర్నీ వదిలేదే లేదు' అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హెచ్చరించిన నేపథ్యంలో ఈ హత్య ఆయనకు తెలిసే జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యను నివారించేందుకు సమయం ఉన్నా బందోబస్తు రాకపోవడం.. సీఐ, డీఎస్పీ మిన్నకుండిపోవడం, ఒక మనిషిపై హత్యకు తెగిస్తుంటే ఎస్‌ఐ ఫైరింగ్ ఓపెన్ చేయక పోవడం.. ఇవన్నీ చూస్తుంటే ఒక పథకం ప్రకారం వ్యవహరించి ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.



శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో ప్రధాన నిందితుడు బుడ్డారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

హంతకులు పారిపోయాక స్పందిస్తారా?



జయనారపురెడ్డి నంద్యాల ఎస్పీకి అర్ధరాత్రి ఐదుసార్లు ఫోన్ చేసిన కాల్ హిస్టరీ స్క్రీన్ షాట్

ఊళ్లో ఏం జరుగుతుందో తెలీక జయనారపురెడ్డి మౌనంగా పోలీస్‌స్టేషన్‌లో కూర్చుని ఉన్నాడు. ఇంతలో సుబ్బరాయుడి కుమారుడు ప్రసాద్ ఫోన్ చేసి 'నాన్న ఇంగ లేడు. వాళ్లు సంపేసినారు' అని బోరున విలపించాడు. దీంతో అర్ధరాత్రి 12.59కి జయనారపురెడ్డి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు ఫోన్ చేశాడు. 'సీతారామాపురంలో టీడీపీ వాళ్లు దాడులు చేస్తున్నారని, చంపడానికి వచ్చారని 9.30 నుంచి ఎస్‌ఐకి చెప్పాం. సీఐ, డీఎస్పీకి కూడా చెప్పాం. బందోబస్తు పంపాలని కోరాం. అయినా పంపలేదు. మనిషిని చంపేశారు' అని రోదించారు. జయనారపురెడ్డి అర్ధరాత్రి 1.02 గంటలకుకు మళ్లీ ఎస్పీకి ఫోన్ చేశాడు. శ్రీనివాసరెడ్డి కార్లు తమ ఇంటి ముందు నుంచి వెళుతున్నాయని, తన ఫోన్‌లోని సీసీ కెమెరాల ద్వారా చూస్తే తెలిసిందని వాళ్లు ఏ దారిలో వెళతారో కూడా చెప్పాడు. 1.08 గంటలకు మళ్లీ ఫోన్ చేసి, తాము ఎస్పీ ఆఫీసుకు వస్తున్నామని తెలిపారు. 3.18 గంటలకు మరోసారి ఫోన్ చేశాడు. హంతకుల ముఠాలోని 'రమణ' అనే వ్యక్తిని పట్టుకున్నామని, వాడిని అప్పగించడానికి ఎస్పీ ఆఫీసు వద్దకు వచ్చామని, బయటే ఉన్నామని చెప్పాడు. 3.20 గంటలకు ఎస్పీ తిరిగి జయనారపురెడ్డికి ఫోన్ చేశారు. 'రమణ'ను 3వ పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని చెప్పారు. పోలీసులపై నమ్మకం లేదని మీకు అప్పగిస్తామని జయనారపురెడ్డి చెప్పారు. దీంతో కొందరు పోలీసులు వచ్చి రమణను ఎస్పీ ఆఫీసులోకి తీసుకెళ్లారు.

నెత్తి నోరు కొట్టుకుని చెప్పా.. పట్టించుకోలేదు



శనివారం రాత్రి 9.30 గంటలకు ఎస్‌ఐకి ఫోన్ చేశా.. ఎస్‌ఐ ముందే శేఖర్‌రెడ్డి మందిని గుంపు చేసినాడు. రాడ్లు తీసుకుని తిరుగుతున్నారు. బందోబస్తును పిలిపించు సార్ అని నెత్తి నోరు కొట్టుకుని చెప్పా.. సీఐ, డీఎస్పీ కూడా పట్టించుకోలేదు. నన్ను స్టేషన్‌కు వెళ్లి ఫొటో దిగి పంపమన్నారు. అలా ఎందుకు చెప్పాడో తెలీదు. నేను వెళ్లిన తర్వాత సుబ్బరాయుడిని చంపేశారని ఆయన కొడుకు ఫోన్ చేసి సెప్పి ఏడ్చాడు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ఈ హత్య జరిగి ఉండేది కాదు.

– జయనారపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

ఏపీలో ముఠాల పాలన

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు
- రాష్ట్రం రాజకీయ హింసకు మారుపేరుగా మారింది
- ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే నిత్యం దాడులు
- హామీలు అమలు చేయలేకే ఈ దుర్మార్గాలు
- బాధితులకు అండగా నిలిచి పోరాటం సాగిస్తాం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం స్థానంలో ముఠాల పాలన కనిపిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రెండు నెలలుగా ఏపీ అంటేనే రాజకీయ హింసకు మారుపేరుగా మారిపోయిందని, పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతో జరిగే ఘటనలు, అధికారంలో తమ పార్టీ ఉందనే ధీమాతో చేస్తున్న దాడులు, రాజకీయ ప్రేరేపిత దుశ్చర్యలు.. రాష్ట్రంలో ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నిన్న రాత్రి జరిగిన హత్య, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన దాడి ఘటనలు వీటికి నిదర్శనం. ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకోలేకపోవడంతో, ఎవరూ ప్రశ్నించ కూడదని, రోడ్డుపైకి రాకూడదని ప్రజలను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికే ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. బాధితులకు అండగా ఉంటూ, పోరాటాన్ని కొనసాగిస్తాం' అని ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు.



ఎన్టీఆర్ జిల్లా కొనకంచి క్రాస్ రోడ్డు వద్ద నవాబుపేట వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావుపై పాశవికంగా దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

జగ్గయ్యపేటలో పచ్చ మూకల దాడి

- తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావు
- నిందితులను కఠినంగా శిక్షించాలని నవాబుపేట గ్రామస్తుల ఆందోళన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈ నెల 9, 19 తేదీల్లో తిరుమలలో గరుడ సేవ

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ నెలలో రెండు సార్లు గరుడ వాహన సేవ జరుగనుంది. ఈ నెల 9న గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్ప స్వామి వారు రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు తమకు ఇష్టమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. అలాగే ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే పౌర్ణమి గరుడ సేవను ఆగస్టు 19వ తేదీ శ్రావణ పౌర్ణమి నాడు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

వయోవృద్ధుల దర్శనంపై వదంతులు నమ్మొద్దు

టీటీడీ విజ్ఞప్తి

తిరుమల: వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయని, అవి పూర్తిగా అవాస్తవమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. వాస్తవం ఏమిటంటే.. ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ ప్రతి నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఒక నెలకు సంబంధించిన ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి ఒక లడ్డూ ఉచితంగా అందిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి అనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.in ను మాత్రమే సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలియజేసింది.

పాతికేళ్లుగా పదోన్నతులు లేవు

ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్ల ఆవేదన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పాతిక సంవత్సరాలుగా పదోన్నతులు పొందని ఉద్యోగులు కేవలం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన స్కూల్ అసిస్టెంట్ టీచర్లు మాత్రమేనని ఏపీపీఎస్సీ సెలక్టెడ్ తెలంగాణ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తవరపు శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని అన్ని కేటగిరీల్లో ఉద్యోగులు పలు హోదాల్లో పదోన్నతులు పొందినప్పటికీ ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన టీచర్లకు మాత్రం ఒక్క స్థాయిలో కూడా పదోన్నతులు దక్కలేదన్నారు. మెజార్టీ టీచర్లు ప్రస్తుతం పదవీ విరమణ వయసుకు వచ్చారని, కొందరు ఇప్పటికే రిటైరయ్యారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేలాది మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం అభినందనీయమని, తమకు కూడా పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. తమ బ్యాచ్ ఉద్యోగులకు ఎంఈఓ, డైట్ లెక్చరర్ పదోన్నతులకు అర్హతలున్నాయని, ఈ మేరకు వెంటనే పదోన్నతులు నిర్వహించాలని కోరుతూ ఆదివారం ఒక లేఖ విడుదల చేశారు.

రౌండప్

మీడియా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది

- ఐజేయూ జాతీయ కౌన్సిల్ ముగింపు సమావేశంలో బండారు దత్తాత్రేయ



సాక్షి, న్యూఢిల్లీ: మీడియా పటిష్టంగా ఉంటనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. పాలకుల కంటే నిజం చెప్పే జర్నలిస్టులే తన దృష్టిలో ఉన్నతమైన వారని వ్యాఖ్యానించారు. హరియాణాలోని పంచకులలో ఐజేయూ జాతీయఅధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత ఆగస్టు 3, 4 తేదీల్లో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఆదివారం ముగింపు కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పార్టీలు వస్తూ పోతుంటాయి.. కానీ దేశం శాశ్వతమని, దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజాస్వామ్యం కీలకమని, అందుకు బలమైన మీడియా అవసరమన్నారు. నిబద్ధతతో జర్నలిజం చేసే పాత్రికేయులను చూసి ముఖ్యమంత్రులు సైతం భయపడటం తనకు తెలుసుని చెప్పారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేకచట్టం చేయాలన్న ఐజేయూ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా, కేంద్రమంత్రిగా ఉన్నా ఎలాంటి భేషజాలు లేకుండా సామాన్య ప్రజలతో కలిసిమెలిసిపోయే నేతగా, అందరికీ అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా దత్తాత్రేయ ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే 'అలయ్ బలయ్' ప్రాచుర్యాన్ని ఐజేయూ సీనియర్ నేత దేవులపల్లి అమర్ వివరించారు. దత్తాత్రేయతో తనకున్న అనుభవాన్ని పంచుకున్నారు.

యాదాద్రిలో 'స్నాన సంకల్పం'

- 11న ప్రారంభానికి సన్నాహాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులు కొండపైనే గల విష్ణు పుష్కరిణిలో సంకల్ప స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు వెల్లడించారు. ఆయన ఆదివారం విష్ణు పుష్కరిణిని అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. పదేళ్ల క్రితం విష్ణు పుష్కరిణిలో దంపతులు స్నాన సంకల్పం ఆచరించే వారని, ప్రధానాలయ అభివృద్ధిలో భాగంగా ఇది నిలిచిపోయిందని పేర్కొన్నారు. భక్తుల కోరిక మేరకు ఈ నెల 11వ తేదీన విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పాన్ని పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టిక్కెట్ ఉన్న దంపతులు విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం ఆచరించవచ్చని పేర్కొన్నారు. టిక్కెట్ తీసుకొని స్నానం ఆచరించాక.. అక్కడుండే అర్చకులు దంపతులతో సంకల్పం చెప్పిస్తారన్నారు. టికెట్ లేని భక్తులు పుష్కరిణిలో నీటిని తలపై చల్లుకునేందుకు వీలు కల్పిస్తామన్నారు. కాగా.. పుష్కరిణిలో చెత్తా చెదారాన్ని తొలగించి, పై భాగంలో జాలీ (మెష్) ఏర్పాటు చేసి, తెలుపు రంగు పెయింటింగ్‌తో ముస్తాబు చేస్తున్నారు.



విష్ణు పుష్కరిణిపై ఏర్పాటు చేసి జాలీ (మెష్)

అత్యాచారం, పోక్సో కేసులలో 29మందికి శిక్షలు

- ఒకరికి ఉరిశిక్ష, 15 మందికి 20 ఏళ్ల జైలుశిక్ష..
- డీజీపీ జితేందర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నమోదైన అత్యాచార, పోక్సో కేసులలో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 29మంది నేరస్తులకు శిక్షలు ఖరారైనట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. కేసు నమోదు నుంచి న్యాయ విచారణ పూర్తయ్యే వరకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటోందని, అధికారుల కృషితోనే శిక్షల సంఖ్య పెరుగుతోందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భరోసా కేంద్రాలతో బాధితులకు మద్దతు పెరిగినట్లు తెలిపారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ, పక్కా దర్యాప్తుతో నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా ఎంఎస్‌జే కోర్టు ఇటీవలే మరణ శిక్ష విధించినట్లు వెల్లడించారు. మహిళలు, పిల్లలపై నేరాలు ఏ మాత్రం సహించేది లేదని కఠిన శిక్షలతోనే నేరాలకు అడ్డుకట్టవేయగలమని తెలిపారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నమోదైన అత్యాచారం..పోక్సో కేసులలో ఈ ఏడాదిలో ఒకరికి ఉరి, 15 మందికి 20 ఏళ్ల శిక్ష, ఇద్దరికి 25 ఏళ్ల శిక్ష, 11 మందికి జీవిత ఖైదుతో కలిపి మొత్తం 29 మందికి శిక్షలు పడినట్లు తెలిపారు.

యాదాద్రిలో దర్శనానికి గంటన్నరే సమయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. ఆదివారం సెలవురోజు అయినప్పటికీ ఆషాఢ మాసం చివరి రోజు అందులో అమావాస్య కావడంతో భక్తులు తక్కువ సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకున్నారు. దీంతో శ్రీస్వామి ధర్మ దర్శనానికి గంటన్నర సమయం, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. శ్రీస్వామివారిని 25 వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీస్వామి వారి ఆలయంలో భక్తులు తక్కువగా ఉండటంతో ఆలయ మాడ వీధుల్లో సందడి కనిపించలేదు. శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగనుంది.

దసరా నాటికి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



పీర్జాదిగూడ సీపీఆర్ఐ వద్ద ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉప్పల్ /మేడిపల్లి: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను దసరా నాటికి ప్రారంభించి 18 నెలల్లో పూర్తిచేసి చూపిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ ఇచ్చారు. ఆరేళ్లుగా ఈ పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఆదివారం ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులు, నేషనల్ హైవే అధికారులతో కలిసి నారపల్లి నుంచి ఉప్పల్ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల నిర్మాణ స్థితిగతులపై సమీక్షించడంతో స్వయంగా పరిశీలించారు. గంటన్నరపాటు నిర్వహించిన సమావేశానంతరం కోమటిరెడ్డి... మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదివారం సాక్షి దినపత్రికలో 'ఇంకా ఎన్నాళ్లు 'శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ప్రజలు ఆరేళ్లుగా అనేక ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తించినట్టు తెలిపారు. 2018లో ప్రారంభమైన పనులు పూర్తికాకపోవడం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అవమానకరమని చెప్పారు. రోడ్లు బాగా లేని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వానాకాలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు మరమ్మతులపై తక్షణమే నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే పదిరోజుల్లో ఉప్పల్ చౌరస్తా నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు కింది రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఎన్నో మార్లు ఈ రోడ్డు, కారిడార్ పనుల నిర్లక్ష్యాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్, కార్యదర్శి హరిచందన, ఈఎన్‌సీ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలు కారంలో నూనె కలుపుకొని తింటున్నారు


- కొత్తపల్లి స్కూల్ ఘటనపై 'ఎక్స్'లో హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల ఆకలి తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం కలుపుకుని కడుపు నింపుకోవడం బాధించిందని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రభుత్వం భావిభారత పౌరుల పట్ల ఇంత బాధ్యతారహితంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం అందించే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఇప్పటికే అటకెక్కించిన ప్రభుత్వం.. ఇప్పుడు మధ్యాహ్న భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైందని హరీశ్ ధ్వజమెత్తారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి భోజన సామగ్రి బిల్లులు, కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులను, కార్మికుల జీతాలను చెల్లించి, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల కడుపు నింపాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు కారంతో భోజనం చేస్తున్న ఫొటోను హరీశ్ షేర్ చేశారు.


కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండ కడుతూ ఉండాలని కేసీఆర్ సూచించినట్లు సబిత తెలిపారు. మాటల్లో తప్ప చేతల్లో ప్రభుత్వ పనితీరు కనబడటంలేదని మండిపడ్డారు. రుణమాఫీ వల్ల కొంత మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరిందని, వివిధ కారణాలతో వేలాదిమంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు

మీరాకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన మందకృష్ణ



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఢిల్లీలో మీరా కుమార్‌ను ఆమె నివాసంలో కలిశారు. ఎమ్మార్పీఎస్‌కు మొదటి నుంచి అండగా నిలబడటంతో పాటు యూపీఏ ప్రభుత్వ హయాంలో మీరాకుమార్ ఎస్సీ వర్గీకరణ కోసం చొరవ తీసుకున్నారని గుర్తుచేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణ సాధించినందుకు మంద కృష్ణమాదిగకు మీరాకుమార్ అభినందనలు తెలిపారు.



మది నిండుగా శ్రావణ బోనం

ఆషాఢం వచ్చిందంటే తెలంగాణలో బోనాల పండుగ ప్రారంభం అవుతుంది. గోల్కొండ జగదాంబికకు తొలి బోనం సమర్పణతో మొదలై, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి, లాల్ దర్వాజ బోనాలతో నగరం పల్లె రూపం నింపుకుంటుంది. ఆషాఢమాసంలో బోనాలు హైదరాబాద్‌లో ముగుస్తాయి. శ్రావణమాసం ప్రారంభం అవుతూనే అమావాస్య ఆదివారం నుంచి తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన బోనాల పండుగ ప్రతి ఇంట సంబరమవుతుంది. మన సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలూ బోనాల పండగను జరుపుకోవడం విశేషం.

సామూహిక చైతన్యం..

గ్రామదేవతలకు వండి పెట్టే భోజనమే బోనం అంటారు. బోనాన్ని గుడిలో అమ్మవారికి సమర్పించడంతో నైవేద్యం అవుతుంది. బోనాన్ని జేజ బువ్వ అని కూడా (తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో) అంటారు. వర్షాలు బాగా పడాలని, పంటలు బాగా పండాలని, రుతుమార్పుల వల్ల వచ్చే అంటురోగాలు, అనారోగ్యాల పాలు కాకుండా ఉండాలని అమ్మ దేవతలకు మొక్కుకుంటారు. ప్రాచీన కాలం నుంచి ఒక ఆచారాన్ని తీసుకువచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి కూడా ఈ బోనం సంప్రదాయాన్ని కొనసాగిస్తుంటారు.

గిరులలో సిరులు కురవాలని..

గిరిజనులు సంవత్సరానికి ఒకసారి పోడు వ్యవసాయం ద్వారా పంట పండిస్తారు. దున్నే సమయంలో ముందు కొట్టే చెట్టుకు మొక్కుతారు.'నేను వ్యవసాయం కోసమే నిన్ను కొడుతున్నాను. నీమీద నాకేం కోపం లేదు క్షమించమ్మా! రెండు రోజుల తర్వాత వస్తాన'ని చెప్పి మూడోరోజు దుక్కి దున్ని గింజలు నాటుతారు. చిక్కుడుపంట పండితే చిక్కుళ్ల పండుగ చేసుకుంటారు. ఇంటిపాదుల్లో పెట్టిన విత్తనాలు మొలకలే, తీగలై పారితే ఎంతో సంతోషిస్తారు. ఆ పాదుల్లో మొదటగా పూసిన బీరపువ్వుకు బొట్లు పెడతారు.

ఏడుగురు అక్క చెల్లెళ్లు..

పూర్వకాలంలో నిరక్షరాస్యులైన ప్రజలు, గిరిజనులు రాయిని కడిగి పసుపు కుంకుమతో బొట్లు పెట్టి దేవత అని మొక్కేవారు. ప్రపంచమంతటా ఈ అమ్మ దేవతల పూజ ఉంది. రూపాలు లేవు కాని వివిధ పేర్లతో అమ్మవార్లను పూజించుకుంటారు. దేవతల్లో ప్రధానంగా ఏడుగురు అక్కా చెల్లెళ్లు. సప్తమాతృకల్లో ఉండే చాముండి దేవతను సౌమ్య రూపంగా గుళ్లల్లో ప్రతిష్ఠించుకుని పూజలు చేస్తారు. పోషణ ఇచ్చేది పోచమ్మ తల్లి అని తెలంగాణలో కొలుస్తారు. గ్రామాల్లో .. పోచమ్మ, మైసమ్మ, ఊరమ్మ, ఊరడమ్మ, కట్ట మైసమ్మ, సరిహద్దుల పోచమ్మ, వనం పోచమ్మ, దుర్గమ్మ, మహంకాళమ్మ, బద్దిపోచమ్మ, పెద్దమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ, మాతమ్మ.. ఇలా రక రకాల పేర్లతో ఉన్న ఎందరో అమ్మ తల్లులకు బోనాలు సమర్పిస్తారు. కాటమరాజు, బీరప్ప, మల్లన్న.. తొట్టెలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రజల విశ్వాసాలకు అద్దం పడతాయి. బోనాల పండుగకు అత్తగారింటినుంచి తల్లిగారింటికి వచ్చిన ఆడపిల్లలు బోనం ఎత్తుకోవడం అంటే ఆ ఇంటికి లక్ష్మీదేవే వచ్చినట్టుగా భావిస్తారు.

- యంబ నర్సింహులు,

మంచి మాట

తన కోపమె తన శత్రువు

కోపం తెచ్చుకోవటం అంటే ఎవరో చేసిన తప్పుకి తనను తాను శిక్షించుకోవటం అని ఒక ఆంగ్ల సామెత ఉంది. దీనికి సమానార్థకంగా తెలుగులో కూడా ఒక సామెత ఉంది. ''ఏ కట్టెకి నిప్పు ఉంటే ఆ కట్టే కాలుతుంది'' అని. ఆలోచిస్తే రెండు ఎంత నిజమో కదా అనిపించక తప్పదు. సుమతీ శతకకారుడు కూడా అదే విషయాన్ని నిర్ధారించాడు – ''తన కోపమె తన శత్రువు'' అని. గొప్ప గొప్ప శాస్త్రీయమైన సత్యాలని సామాన్యమైన మాటల్లో అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పటం అన్ని సమాజాలలో ఉన్న పెద్దలు చేసిన పని. వారికి రాబోయే తరాల మీద ఉన్న ప్రేమకి అది నిదర్శనం. గమనించండి! కోపం తెప్పించిన వారిని కానీ, పరిస్థితులని కానీ ఎవరైనా మార్చగలరా? కోపానికి కారణమైన వారు బాగానే ఉంటారు. సమస్య కోపం తెచ్చుకున్న వారిదే.

ఎవరికైనా కోపం ఎందుకు వస్తుంది? తనని ఎవరయినా తప్పు పట్టినా, నిందించినా, దెబ్బకొట్టినా (శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, సామాజికంగా), తాను అనుకున్నది సాధించలేక పోయినా ఇలా ఎన్నో కారణాలు. ఒక్క క్షణం ఆలోచించండి! వీటిలో ఏ ఒక్కటి అయినా మన అధీనంలో ఉన్నదా? లేనప్పుడు అనవసరంగా ఆయాస పడటం ఎందుకు? కోపపడి, ఆవేశ పడితే ఎడ్రినల్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. దానివల్ల ముందుగా శరీరంలో ఉన్న శక్తి అంతా ఖర్చు అయిపోతుంది. కోపంతో ఊగిపోయినవారు తగ్గగానే నీరసపడటం గమనించ వచ్చు. ఇది పైకి కనపడినా లోపల జరిగేది జీవప్రక్రియ అస్తవ్యస్తం కావటం. దానికి సూచనగా కళ్ళు ఎర్ర బడతాయి. కాళ్ళు చేతులు వణుకుతాయి, మాట తడబడుతుంది. ఆయాసం వస్తుంది. రక్త ప్రసరణలో మార్పు తెలుస్తూనే ఉంటుంది. పరీక్ష చేసి చూస్తే రక్త పోటు విపరీతంగా పెరిగి ఉంటుంది. ఇది తరచుగా జరిగితే ఎన్నో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తక తప్పదు. కోపం తెప్పించిన వారు మాత్రం హాయిగా ప్రశాంతంగా ఉంటారు. కోపాన్ని వ్యక్త పరిస్తే వచ్చే వాటిలో ఇవి కొన్ని. లోపలే అణుచుకుంటే వచ్చేవి మరెన్నో! ఎసిడిటీ, విరేచనాలు, మలబద్ధకం నుండి మధుమేహం, గుండె పోటు వరకు. తాను చేయని తప్పుకి ఈ శిక్ష ఎందుకు? మరేం చేయాలి? ఆలోచించి, కోపకారణాన్ని



తెలుసుకోవాలి. మనని ఎవరైనా తప్పు పడితే – అది నిజంగా తప్పా? కాదా? అని తెలుసుకోవాలి. తప్పు అయితే సరిదిద్దుకోవాలి. (ఎత్తి చూపినవారికి మనసులోనైనా కృతజ్ఞతలు తెలుపుకుంటూ) తప్పు కాకపోతే, మనకి అనవసరం. అనుకున్నది సాధించ లేక తన మీద తనకే కోపం వస్తే, చేయలేక పోవటానికి ఉన్న కారణాలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఈ రకమైన విశ్లేషణ చేయటానికి మనస్సుని ప్రశాంతంగా ఉంచుకోవటం అవసరం. అందుకే అంటారు ఆవేశంలో నిర్ణయాలు తీసుకో కూడదు అని.

మానవ మాత్రులం కనక కోపం రావటం సహజం. కానీ దానిని అదుపులో ఉంచుకుని, దానినే ఆయుధంగా ఉపయోగించుకుంటే అదే ఉపకరణంగా మారి లక్ష్యసాధనకి సహకరిస్తుంది. శ్రీరామచంద్రుడు కోపాన్ని అదుపులో ఉంచుకున్నాడు. అది ఆయన చెప్పు చేతల్లో ఉంది. రమ్మంటే వస్తుంది. పొమ్మంటే పోతుంది. అందుకే ఆయనని 'జితక్రోధుడు' అన్నాడు వాల్మీకి. అవసరానికి కోపం వచ్చినట్టు కనపడాలి. దాని ప్రయోజనం దానికీ ఉంది.

పిల్లలు అల్లరి చేస్తుంటే తల్లి కేకలు వేస్తుంది. అమ్మకి కోపం వచ్చింది అనుకుంటారు. నిజానికి అది కోపమా? ఇంతలో అత్తగారో, భర్తో పిలిస్తే మామూలుగానే మాట్లాడుతుంది. అమ్మవారి చేతిలో క్రోధము అనే అంకుశం ఉంది అని లలితారహస్యనామసాహస్రంలో ఉంది. అంటే తన అశక్తత మీద కోపం తెచ్చుకుని అనుకున్నది సాధించాలి అని అర్థం. ఇది కోపాన్ని ఆయుధంగా వాడటం. శత్రువుని సాధనంగా మలచుకుని ముల్లుని ముల్లుతోనే తీయటం.

- డా.ఎన్. అనంతలక్ష్మి

బౌద్ధవాణి

ధర్మయోధుడు



అది కురుదేశం. దాని రాజధాని నగరం స్థూలకోష్ఠికం. ఆ నగరంలో ధనవంతుడైన పండితుని కుమారుడు రాష్ట్రపాలుడు. రాష్ట్రపాలునికి యుక్తవయస్సు దాటింది. అతనికి గృహజీవితం పట్ల అంతగా ఇష్టం ఉండేది కాదు. సన్యసించాలని, జ్ఞానం పొందాలని అనుకునేవాడు. ఒకరోజు బుద్ధుడు తన బౌద్ధసంఘంతో కలసి నగరానికి వచ్చాడు. తన మిత్రునితో కలిసి వెళ్ళి, బుద్ధుని ధర్మోపదేశం విన్నాడు రాష్ట్రపాలుడు. తానూ బౌద్ధ భిక్షువుగా మారాలి అనుకున్నాడు. బుద్ధుని దగ్గరకు వెళ్ళి నమస్కరించి, విషయం చెప్పాడు.

''రాష్ట్రపాలా! నీవు కుర్రవాడివి. నీ తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే నీకు భిక్షు దీక్ష ఇస్తాను'' అన్నాడు బుద్ధుడు.

రాష్ట్రపాలుడు ఇంటికి వెళ్ళి తల్లిదండ్రుల్ని అడిగాడు. వారు–

''నాయనా! మాకు నీవు ఒక్కడివే కుమారుడవి. పైగా మా కోట్లాది ధనానికీ నీవే వారసుడివి. నిన్ను వదిలి మేం బతకలేం. కాబట్టి భిక్షువుగా మారడానికి అనుమతించలేం'' అని తేల్చి చెప్పారు. రాష్ట్రపాలుడు రెండుమూడు రోజులు వారిని ప్రాధేయపడ్డాడు. చివరికి తన గదిలోకి చేరి, నిరాహార వ్రతం పూనాడు. వారం గడిచింది. రాష్ట్రపాలుడు నీరసించి పడిపోయాడు. తల్లిదండ్రులు భయపడ్డారు. భోరున విలపించారు. అప్పుడు రాష్ట్రపాలుని మిత్రున్ని పిలిపించారు. అతను చెప్పినా ఉపయోగం లేకుండా పోయింది. చివరికి ఆ మిత్రుడు– తల్లిదండ్రులతో

''మీరు అంగీకరించడమే మంచిది. కనీసం ఎక్కడో ఒకచోట బతికి ఉంటాడు. అయినా కొందరు కొంతకాలమే భిక్షు జీవనం సాగించి, ఇక సాగించలేక తిరిగి ఇంటిదారి పడుతున్నారు. మన వాడూ అదే చేయవచ్చు '' అని చెప్పడంతో ఏదో ఒక మూల ఆశతో తల్లిదండ్రులు అనుమతించారు.

మహా ఐశ్వర్యాన్ని వదిలి రాష్ట్రపాలుడు భిక్షువుగా మారాడు. కొన్నాళ్ళు గడిచాయి. కొడుకు తిరిగిరాలేదు. దానితో బుద్ధుని పట్ల, భిక్షువుల పట్ల చాలా కోపాన్ని పెంచుకున్నాడు రాష్ట్రపాలుడి తండ్రి.

ఒకరోజు కాషాయ బట్టలు కట్టుకుని, బోడిగుండుతో, భిక్షాపాత్ర పట్టుకుని ఒక భిక్షువు వారింటికి వచ్చాడు. పెరట్లో ఉన్న తండ్రికి వళ్ళు మండిపోయింది.

''భిక్షా లేదు, గంజీ లేదు. పో..పో'' అంటూ తిట్టాడు. ఇంట్లోకి వెళ్ళిపోయాడు. భిక్షువు చిరునవ్వుతో అక్కడి నుండి కదిలాడు. అంతలో ఇంటిలోని దాసి పాచిన గంజి పారబోయడానికి బయటకు తెచ్చింది. భిక్షువు ఆగి... ''అమ్మా! ఆ గంజి అయినా భిక్షగా వేయండి'' అన్నాడు.

ఆమె ఆ పాచిన గంజిని భిక్షాపాత్రలో పోస్తూ ఆ భిక్షువుకేసి తేరిపార చూసింది.ఆమె ఒళ్ళు జలదరించింది. నేల కంపించింది. నేలమీద పడి నమస్కరించింది. లేచి పరుగు పరుగున ఇంట్లోకి పోయింది.

''అయ్యా! ఆ వచ్చిన భిక్షువు మరెవరో కాదు. మన అబ్బాయి గారే'' అంది. ఆ మాట విని తల్లిదండ్రులు శోకిస్తూ వీధుల్లోకి వచ్చిపడ్డారు. అక్కడ భిక్షువు కనిపించలేదు. వెతుకుతూ వెళ్లారు. ఆ వీధి చివరనున్న తోటలో కూర్చొని ఆ పాచిన భిక్షను పరమాన్నంగా స్వీకరిస్తున్నాడు రాష్ట్రపాలుడు.

''నాయనా! మేము గమనించలేదు. రా! మన ఇంటికి రా! మంచి భోజనం వడ్డిస్తాం'' అన్నారు.

''గృహస్తులారా! ఈ రోజుకి నా భోజనం ముగిసింది'' అన్నాడు.

మరునాడు రమ్మన్నారు. అంగీకరించాడు. వెళ్ళాడు. ఉన్నతమైన ఆసనంపై బంగారు గిన్నెల్లో ఎన్నో రకాల ఆహార పదార్థాలు ముందు ఉంచారు. కొన్ని పళ్ళాల నిండా రత్నరాశులు, వజ్రవైడూర్యాలు నింపి ఆ గదిలో ఉంచారు.

''నాయనా! మనకి ఏం తక్కువ! ఈ పళ్ళాల్లో కాదు, గదుల నిండా ఇలాంటి ధనరాశి ఉంది. ఇవన్నీ నీకే... రా! ఆ భిక్ష జీవనం వదులు'' అన్నారు.

''మీరు ఆ ధనరాశుల్ని బండ్లకెత్తించి గంగానదిలో కుమ్మరించండి. లేదా... దానం చేయండి. నాకు జ్ఞాన సంపద కావాలి. ధర్మ సంపద కావాలి. శీలసంపద కావాలి. అది తరగని సంపద. అది తథాగతుని దగ్గర తరగనంత ఉంది. మీరూ ఆ ధర్మ మార్గాన్నే నడవండి. మీ జీవితాన్ని సార్థకం చేసుకోండి'' అని లేచి వెళ్లిపోయాడు రాష్ట్రపాలుడు.

- డా. బొర్రా గోవర్ధన్

సినిమా

విశ్వంభర యాక్షన్


● చిరంజీవి ● అల్లు అర్జున్

చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ మూవీ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ కొరియోగ్రాఫర్ అన్ల్ అరసు నేతృత్వంలో 'విశ్వంభర' క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ''చిరంజీవి చరిష్మాటిక్ ప్రెజెన్స్‌తో 'విశ్వంభర' మునుపెన్నడూ లేని ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించడానికి రెడీ అవుతోంది. 'విశ్వంభర' క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ విజువల్ వండర్‌లా ఉండబోతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 10న రిలీజ్ కానుంది.

చిరంజీవి కోటి విరాళం

కేరళలో కురుస్తున్న భారీ వర్షాలకు వయనాడ్‌లో భారీ ఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో దక్షిణాదికి చెందిన నటీనటులు తమవంతుగా ఆపన్న హస్తం అందిస్తున్నారు. తాజాగా హీరో చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు.

అల్లు అర్జున్ 25లక్షల విరాళం

వయనాడ్ వరద బాధితుల సహాయార్థం హీరో అల్లు అర్జున్ కూడా 25 లక్షలు విరాళం ప్రకటించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కి ఆ మొత్తాన్ని అందించనున్నట్లు ఆయన తెలిపారు.



తంగలాన్ సర్‌ప్రైజ్ చేస్తుంది

- విక్రమ్


● జ్ఞానవేల్ రాజా, మాళవికా మోహనన్, విక్రమ్, పార్వతి, పా.రంజిత్

''తంగలాన్' తమిళ సినిమానో, తెలుగు సినిమానో కాదు. ఓ మంచి సినిమా. నా మనసుకు దగ్గరైన సినిమా. 'తంగలాన్' చూసి ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమాలో ఎమోషన్స్, అడ్వెంచర్స్, మెసేజ్.. ఇలా చాలా అంశాలు ఉన్నాయి'' అని విక్రమ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్స్. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'తంగలాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడుతూ–''వందేళ్ల క్రితం జరిగిన కథ 'తంగలాన్'. 'మద్రాస్' సినిమా నుంచి పా.రంజిత్‌తో వర్క్ చేయాలనుకుంటే 'తంగలాన్'తో కుదిరింది. నాకు మంచి రోల్ ఇచ్చిన రంజిత్‌కు థ్యాంక్స్. జ్ఞానవేల్ రాజాగారు బాగా సపోర్ట్ చేశారు. నేను గతంలో నటించిన పాత్రల్ని (శివపుత్రుడు, నాన్న, సేతు, అపరిచితుడు, ఐ..) ఈ వేదికపై చూడగానే భావోద్వేగంగా అనిపించింది. ఇలాంటి విభిన్నమైన పాత్రలు ఇంకా చేయాలనే స్ఫూర్తి కలిగింది'' అన్నారు. పా. రంజిత్ మాట్లాడుతూ– ''తంగలాన్' రెగ్యులర్ మూవీ కాదు. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ఉంటుంది. విక్రమ్‌గారు అద్భుతంగా నటించారు. ఆయన దొరకడం నా అదృష్టం. 'తంగలాన్' ప్రేక్షకులందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''తెలుగు ప్రేక్షకులకు సినిమా అంటే ప్రాణం. 'తంగలాన్'ని సపోర్ట్ చేయండి. ఆగస్టు 15న విడుదలవుతున్న 'మిస్టర్ బచ్చన్', 'డబుల్ ఇస్మార్ట్', 'ఆయ్' వంటి సినిమాలూ విజయాలు సాధించాలి'' అన్నారు నిర్మాత జ్ఞానవేల్ రాజా. ''ఈ చిత్రంలో 'గంగమ్మ' పాత్రలో నటించాను. విక్రమ్‌లాంటి కో స్టార్‌ని నేను ఇప్పటి వరకూ చూడలేదు'' అన్నారు పార్వతి తిరువోతు. ''విక్రమ్ గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుకున్న నా కల 'తంగలాన్'తో నిజమైంది'' అన్నారు మాళవికా మోహనన్. ''ఇదొక అద్భుతమైన మూవీ'' అన్నారు నటుడు డేనియల్. ఈ కార్యక్రమంలో హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, స్టూడియోగ్రీన్ ఎగ్జిక్యూటివ్ సీఈవో ధనుంజయన్, నిర్మాతలు 'మధుర' శ్రీధర్, దామోదర ప్రసాద్, ప్రసన్నకుమార్, ఎస్‌కేఎన్, దర్శక–నిర్మాత సాయిరాజేష్, దర్శకుడు కరుణకుమార్, మైత్రీ మూవీస్ శశి మాట్లాడారు.

చెలిమికి నిన్న మొన్న లేదుగా..!


● ప్రియదర్శితో బాల నటీనటులు

'ఓరోరి పిల్లగా... బుడి బుడి అడుగులు బడి చేరగా... రోజూ హడావిడి జోరుగా... చెలిమికి నిన్న మొన్న లేదుగా.. ఎప్పుడూ కొత్తగా... లేరోయ్ స్నేహంలోన టాపరు.. దోస్తే లేని వాడే లూజరు..'అంటూ సాగుతుంది 'సయ్యారే సయ్యారే..' సాంగ్. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ లీడ్ రోల్స్‌లో నటించిన '35 – చిన్న కథ కాదు' సినిమాలోనిది ఈ పాట. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఈ నెల 15న ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ మూవీ నుంచి ఫ్రెండ్‌షిప్ ఆంథమ్‌గా 'సయ్యారే..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ పాటకి కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా కార్తీక్ పాడారు.

అంతకుమించి వేదా ఉంటుంది

- తమన్నా

''వేదా' మూవీ ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది. అయితే రెగ్యులర్ యాక్షన్ సినిమాల్లానే ఈ కాన్సెప్ట్ ఉందంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు. ట్రైలర్ చూసి ఇతర సినిమాలతో 'వేదా' ని పోల్చకండి. యాక్షన్ చిత్రాలకు మించి మా 'వేదా' ఉంటుంది'' అంటున్నారు హీరోయిన్ తమన్నా భాటియా. జాన్ అబ్రహాం హీరోగా నటించిన తాజా చిత్రం 'వేదా'. నిఖిల్ అద్వానీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో తమన్నా భాటియా, శార్వరీ వాఘ్, అభిషేక్ బెనర్జీ నటించారు. 'సలామ్ ఏ ఇష్క్' (2007) వంటి హిట్ మూవీ తర్వాత జాన్ అబ్రహాం, నిఖిల్ అద్వానీ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. జాన్ అబ్రహాం, మోనీషా అద్వానీ, మధు భోజ్వాని నిర్మించిన ఈ మూవీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఇటీవల ముంబైలో 'వేదా' మూవీ ట్రైలర్ లాంచ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా 'వేదా' మూవీపై స్పందించారు. ''మన దేశంలోని గొప్ప యాక్షన్ హీరోల్లో జాన్ అబ్రహాం ఒకరు. ఆయన 'వేదా' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నారు. అలాగే డైరెక్టర్ నిఖిల్ అద్వానీ ఏడేళ్ల తర్వాత మళ్లీ మెగాఫోన్ పట్టారు. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా కొత్త అనుభూతిని పంచుతుంది. ఈ మూవీ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు తమన్నా భాటియా.

ఉత్తమ హీరో నాని.. ఉత్తమ చిత్రం బలగం

● ఘనంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక


● వేణు యెల్దండి


● శ్రీకాంత్ ఓదెల, కీర్తి సురేశ్, నాని

హైదరాబాద్‌లో 69వ 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ –2024' వేడుక ఘనంగా జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ వేడుకకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలకు చెందిన నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా 'బలగం' ఎంపికైంది. అలాగే ఉత్తమ నటుడిగా నాని (దసరా), ఉత్తమ నటిగా కీర్తి సురేష్ (దసరా), ఉత్తమ దర్శకుడిగా వేణు యెల్దండి (బలగం), ఉత్తమ తొలి చిత్ర దర్శకులుగా శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న), ఉత్తమ సహాయ నటులుగా రవితేజ (వాల్తేరు వీరయ్య), బ్రహ్మానందం (రంగమార్తాండ) నిలిచారు. వివిధ విభాగాల్లో 'దసరా' చిత్రానికి 6 అవార్డులు రాగా, 'బేబి' మూవీకి ఐదు అవార్డులు వచ్చాయి. అలాగే 'బలగం' సినిమా మూడు అవార్డులు సొంతం చేసుకుంది. వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్' ని అందుకున్నారు.

సింబలో మంచి సందేశం ఉంది

- సంపత్ నంది


● అనసూయ, సంపత్ నంది, రాజేందర్ రెడ్డి, మురళీమనోహర్

''సింబ' మూవీ ప్రారంభం కావడానికి కారణం ఉదయభాను. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆమె నన్ను ఛాలెంజ్ చేసింది. ఆ తర్వాత కేసీఆర్, సంతోష్‌గార్లు తలపెట్టిన హరితహారం గురించి తెలుసుకున్నాను. ఆ సమయంలోనే నేను 'సింబ' కథ విన్నాను. నవ్విస్తూనే అందరికీ కనువిప్పు కలిగేలా మంచి సందేశం ఉన్న సినిమా ఇది'' అని డైరెక్టర్ సంపత్ నంది అన్నారు. అనసూయ, జగపతిబాబు లీడ్ రోల్స్‌లో మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన చిత్రం 'సింబ'. సంపత్‌నంది టీమ్ వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్‌పై సంపత్ నంది, రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనసూయ మాట్లాడుతూ– ''ప్రేక్షకుల ప్రశంసలు, అభిమానం వల్లే నేను 'సింబ' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేయగలుగుతున్నాను'' అన్నారు. ''సంపత్‌గారి కథకు నేను దర్శకత్వం వహించాను. 'సింబ' ఓ కొత్త పాయింట్‌తో రాబోతోంది'' అన్నారు మురళీ మనోహర్. ''కోటికిపైగా మొక్కలు నాటిన వనజీవి రామయ్య వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమా నిర్మించాం'' అన్నారు రాజేందర్ రెడ్డి. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, నటీనటులు దివి, భానుచందర్ తదితరులు మాట్లాడారు.

నువ్వే నా పొట్టేల్!


● రామ్

'పతాహై మై కౌన్ హూ' అంటూ రామ్ చెప్పే డైలాగ్‌తో 'డబుల్ ఇస్మార్ట్' ట్రైలర్ మొదలవుతుంది. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' (2019)కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో సంజయ్ దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు చేశారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించిన ఈ మూవీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. 'ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్', 'మీ వదినేమో కుతుబ్‌మినార్.. మనమేమో చార్‌మినార్.. రెండూ గుద్దుకుంటే ఎట్లుంటది రా', 'కర్మకాండ చేస్తా నా కొడకా', 'నువ్వే నా పొట్టేల్' అంటూ రామ్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ ట్రైలర్ లాంచ్ వేడుకలో రామ్ పోతినేని, కావ్యా థాపర్, అలీ, పూరి కనెక్ట్స్ సీఈఓ విష్ తదితరులు పాల్గొన్నారు.



లవ్లీనా పంచ్ సరిపోలేదు

విశ్వక్రీడల్లో భారత బాక్సర్లకు నిరాశ ఎదురైంది. ఆరుగురు బాక్సర్లతో పారిస్‌లో అడుగు పెట్టిన భారత బృందం.. రిక్త హస్తాలతో తిరిగి రానుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన లవ్లీనా బొర్గొహైన్ ఈసారి ఆకట్టుకోలేకపోయింది. ఆదివారం జరిగిన మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ లవ్లీనా 1-4తో లీ కియాన్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. బౌట్ ప్రారంభం నుంచే చైనా బాక్సర్ లెఫ్ట్ హుక్స్‌తో విరుచుకుపడగా.. వాటిని తప్పించుకుంటూ లవ్లీనా కొన్ని మంచి పంచ్‌లు విసిరింది. అయినా తొలి రౌండ్ కియాన్‌కు అనుకూలంగా ఫలితం వచ్చింది. ఆ తర్వాత లవ్లీనా పుంజుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పంచ్‌ల ధాటి నుంచి నేర్పుగా తప్పించుకున్న కియాన్... కీలక సమయాల్లో జాబ్స్, హుక్స్‌తో పైచేయి సాధించింది. భారత్ నుంచి పారిస్ క్రీడలకు ఆరుగురు బాక్సర్లు అర్హత సాధించగా.. అందరూ క్వార్టర్ ఫైనల్లోపే పరాజయం పాలయ్యారు.



జొకోవిచ్ కల నెరవేరగా...

- ఒలింపిక్స్‌లో ఎట్టకేలకు స్వర్ణం సాధించిన సెర్బియా స్టార్
- ఫైనల్లో అల్‌కరాజ్‌పై విజయం

పారిస్: కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్, 7 ఏటీపీ ఫైనల్స్ టైటిల్స్, ఎనిమిది సార్లు నంబర్‌వన్‌గా ఏడాది ముగింపు, 2 సార్లు కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్స్, డేవిస్‌కప్ విజేత, 428 వారాల పాటు వరల్డ్ నంబర్‌వన్... టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అత్యద్భుత ఆటతో సాధించిన అసాధారణ ఘనతలివి. అయితే ఇన్ని గొప్ప విజయాల తర్వాత కూడా జొకోవిచ్ కెరీర్‌లో ఒలింపిక్స్ స్వర్ణ పతకం ఒకటి ఇప్పటి వరకు లోటుగా ఉండిపోయింది. కానీ ఇప్పుడు జొకో దానిని కూడా సాధించి తన కెరీర్‌ను పరిపూర్ణం చేసుకున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జొకోవిచ్ పసిడి పతకం కోసం ఎంతో తపించాడు. దాని కోసం పోరాడుతూ వచ్చాడు. ఇప్పుడు 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఆ కల నెరవేరింది. 'కెరీర్ గోల్డెన్‌స్లామ్' నెగ్గిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో అతను తన పేరును లిఖించుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో జొకో 7-6 (7/3), 7-6 (7/2) స్కోరుతో కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. ఇటీవలే వింబుల్డన్ ఫైనల్లో తనను ఓడించి ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అల్‌కరాజ్‌పై తన అనుభవాన్నంతా ఉపయోగించి టైబ్రేక్‌లో సెర్బియా స్టార్ పైచేయి సాధించాడు. 37 ఏళ్ల జొకో అతి పెద్ద వయసులో ఒలింపిక్ టెన్నిస్‌లో స్వర్ణం సాధించిన ఆటగాడిగా నిలిచాడు. విజయం తర్వాత సెర్బియా జాతీయ పతాకంతో తన కుటుంబసభ్యులు, టీమ్ వద్దకు పరుగెత్తిన జొకోవిచ్ కన్నీళ్లపర్యంతమయ్యాడు. తన కొడుకు, కూతురును కౌగిలించుకొని అతను ఏడ్చేసిన తీరు అతని దృష్టిలో ఈ పతకం విలువేమిటో చూపించింది.



'దస్' కా దమ్...



'షూటౌట్'లో బ్రిటన్ ప్లేయర్ ఫిలిప్ రాపర్ షాట్‌ను నిలువరిస్తున్న భారత గోల్‌కీపర్ శ్రీజేశ్

10 మంది ఆటగాళ్లతో ఆడి క్వార్టర్స్‌లో బ్రిటన్‌పై విజయం

సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో భారత్

'షూటౌట్'లో టీమిండియా పైచేయి ● శ్రీజేశ్ అద్భుత గోల్ కీపింగ్

ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు మరో అద్భుతాన్ని చూపించింది. టోక్యోలో మూడేళ్ల క్రితం నాటి జోరును పునరావృతం చేస్తూ సెమీఫైనల్‌కు చేరింది. అప్పటిలాగే ఈసారి కూడా ప్రత్యర్థి బ్రిటన్. నాడు నిర్ణీత సమయంలోనే భారత్ విజయం సాధించగా, ఇప్పుడు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ షూటౌట్‌కు చేరింది. తుది ఫలితం మాత్రమే సేమ్ టు సేమ్. భారత ఆటగాళ్లంతా చురుకైన ఆటతో సత్తా చాటగా, ఎప్పటిలాగే గోల్ కీపర్ శ్రీజేశ్ అసాధారణ గోల్ కీపింగ్ జట్టును గెలిపించింది. మూడు క్వార్టర్ల పాటు ఒక ఆటగాడిని కోల్పోయి పది మందితోనే టీమిండియా కొనసాగినా... పదునైన డిఫెన్స్‌తో మన జట్టు ప్రత్యర్థిని నిలువరించగలిగింది. మరో మ్యాచ్ గెలిచి ఫైనల్ చేరితే గత ఒలింపిక్స్‌కంటే మెరుగైన ఫలితంతో భారత్ సగర్వంగా నిలుస్తుంది.

పారిస్: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం సాధించే దిశగా భారత పురుషుల హాకీ జట్టు ఆశలు రేపుతోంది. స్ఫూర్తిదాయక ఆటతీరు కనబర్చిన మన జట్టు పారిస్ఒలింపిక్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 'షూటౌట్'లో బ్రిటన్‌ను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవగా... 'షూటౌట్'లో భారత్ 4-2తో పైచేయి సాధించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడిన పోరులో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 22వ నిమిషంలో, బ్రిటన్ తరఫున లీ మార్టన్ 27వ నిమిషంలో గోల్స్ సాధించారు.

'షూటౌట్'లో భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, రాజ్‌కుమార్ గోల్స్ చేయగా... బ్రిటన్ ఆటగాళ్లలో జేమ్స్ అల్బరీ, జాక్ వలాస్ మాత్రమే గోల్స్ కొట్టారు. కానర్ విలియమ్సన్, ఫిలిప్ రాపర్ విఫలమయ్యారు. రాపర్ గోల్‌ను శ్రీజేశ్ అద్భుతంగా నిలువరించిన తర్వాత భారత్ 3-2తో ఆధిక్యంలో నిలవగా... నాలుగో షాట్‌ను రాజ్‌కుమార్ గోల్‌గా మలచడంతో భారత బృందం సంబరం చేసుకుంది. ఫలితం తేలిపోవడంతో చివరిదైన ఐదో షాట్‌ను బ్రిటన్ తీసుకోలేదు. జర్మనీ, అర్జెంటీనా జట్ల మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో భారత జట్టు మంగళవారం జరిగే సెమీఫైనల్లో తలపడుతుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్ ఓడిపోతే గురువారం కాంస్య పతకం కోసం పోటీపడుతుంది. సెమీస్‌లో గెలిస్తే మాత్రం 1980 మాస్కో ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో భారత్‌కు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. ఆరంభంలో బ్రిటన్ చాలా దూకుడుగా ఆడుతూ వరుసగా దాడులు చేసింది. తొలి ఐదు నిమిషాల్లోనే ఆ జట్టుకు రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించగా, భారత్ వాటిని నిలువరించింది. 11వ నిమిషంలో కూడా బ్రిటన్ జట్టు పెనాల్టీ కార్నర్ ద్వారా చేసిన ప్రయత్నం వృథా అయింది. భారత్ కూడా తొలి క్వార్టర్‌లో రెండు పెనాల్టీలు సంపాదించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. రెండో క్వార్టర్ కూడా ఇదే తరహాలో సాగింది. అయితే 22వ నిమిషంలో లభించిన పెనాల్టీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచడంతో ఆధిక్యం దక్కింది. కానీ మరో ఐదు నిమిషాలకే వేగంగా దూసుకొచ్చిన లీ మార్టన్ చేసిన గోల్ ప్రయత్నాన్ని కీపర్ శ్రీజేశ్ ఆపడంలో విఫలం కావడంతో స్కోరు సమమైంది. మూడో క్వార్టర్‌లో కూడా బ్రిటన్‌కు మూడు పెనాల్టీలు రాగా శ్రీజేశ్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత చివరి వరకు ఇరు జట్లు మరో గోల్ కోసం ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాయి.

రోహిదాస్‌కు రెడ్ కార్డ్



మ్యాచ్‌లో జరిగిన ఒక అనూహ్య ఘటన భారత్‌ను మ్యాచ్ ఆసాంతం ఇబ్బంది పెట్టింది. 17వ నిమిషంలో భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్ స్టిక్ బ్రిటన్ ఫార్వర్డ్ విలియమ్ కల్నాన్ తలకు తగిలింది. వీడియో రీప్లే చూస్తే అతను ఉద్దేశపూర్వకంగా చేసినట్లు అనిపించకపోయినా... మ్యాచ్ రిఫరీ తీవ్ర చర్య తీసుకున్నాడు. రోహిదాస్‌కు 'రెడ్ కార్డ్' చూపించడంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. దాంతో మిగిలిన మ్యాచ్ మొత్తం భారత్ 10 మందితోనే ఆడింది. మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ డిఫెండర్‌గా బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. దీనిపై భారత జట్టు అప్పీల్ చేసింది. దీనిపై వాదనల అనంతరం రోహిదాస్ తప్పు చేసినట్లు తేలితే అతనిపై ఒక మ్యాచ్ నిషేధం (సెమీఫైనల్) పడే అవకాశం ఉంది.



ఓటమి తర్వాత బ్రిటన్ ప్లేయర్ లీ మోర్టాన్ నిరాశ

బెల్జియంకు షాక్

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న బెల్జియం జట్టు పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 3-2తో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత బెల్జియం జట్టును బోల్తా కొట్టించింది. తద్వారా 2008 బీజింగ్ ఒలింపిక్స్ తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరుకుంది. మూడో క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ 2-0తో ఆస్ట్రేలియా జట్టును ఓడించి సెమీఫైనల్లో స్పెయిన్‌తో పోరుకు సిద్ధమైంది.



గోల్‌కీపర్ శ్రీజేశ్‌తో భారత ఆటగాళ్ల సంబరం

"చివరి వరకు స్కోరును సమంగా ఉంచడం తప్ప మాకు మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. అందుకే పూర్తిగా డిఫెన్స్‌పైనే దృష్టి పెట్టాల్సి వచ్చింది. పది మందితో ఆడటం మ్యాచ్‌లో కఠిన సమయం. కానీ ఏమీ చేయలేం. ఆటగాళ్లంతా సమష్టి ప్రదర్శన కనబర్చారు. పరిస్థితులు ఎలా ఉన్నా ఇదే తరహా మానసిక దృఢత్వంతో సెమీస్ ఆడతాం. శ్రీజేశ్ దిగ్గజం. తొలి మ్యాచ్ నుంచి అతను మమ్మల్ని ఆదుకుంటూనే ఉన్నాడు." -హర్మన్‌ప్రీత్ సింగ్, భారత కెప్టెన్

"గోల్ కీపర్‌గా నా బాధ్యత నెరవేర్చాను. ఈ రోజు భారత్‌కు కలిసొచ్చింది. షూటౌట్‌లో షాట్ తీసుకున్న భారత ఆటగాళ్లెవరూ నిరాశపర్చలేదు. వారు స్కోరు చేయడం వల్ల నాలో నమ్మకం మరింత పెరిగింది. మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు ఇది నా ఆఖరి మ్యాచ్ కావచ్చు లేదా బాగా ఆడితే మరో రెండు మ్యాచ్‌లు ఆడవచ్చని అనుకున్నాను. సెమీస్ ప్రత్యర్థి ఎవరైనా ఇలాగే ఆడతాం." -పీఆర్ శ్రీజేశ్, భారత గోల్‌కీపర్

7 ఒలింపిక్స్ హాకీలో బ్రిటన్ జట్టుపై భారత్ గెలుపొందడం ఇది ఏడోసారి. రెండు జట్లు విశ్వ క్రీడల్లో ఇప్పటి వరకు పది సార్లు తలపడ్డాయి. మూడు మ్యాచ్‌ల్లో బ్రిటన్ నెగ్గింది. చివరిసారి 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో భారత జట్టుపై బ్రిటన్ గెలిచింది.

52 వరుసగా రెండు ఒలింపిక్స్ క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్ చేరడం 52 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. భారత జట్టు 1936 బెర్లిన్ ఒలింపిక్స్ నుంచి 1972 మ్యూనిక్ ఒలింపిక్స్ వరకు కనీసం సెమీఫైనల్ దశ దాటింది. 1976 మెక్సికో ఒలింపిక్స్‌లో భారత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరడంతోపాటు స్వర్ణ పతకాన్ని సాధించింది.

ఇక కాంస్యం లక్ష్యంగా...



సెమీఫైనల్లో ఓడిన లక్ష్య సేన్

- డిఫెండింగ్ చాంపియన్ అక్సెల్‌సన్ చేతిలో ఓటమి
- నేడు కాంస్య పతక పోరులో లీ జీ జియాతో పోరు

పారిస్: తొలి గేమ్‌లో 17-11తో ఆరు పాయింట్ల ఆధిక్యం... ఆ తర్వాత 20-17 వద్ద తొలి గేమ్ సొంతం చేసుకునే అవకాశం... రెండో గేమ్ ఆరంభంలో 7-0తో ముందంజ... ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) సెమీఫైనల్ మ్యాచ్‌లో వేర్వేరు దశల్లో భారత షట్లర్ లక్ష్య సేన్‌కు లభించిన అవకాశాలివి. కానీ దురదృష్టవశాత్తూ అనుభవలేమి, ఒత్తిడితో చివరకు అతనికి ఓటమే ఎదురైంది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 20-22, 14-21 స్కోరుతో అక్సెల్‌సన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. 54 నిమిషాల పాటు సాగిన సమరంలో సేన్ పదునైన ఆటతో చెలరేగినా... అక్సెల్‌సన్ ముందు అది సరిపోలేదు. డెన్మార్క్ స్టార్ చేతిలో సేన్ ఓడిపోవడం ఇది ఎనిమిదో సారి. సెమీస్ ఓటమితో సేన్ ఇక కాంస్యపతకం కోసం పోరాడతాడు. మూడో స్థానం కోసం నేడు జరిగే 'ప్లే ఆఫ్' మ్యాచ్‌లో ప్రపంచ 7వ ర్యాంకర్ లీ జీ జియా (మలేసియా)ను లక్ష్య సేన్ ఎదుర్కొంటాడు. రెండో సెమీఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వితిద్‌సర్న్ కున్లావత్ (థాయ్‌లాండ్) 21-14, 21-15తో లీ జీ జియాపై గెలుపొందాడు. ఆరంభంలో 2-5తో వెనుకబడినా ఆ తర్వాత చక్కటి క్రాస్ కోర్ట్ షాట్‌లు, ర్యాలీలతో పాయింట్లు సాధించిన లక్ష్య 8-7తో ముందంజ వేశాడు. అక్సెల్‌సన్ వరుసగా తప్పులు చేయడంతో 15-9తో దూసుకుపోయిన సేన్... స్కోరును 17-11 వరకు చేర్చాడు. కానీ ఇక్కడే అక్సెల్‌సన్ నుంచి అద్భుత ఆట బయటకు వచ్చింది. కోర్టు నలుమూలల నుంచి షాట్‌లతో సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ వరుస పాయింట్లు సాధించిన అతను ఆధిక్యాన్ని 16-18కి తగ్గించాడు. ఆపై స్కోరు 17-20కి చేరింది. కానీ ఇక్కడ మళ్లీ మళ్లీ షటిల్‌ను నెట్‌కు కొట్టిన సేన్ వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయి గేమ్‌నే చేజార్చుకున్నాడు. రెండో గేమ్‌లో 7-0తో జోరుగా మొదలు పెట్టినా దానిని భారత ఆటగాడు కొనసాగించలేకపోయాడు. డిఫెన్స్‌లో పడిన సేన్ అనవసర తప్పిదాలు చేయగా...కోలుకున్న అక్సెల్‌సన్ స్కోరును 7-8కి, ఆపై 15-12కు తీసుకెళ్లాడు. అనంతరం ఎదురు లేకుండా దూసుకుపోయిన డెన్మార్క్ ప్లేయర్ ఫోర్‌హ్యాండ్ స్మాష్‌లతో వరుస పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

"తొలి గేమ్‌ను గెలుచుకొని ఉంటే మ్యాచ్ కూడా గెలిచే వాడిని. నేను డిఫెన్స్‌లో పడిపోకుండా మరింత అటాకింగ్ గేమ్ ఆడాల్సింది. ఆ తర్వాత రెండో గేమ్‌లో పట్టు బిగించలేకపోయాను. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని కాంస్య పతక పోరులో బాగా ఆడతాను. ఈ మ్యాచ్‌లో నాకు మద్దతు ఇచ్చిన అభిమానులు సోమవారం కూడా అలాగే సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నా." -లక్ష్య సేన్

"లక్ష్య సేన్ చాలా మంచి ఆటగాడు. తన పదును ఏమిటో అతను ఒలింపిక్స్‌లో చూపించాడు. అయితే కీలక సమయంలో నేను ప్రశాంతంగా ఆడి పైచేయి సాధించగలిగాను. ఇక్కడ నా అనుభవం పని చేసింది. గతంలో ఏ భారత ఆటగాడూ సాధించని విధంగా అతను సెమీస్ చేరాడు. దాంతో అతనిపై ఒత్తిడి బాగా పెరిగి తప్పులు చేశాడు. వచ్చేసారి ఒలింపిక్స్‌లో అతను స్వర్ణం గెలిచే అవకాశం ఉందని నేను నమ్ముతున్నా." -అక్సెల్‌సన్

దిగ్గజాల సరసన లెడెకీ, డ్రెసెల్

ఒలింపిక్స్‌లో 9 స్వర్ణాల చొప్పున గెలిచిన అమెరికా స్విమ్మర్లు

పారిస్: విశ్వ క్రీడల్లో అతికొద్ది మందికే సాధ్యమైన ఘనతను అమెరికా స్విమ్మర్లు కేటీ లెడెకీ, సెలబ్ డ్రెసెల్ సాధించారు. ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో అత్యధిక స్వర్ణాలు సాధించిన క్రీడాకారుల జాబితాలో వీరిద్దరు మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానానికి చేరుకున్నారు. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లో లెడెకీ, డ్రెసెల్ రెండు స్వర్ణాల చొప్పున సాధించారు. దాంతో ఓవరాల్‌గా ఒలింపిక్స్ క్రీడల్లో వీరిద్దరు నెగ్గిన పసిడి పతకాల సంఖ్య 9కి చేరుకుంది. ఇప్పటికే 'పారిస్'లో 1500 మీటర్లలో బంగారు పతకం గెలిచిన లెడెకీ ఆదివారం జరిగిన 800 మీటర్ల విభాగంలోనూ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు డ్రెసెల్ 4x100 మీటర్ల ఫ్రీస్టయిల్ టీమ్ స్వర్ణానికి 4x100 మీటర్ల మిక్స్‌డ్ మెడ్లే పసిడి పతకాన్ని జత చేశాడు. ఒలింపిక్స్‌లో అత్యధిక స్వర్ణ పతకాలు గెలిచిన రికార్డు అమెరికా స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ (23 స్వర్ణాలు) పేరిట ఉంది. ఆ తర్వాత 9 స్వర్ణాలతో లారిసా లాతినినా (జిమ్నాస్టిక్స్; సోవియట్ యూనియన్), పావో నుర్మీ (అథ్లెటిక్స్; ఫిన్‌లాండ్), మార్క్ స్పిట్జ్ (స్విమ్మింగ్; అమెరికా), కార్ల్ లూయిస్ (అథ్లెటిక్స్; అమెరికా), కేటీ లెడెకీ, డ్రెసెల్ ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు.



లెడెకీ



డ్రెసెల్



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

రెజ్లింగ్
మహిళల 68 కేజీల ఫ్రీస్టయిల్ ప్రిక్వార్టర్స్: నిషా దహియా X సోవా రిజ్కో (ఉక్రెయిన్) (సాయంత్రం గం. 6:30 నుంచి)

టేబుల్ టెన్నిస్
మహిళల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్: భారత్ X రొమేనియా (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)

సెయిలింగ్
మహిళల డింగీ రేసులు: (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). పురుషుల డింగీ రేసులు: (సాయంత్రం గం. 6:10 నుంచి)

అథ్లెటిక్స్
మహిళల 400 మీటర్ల పరుగు తొలి రౌండ్: కిరణ్ పహల్ (హీట్ 5) (మధ్యాహ్నం గం. 3:57 నుంచి). పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ తొలి రౌండ్: అవినాశ్ సాబ్లే (హీట్ 2) (రాత్రి గం. 10:50 నుంచి)

బ్యాడ్మింటన్
పురుషుల సింగిల్స్ కాంస్య పతక పోరు: లక్ష్యసేన్ X లీ జీ జియా (మలేసియా) (సాయంత్రం గం. 6:00

షూటింగ్
స్కీట్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్: మహేశ్వరి చౌహాన్ X అనంత్ జీత్ సింగ్ నరుకా (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ఫైనల్ (అర్హత సాధిస్తే): సాయంత్రం గం. 6:30 నుంచి.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	19	15	11	45
2	అమెరికా	18	26	25	69
3	ఫ్రాన్స్	12	14	18	44
4	ఆస్ట్రేలియా	12	10	7	29
5	బ్రిటన్	10	12	15	37
6	దక్షిణ కొరియా	10	7	7	24
7	జపాన్	8	5	10	23
8	ఇటలీ	7	9	5	21
9	నెదర్లాండ్స్	6	5	4	15
10	జర్మనీ	5	5	2	12
11	కెనడా	4	4	8	16
57	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.



ఒలింపిక్ పతకం నెగ్గేంతవరకు నిష్క్రమించను: ఆర్చర్ దీపిక కుమారి

పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకం చేజార్చుకున్న భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి.. విశ్వక్రీడల్లో మెడల్ గెలిచేంత వరకు కెరీర్‌కు రిటైర్మెంట్‌ను ప్రకటించనని వెల్లడించింది. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన దీపిక... మహిళల వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్లో ఓడి నిష్క్రమించింది. అంతర్జాతీయ టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలు నెగ్గిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపికకు ఒలింపిక్ మెడల్ మాత్రం అందని ద్రాక్షలానే ఊరిస్తోంది. 'కెరీర్ కొనసాగిస్తా. ఒలింపిక్ పతకం గెలవాలని బలంగా కోరుకున్నా. అది సాధించేవరకు ఆట నుంచి విశ్రాంతి తీసుకోను, నిష్క్రమించను. మరింత కఠోర సాధన చేసి బలంగా తిరిగి పుంజుకుంటా. వేగంగా బాణాలు వేయడంపై దృష్టి పెడతా. ఈ వేదికపై పొరబాట్లకు తావివ్వకూడదు. వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటా' అని దీపిక వెల్లడించింది. కీలక పోరులో 7 పాయింట్లు సాధించడం ఫలితంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొంది. అదొక్కటి మినహా పారిస్‌లో మంచి ప్రదర్శనే చేశానని దీపిక వివరించింది.

వాండెర్సే వలలో చిక్కిన భారత్

రెండో వన్డేలో 32పరుగులతో ఓడిన టీమిండియా

- 6 వికెట్లతో మెరిసిన శ్రీలంక స్పిన్నర్ వాండెర్సే
- రోహిత్ శర్మ మెరుపులు వృథా

కొలంబో: భారత్ ముందున్న లక్ష్యం 241. రోహిత్ శర్మ మెరుపులతో 13.2 ఓవర్లలోనే భారత్ (97/0) వందకు చేరువైంది. ఈ స్కోరు చూసిన వారెవరికైనా భారత్ గెలుపు సులువే అనిపిస్తుంది. కానీ 'హిట్‌మ్యాన్' అవుటవడంతోనే భారత్ మెడకు లంక స్పిన్ ఉచ్చు బిగించింది. అంతే 208 పరుగులకే భారత్ కుప్పకూలింది. దీంతో తొలి వన్డేను 'టై' చేసుకున్న ఆతిథ్య శ్రీలంక రెండో వన్డేలో 32 పరుగులతో విజయం సాధించింది. టి20ల్లో క్లీన్‌స్వీప్ అయిన లంక వన్డేల్లో 1–0తో ఇక సిరీస్ కోల్పోలేని స్థితిలో నిలిచింది. మొదట శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (62 బంతుల్లో 40; 5 ఫోర్లు), కమిందు మెండిస్ (44 బంతుల్లో 40; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. వాషింగ్టన్ సుందర్ 3, కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం టీమిండియా 42.2 ఓవర్లలో 208 పరుగులకే ఆలౌటైంది. రోహిత్ శర్మ (44 బంతుల్లో 64; 5 ఫోర్లు, 4 సిక్సలు), అక్షర్ పటేల్ (44 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సలు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండెర్సే (6/33) ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అసలంక 3 వికెట్లు తీశాడు. సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే బుధవారం జరుగుతుంది.

తొలి బంతికే వికెట్...

ఫామ్‌లో ఉన్న ఓపెనర్ నిసాంక (0)ను ఇన్నింగ్స్ తొలి బంతికే భారత బౌలర్ సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 30; 3 ఫోర్లు) కుదురుగా ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే సుందర్ తన వరుస ఓవర్లలో ఫెర్నాండో, కుశాల్‌లను అవుట్ చేయడంతో 74 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. దీంతోపాటు 79 పరుగుల వద్ద మూడు వికెట్లను కోల్పోయింది. తర్వాత కెప్టెన్ చరిత్ అసలంక (42 బంతుల్లో 25; 3 ఫోర్లు), సమరవిక్రమ (14) జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. అక్షర్ ఈ జోడీని ఎక్కువసేపు నిలువనీయలేదు. సమరవిక్రమను అవుట్ చేయడంతో 111 పరుగుల వద్ద నాలుగో వికెట్ పడింది. కొద్దిసేపటి తర్వాత జనిత్ లియనగే (12)ను కుల్దీప్, అసలంకను సుందర్ అవుట్ చేయడంతో లంక ఒక దశలో 136 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఇలాంటి పరిస్థితిలో భారత బౌలర్లు పట్టుబిగించకుండా కమిందు మెండిస్ (44 బంతుల్లో 40; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. దునిత్ వెల్లలగే (35 బంతుల్లో 39; 1 ఫోర్, 2 సిక్సలు)తో కలిసి కమిందు ఏడో వికెట్‌కు చకచకా 72 పరుగులు జోడించడం లంకను నిలబెట్టింది. దునిత్ అవుటయ్యాక కూడా స్కోరులో వేగం తగ్గకుండా కమిందు, అకిల ధనంజయ (15; 2 ఫోర్లు) పరుగులు సాధించడంతో ఆఖరి 5 ఓవర్లలో శ్రీలంక 44 పరుగులు చేసింది. సిరాజ్, అక్షర్ పటేల్‌లకు చెరో వికెట్ దక్కింది.

రోహిత్ ఉన్నంత వరకే...

ఓపెనర్లు రోహిత్, శుబ్‌మన్ గిల్ (44 బంతుల్లో 35; 3 ఫోర్లు) తొలి వన్డే కంటే మరింత పటిష్టమైన పునాది వేశారు. నాలుగో ఓవర్ నుంచి కెప్టెన్ రోహిత్ దూకుడు పెంచాడు. వెల్లలగే వేసిన ఆ ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. అసిత ఏడో ఓవర్లో ఫోర్, సిక్సర్ కొట్టాడు. దీంతో జట్టు స్కోరు 50కి చేరింది. తర్వాత ధనంజయ, కమిందు మెండిస్ ఓవర్లలో భారీ సిక్సర్లతో రోహిత్ 29 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 10 ఓవర్లలో భారత్ స్కోరు 76/0. వెల్లలగే వేసిన 13వ ఓవర్లో సిక్స్ కొట్టిన రోహిత్... తర్వాతి వాండెర్సే బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడి నిసాంక చేతికి చిక్కాడు. దీంతో 97 పరుగుల ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లి బౌండరీతో ఆ ఓవర్లోనే జట్టు స్కోరు వంద దాటింది. కానీ కాసేపటికే వాండెర్సే ఒకే ఓవర్లో గిల్, దూబే (0)లను అవుట్ చేశాడు. తన తదుపరి ఓవర్లలో కోహ్లి (14), శ్రేయస్ అయ్యర్ (7) వికెట్లు తీశాడు. దీంతో 133 పరుగులకే భారత్ సగం వికెట్లను కోల్పోయింది. అక్షర్ ధాటిగా ఆడుతుంటే... ఇంకోవైపు కేఎల్ రాహుల్ (0)ను వాండెర్సే డకౌట్ చేశాడు. అక్షర్, సుందర్ (15) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నప్పటికీ జట్టును ఒడ్డున పడేయలేకపోయారు. వీళ్లిద్దరితో పాటు సిరాజ్‌ను అసలంక పెవిలియన్ చేర్చడంతో 201 పరుగుల వద్దే భారత్ 9వ వికెట్ కోల్పోయింది. అర్ష్‌దీప్ (3) రనౌట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.



వాండెర్సే



రోహిత్

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; అవిష్క (సి అండ్ బి) సుందర్ 40; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 30; సమరవిక్రమ (సి) కోహ్లి (బి) అక్షర్ 14; అసలంక (సి) అక్షర్ (బి) సుందర్ 25; జనిత్ (సి అండ్ బి) కుల్దీప్ 12; వెల్లలగే (సి) దూబే (బి) కుల్దీప్ 39; కమిందు (రనౌట్) 40; ధనంజయ (రనౌట్) 15; వాండెర్సే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 240. వికెట్ల పతనం: 1–0, 2–74, 3–79, 4–111, 5–136, 6–136, 7–208, 8–239, 9–240. బౌలింగ్: సిరాజ్ 8–1–43–1, అర్ష్‌దీప్ 9–0–58–0, అక్షర్ 9–0–38–1, శివమ్ దూబే 2–0–10–0, సుందర్ 10–1–30–3, కుల్దీప్ 10–1–33–2, రోహిత్ 2–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) నిసాంక (బి) వాండెర్సే 64; గిల్ (సి) కమిందు (బి) వాండెర్సే 35; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 14; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 0; అక్షర్ (సి అండ్ బి) అసలంక 44; అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 7; రాహుల్ (బి) వాండెర్సే 0; సుందర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 15; కుల్దీప్ (నాటౌట్) 7; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 4; అర్ష్‌దీప్ (రనౌట్) 3; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (42.2 ఓవర్లలో ఆలౌట్) 208. వికెట్ల పతనం: 1–97, 2–116, 3–116, 4–123, 5–133, 6–147, 7–185, 8–190, 9–201, 10–208. బౌలింగ్: అసిత ఫెర్నాండో 7–0–31–0, వెల్లలగే 6–0–41–0, ధనంజయ 10–1–54–0, కమిందు మెండిస్ 3–0–19–0, వాండెర్సే 10–0–33–6, అసలంక 6.2–2–20–3.

పారుల్... రెండో 'సారీ'

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లోనూ హీట్స్‌లోనే అవుట్

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో మనవాళ్లు ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్నారు. ఇప్పటికే మహిళల 5000 మీటర్ల పరుగులో నిరాశ పరిచిన పారుల్ చౌధరీ 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లోనూ హీట్స్‌లోనే వెనుదిరిగింది. ఆదివారం జరిగిన పోటీల్లో పారుల్ 9 నిమిషాల 23.39 సెకన్లలో లక్ష్యాన్ని చేరి హీట్స్‌లో 9వ స్థానంలో నిలిచింది. ఒక్కో హీట్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధించారు. గమ్యాన్ని చేరేందుకు తన అత్యుత్తమ టైమింగ్ (9 నిమిషాల 15.31 సెకన్లు) కంటే ఎక్కువ సమయం తీసుకున్న పారుల్ ఓవరాల్‌గా 21వ స్థానంతో సరిపెట్టుకుంది. గత ఏడాది ఆసియా క్రీడల్లో పారుల్ 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో రజతం, 5000 మీటర్లలో స్వర్ణం సాధించింది. అయితే తొలిసారి ఒలింపిక్స్‌లో పాల్గొన్న పారుల్ నిరాశపరిచింది. ఇక పురుషుల లాంగ్‌జంప్‌లో జెస్విన్ అల్‌డ్రిన్ గ్రూప్ 'బి'లో 13వ స్థానంలో నిలిచాడు. 7.61 మీటర్ల దూరం లంఘించిన జెస్విన్ మొత్తంగా 26వ స్థానంతో 'పారిస్' క్రీడల నుంచి నిష్క్రమించాడు. ఈ విభాగంలో 8.15 మీటర్లు దాటిన అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సంపాదించారు.



పారుల్

పిస్టల్ 'మిస్' ఫైర్

ఫైనల్ చేరలేకపోయిన భారత షూటర్లు



విజయ్‌వీర్

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో... మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. ఆదివారం క్వాలిఫికేషన్ రౌండ్ ఆరంభంలో ఆకట్టుకున్న భారత షూటర్లు విజయ్‌వీర్ సిద్ధూ, అనీశ్ భన్వాలా చివరి వరకు అదే జోరు కొనసాగించలేక.. ఫైనల్ చేరే అవకాశాన్ని కోల్పోయారు. విజయ్‌వీర్ 583 పాయింట్లతో తొమ్మిదో స్థానానికి పరిమితం కాగా... అనీశ్ 582 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచాడు. ఒక దశలో రెండో స్థానానికి చేరి ఆశలు రేపిన విజయ్‌వీర్ ఆ తర్వాత గురి తప్పడంతో తుదిపోరుకు చేరకుండానే వెనుదిరిగాడు. తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. మహిళల స్కీట్ విభాగంలో మహేశ్వరి చౌహాన్ (118 పాయింట్లు) 14వ స్థానం, రైజా ధిల్లాన్ (113 పాయింట్లు) 23వ స్థానాలతో సరిపెట్టుకున్నారు. నేటితో ఒలింపిక్స్‌లో షూటింగ్ ఈవెంట్ ముగుస్తుంది. చివరిరోజు స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో భారత్ నుంచి మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్ సింగ్ నరూకా జోడీ పోటీపడనుంది. మొత్తం 15 జోడీలు క్వాలిఫయింగ్‌లో ఉన్నాయి. టాప్–4లో నిలిచిన జోడీలు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. టాప్–2లో నిలిచిన రెండు జంటలు స్వర్ణ–రజత పతకాల కోసం... మూడు–నాలుగు స్థానాల్లో నిలిచిన రెండు జోడీలు కాంస్య పతకం కోసం పోటీపడతాయి.

శుభాంకర్ 40వ స్థానంలో...

పారిస్ ఒలింపిక్స్ గోల్ఫ్ పురుషుల వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో భారత్‌కు నిరాశ తప్పలేదు. ఈ విభాగంలో పోటీపడిన శుభాంకర్ శర్మ 40వ స్థానంలో నిలవగా ... గగన్‌జీత్ సింగ్ భుల్లర్ 45వ ప్లేస్‌తో సరిపెట్టుకున్నాడు. శుభాంకర్ ఓవరాల్‌గా 283 పాయింట్లు సాధించగా.. గగన్‌జీత్ 285 పాయింట్లతో ఆకట్టుకోలేకపోయారు. సెయిలింగ్ డింగీ విభాగంలో 8 రేసులు ముగిసేసరికి పురుషుల విభాగంలో భారత సెయిలర్ విష్ణు శరవణన్ 18వ స్థానంలో.. మహిళల విభాగంలో నేత్ర కుమానన్ 25వ స్థానంలో నిలిచారు. నేడు మరో రెండు రేసులు జరగాల్సి ఉంది. మొత్తం పది రేసుల్లో టాప్–10లో నిలిచిన సెయిలర్లు పతక పోరుకు అర్హత సాధిస్తారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్‌లో 4,455 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో)/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,445(ఎస్సీ–657, ఎస్టీ–332, ఓబీసీ–1185, ఈడబ్ల్యూఎస్–435, యూఆర్–1846).
» **బ్యాంక్‌ల వారీగా ఖాళీలు:** బ్యాంక్ ఆఫ్ ఇండియా–885, కెనరా బ్యాంక్–750, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–2000, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్–260, పంజాబ్ నేషనల్ బ్యాంక్–200, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్–360.
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్ రాతపరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **ప్రిలిమ్స్:** రాత పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్(30 ప్రశ్నలు–30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(35 ప్రశ్నలు–35 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ(35 ప్రశ్నలు–35 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్/హిందీ. పరీక్ష సమయం 60 నిమిషాలు.
» **మెయిన్ ఎగ్జామినేషన్:** మొత్తం 155 ప్రశ్నలతో 200 మార్కులకు ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష జరుగుతుంది. ఆ తర్వాత డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(45 ప్రశ్నలు–60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు–40 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(35 ప్రశ్నలు–40 మార్కులు), డేటా అనాలసిస్–ఇంటర్‌ప్రిటేషన్(35 ప్రశ్నలు –60 మార్కులు) నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్/హిందీ. పరీక్షసమయం 3 గంటలు.
» ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో లెటర్ రైటింగ్–ఎస్సే 25 మార్కులకు రెండు ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్. పరీక్ష సమయం 30 నిమిషాలు.
» **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.
» **తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పరీక్ష కేంద్రాలు:** గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 21.08.2024.
» **ప్రిలిమినరీ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** అక్టోబర్ 2024.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** అక్టోబర్ 2024.
» **ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్:** నవంబర్ 2024.
» **ఇంటర్వ్యూలు:** జనవరి/ఫిబ్రవరి 2025.
» **తుది నియామకాలు:** ఏప్రిల్ 2025.
» **వెబ్‌సైట్:** https://www.ibps.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 115 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్)లో అటామిక్ ఎనర్జీ విభాగంలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 115.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్–20, టెక్నికల్ ఆఫీసర్–53, జూనియర్ టెక్నీషియన్(గ్రేడ్–2/జూనియర్ టెక్నీషియన్–42).
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు రూ.40,000 నుంచి రూ.55,000, టెక్నికల్ ఆఫీసర్ పోస్టుకు రూ.25,000 నుంచి రూ.31,000, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.22,528 నుంచి రూ.27,258.
» **వయసు:** పోస్టును అనుసరించి ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు 33 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్‌కు, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ, మెరిట్ లిస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 29.07.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.08.2024
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

స్టెనోగ్రాఫర్ కొలువుల పిలుపు

సర్కారీ కొలువు.. ఎక్కువ మంది స్వప్నం! పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణుల వరకు.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతూ.. ఆయా నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి!! ఇలాంటి తరుణంలో.. ఇంటర్మీడియెట్ అర్హతతోనే.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువు దీరే అవకాశం స్వాగతం పలుకుతోంది!! స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన స్టెనోగ్రాఫర్ నియామక ప్రకటన ద్వారా గ్రేడ్–సి, గ్రేడ్–డి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ నోటిఫికేషన్ వివరాలు,ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» 2,006 స్టెనోగ్రాఫర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
» స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి హోదాల్లో కొలువులు
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లో ప్రతిభతో నియామకం
» ఇంటర్మీడియెట్ అర్హతతోనే పోటీ పడే అవకాశం



ఎస్ఎస్‌సీ జాబ్స్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం–కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో మొత్తం 2,006 స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టులను స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి పేరుతో వర్గీకరించారు. వీటికి ఎలాంటి టైప్ రైటింగ్ సర్టిఫికెట్లు అవసరం లేకుండా.. షార్ట్ హ్యాండ్ నైపుణ్యం అవసరం లేకున్నా పోటీ పడే అవకాశం ఉంది. ఎంపిక ప్రక్రియలో నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో..కంప్యూటర్ టైపింగ్, డిక్టేషన్‌ను నోట్ చేసుకోవడం వంటి నైపుణ్యాలను పరిశీలిస్తారు.

అర్హతలు

ఆగస్ట్ 17, 2024 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

- గ్రేడ్–సి స్టెనోగ్రాఫర్: 2024, ఆగస్ట్ 1 నాటికి 18–30 ఏళ్లు(ఆగస్ట్ 2, 1994– ఆగస్ట్ 1, 2006 మధ్యలో జన్మించి ఉండాలి).
- గ్రేడ్–డి స్టెనోగ్రాఫర్: 2024, ఆగస్ట్ 1 నాటికి 18–27 ఏళ్లు(ఆగస్ట్ 2, 1997 – ఆగస్ట్ 1, 2006 మధ్యలో జన్మించి ఉండాలి).
- గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున సడలింపు లభిస్తుంది.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్–సి, గ్రేడ్–డి పోస్టుల భర్తీ ప్రక్రియను రెండు దశలుగా నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్.

తొలి దశ రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలి దశలో రాత పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయించారు. తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

రెండో దశ స్కిల్ టెస్ట్

- రాత పరీక్ష తర్వాత దశలో స్కిల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్టెనోగ్రఫీ టెస్ట్ నిర్వహిస్తారు.
- ఇంగ్లిష్ భాషలో నిమిషానికి 100 పదాలు, హిందీ భాషలో నిమిషానికి 80 పదాలు ప్రాతిపదికగా డిక్టేషన్ ఇస్తారు. అభ్యర్థులు ఆ డిక్టేషన్‌ను నోట్ చేసుకుని.. దాన్ని కంప్యూటర్‌పై క్షుణ్నంగా టైప్ చేయాల్సి ఉంటుంది.
- ఇంగ్లిష్ కంప్యూటర్ టైపింగ్‌కు సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి పోస్టుల అభ్యర్థులు 50 నిమిషాల్లో, గ్రేడ్–సి పోస్టుల అభ్యర్థులు 40 నిమిషాల్లో సదరు డిక్టేషన్ టైపింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- హిందీకి సంబంధించి స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి అభ్యర్థులు 65 నిమిషాల్లో, గ్రేడ్–సి అభ్యర్థులు 55 నిమిషాల్లో..డిక్టేషన్‌ను కంప్యూటర్ టైపింగ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ భాష ప్రాధాన్యాన్ని పేర్కొనాల్సి ఉంటుంది.

రాత పరీక్షలో మెరిట్‌తో

తుది నియామకాలు ఖరారు చేసే క్రమంలో రాత పరీక్షలో పొందిన ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటారు. స్కిల్ టెస్ట్‌లోనూ నిర్దేశిత మార్కుల విధానాన్ని అనుసరిస్తారు. ఈ రెండింటినీ క్రోడీకరించి తుది జాబితా రూపొందించి.. నియామకాలు ఖరారు చేస్తారు.

గెజిటెడ్ హోదాకు చేరుకునే అవకాశం

స్టెనో గ్రాఫర్ గ్రేడ్–సి(గ్రూప్–బి నాన్ గెజిటెడ్), స్టెనోగ్రాఫర్ గ్రేడ్–డి(గ్రూప్–సి) పోస్టులకు ఎంపికైన వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా గెజిటెడ్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఆయా శాఖల్లో సూపరింటెండెంట్ స్థాయి వరకు పదోన్నతులు లభిస్తాయి. ప్రారంభంలో గ్రేడ్–సి ఉద్యోగులకు రూ.9300– రూ.34,800 వేతన శ్రేణి, గ్రేడ్–డి ఉద్యోగులకు రూ.5,200–రూ.20,200 వేతన శ్రేణితో నెల వేతనం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఆగస్ట్ 17.
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2024, ఆగస్ట్ 27, 28 తేదీల్లో.
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** అక్టోబర్/నవంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

రాత పరీక్ష రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు.. వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా సిరీస్ (నంబర్/ఆల్ఫా న్యుమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్‌మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్స్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్ డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలను ప్రాక్టీస్ చేయాలి. త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ అవేర్‌నెస్

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను ప్రత్యేకంగా చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించడం మేలు చేస్తుంది.

సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలపై పట్టు సాధించాలి. స్టాక్ జీకేకు సంబంధించి చరిత్రలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు, వాటి తీర్మానాలు, అవార్డులు–విజేతలు వంటి సమాచారంపై అవగాహన పెంచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్–ఇన్ డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కాంప్రహెన్షన్‌కు సంబంధించి పేరాగ్రాఫ్ రీడింగ్‌పై దృష్టిపెట్టాలి. దినపత్రికలోని ఎడిటోరియల్స్, ఆయా ముఖ్యాంశాలతో కూడిన వ్యాసాలను చదవాలి. వీటి సారాంశాన్ని సొంతంగా రాసుకుని.. ప్రశ్నలు అడిగే వీలున్న అంశాలను గుర్తించాలి.

స్కిల్ టెస్ట్

ఎంపిక ప్రక్రియలోని రెండో దశ స్కిల్ టెస్ట్‌కు కూడా సన్నద్ధత పొందాలి. ఇందుకోసం ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ప్రాక్టీస్ చేయాలి. ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వ్యాఖ్యానాలను పది నిమిషాల్లో రాసుకుని.. వాటిని పరీక్షకు నిర్దేశించిన సమయంలో టైప్ చేయడాన్ని ప్రాక్టీస్ చేయాలి. ఇలా మొదటి నుంచే ప్రాక్టీస్ చేస్తే.. స్కిల్ టెస్ట్ సమయానికి పూర్తి సంసిద్ధత లభిస్తుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
886	293
80,982	24,718

విదేశీ సూచీలు

నాస్‌డాక్	16,776	▽	418
డోజోన్స్	39,737	▽	611
ఎఫ్‌టీఎస్ఈ 100	8,175	▽	109
డాక్స్	17,661	▽	422
షాంఘై	2,905	▽	27
నికాయ్	35,910	▽	2,217

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.36	108.95
€	యూరో	ఎస్‌బీఐ	89.54	91.45
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.53	55.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.45	65.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.62
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.72	12.45

ఇల్లు అమ్మితే పన్ను భారం!



- ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగింపు
- మూలధన లాభాల పన్ను తగ్గింపు
- దీంతో అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి
- ధరలు గణనీయంగా పెరిగితేనే అనుకూలం
- అన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయం

సొంతిల్లు.. చాలా మందికి జీవితకాల కష్టార్జితం. అలాంటి సొంతింటిని అవసరార్థమై విక్రయించినప్పుడు వచ్చిన లాభంపై పన్ను చెల్లించాలన్న విషయం ఎంత మందికి తెలుసు? మరీ ముఖ్యంగా ఇటీవలి బడ్జెట్‌లో చేసిన తాజా ప్రతిపాదన ప్రకారమైతే.. ఈ పన్ను మరింత చెల్లించాల్సి రావచ్చు. దీర్ఘకాల మూలధన లాభాల పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించడం సానుకూల నిర్ణయమేగా అని అనుకోవచ్చు. కానీ, ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించారు. దీని కారణంగా నికరంగా చెల్లించాల్సిన పన్ను గణనీయంగా పెరగనుంది. అసలు ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగింపు ఎవరికి అనుకూలం? తాజా పన్ను ప్రతిపాదన ఎవరికి లాభం..? తమపై పడే భారం ఎంత..? నిపుణుల విశ్లేషణ ఆధారంగా ఈ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇప్పటి వరకు..

ప్రాపర్టీ (ఇల్లు లేదా ఇంటి స్థలం/గ్రామీణ వ్యవసాయ భూమి కాకుండా)ని క్యాపిటల్ అస్సెట్‌గా ఆదాయపన్ను చట్టం చెబుతోంది. కనుక ప్రాపర్టీ విక్రయం మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తుంది. కొనుగోలు చేసిన రెండేళ్ల తర్వాత విక్రయించిన సందర్భాల్లో అది దీర్ఘకాల మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తుంది. వచ్చిన లాభంపై లోగడ (జూలై 23కు ముందు) 20% పన్ను అమలు చేసేవారు. కరెన్సీ విలువను ఏటా కొంత శాతం చొప్పున ద్రవ్యోల్బణం హరిస్తుందని తెలుసు. ఈ ద్రవ్యోల్బణాన్ని ప్రాపర్టీ కొనుగోలు ధరతో సర్దుబాటు చేసే వారు. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్‌గా చెబుతారు. ఉదాహరణకు 6% ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు రూ.100 విలువ ఏడాది తర్వాత రూ.94గా మారుతుంది. పేరుకు మన దగ్గర రూ.100 ఉంటుంది. కానీ, దాని అసలు విలువ రూ.94. ఇదే మాదిరి రూ.100 పెట్టి కొనుగోలు చేసిన ప్రాపర్టీ.. అసలు కొనుగోలు ధర ఏడాది తర్వాత ఇండెక్సేషన్‌తో కలిపితే రూ.106గా మారుతుంది. పాత విధానంలో ప్రాపర్టీ అసలు కొనుగోలు ధర ఇండెక్సేషన్ ప్రయోజనంతో గణనీయంగా పెరిగేది. దీంతో నికరంగా చెల్లించే పన్ను తక్కువగా ఉండేది. ఆదాయపన్ను శాఖ ఏటా ద్రవ్యోల్బణం సర్దుబాటు ఆధారంగా కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ/ద్రవ్యోల్బణ వ్యయ సూచీ)ను ఖరారు చేస్తుంది. దీన్ని కేంద్ర ప్రభుత్వం గెజిట్ ద్వారా విడుదల చేస్తుంది. దీన్ని ప్రామాణికంగా తీసుకునేవారు. ఇప్పుడు ప్రాపర్టీకి ఈ ప్రయోజనాన్ని తొలగించారు. ఇది మెజారిటీ ఇంటి యజమానులకు నిజంగా మేలు చేస్తుందని కేంద్రం చెబుతోంది. కానీ, నిపుణులు మాత్రం తాజా సవరణలతో పన్ను భారం పెరుగుతుందని గణాంకాల సహితంగా వివరిస్తున్నారు. ప్రాపర్టీ కొనుగోలు చేసిన రెండేళ్లలోపు విక్రయిస్తే అది స్వల్పకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. ఈ మొత్తం తమ ఆదాయానికి కలిపి పన్ను రిటర్నుల్లో చూపించాలి. ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. వ్యవసాయ భూమి క్యాపిటల్ అస్సెట్ కాదు కనుక దీని విక్రయంపై మూలధన లాభాల పన్ను వర్తించదు.

ఎవరికి ప్రయోజనం?



జూలై 23 ముందు వరకు ఉన్న ఇండెక్సేషన్ ఆధారిత దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధానంతో అందరికీ ప్రయోజనం ఉండేది. కరెన్సీ విలువ క్షీణత ప్రభావం తీసివేసిన తర్వాత మిగిలిందే అసలైన లాభం కనుక, దానిపై పన్ను చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు నూతన విధానంతో మెజారిటీ యజమానులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ద్రవ్యోల్బణం రేటుకు మించి ప్రాపర్టీ ధరలు గణనీయంగా పెరిగినప్పుడే నష్టం లేకుండా ఉంటుంది. కొనుగోలు నుంచి విక్రయించే మధ్యకాలంలో ధరల్లో పెద్దగా వృద్ధి పెద్దగా లేకపోతే నష్టమే. ఏటా ప్రాపర్టీ ధరలు 9 శాతంలోపే వృద్ధి చెందితే నష్టపోవాల్సి వస్తుంది. కనీసం 10 శాతం, అంతకంటే ఎక్కువ పెరిగితేనే కొత్త విధానంతో లాభపడొచ్చు. 2013 మార్చి నుంచి 2024 మార్చి మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 36 పట్టణాల్లో ప్రాపర్టీ ధరలు సగటున 5.11 శాతం చొప్పునే పెరిగినట్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ 'రెసిడెక్స్' స్పష్టం చేస్తోంది. ఈ కాలంలో ఒక్క హైదరాబాద్‌లోనే ఇది 8.56 శాతం సీఏజీఆర్‌గా ఉంది. దీర్ఘకాలంలో రియల్ ఎస్టేట్ రాబడులు 12–16 శాతం (వార్షిక) మధ్య ఉంటున్నాయని, కనుక నూతన విధానం లాభదాయకమని ప్రభుత్వం అంటుంటే.. అన్ని ప్రాంతాల్లోనూ ఆ విధమైన ధరల వృద్ధి లేదంటూ నిపుణులు తోసిపుచ్చుతున్నారు. ఆర్‌బీఐ హౌసింగ్ ప్రైజింగ్ ఇండెక్స్‌ను చూసినా ప్రముఖ పట్టణాల్లో గడిచిన దశాబ్ద కాలంలో ధరల వృద్ధి 1–9 శాతం మధ్యే ఉన్నట్టు తెలుస్తోంది.

ధరలు ఏటా 4 శాతం చొప్పున పెరిగితే..

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్(సీఐఐ)	113	148	240	289
ఏటా 4 శాతం వృద్ధితో ప్రాపర్టీ విక్రయ ధర	10.96లక్షలు	27.01లక్షలు	37లక్షలు	60.83లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06లక్షలు	36.79లక్షలు	37.81లక్షలు	62.80లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	మైనస్ 5.10లక్షలు	మైనస్ 9.78లక్షలు	మైనస్ 80,639	మైనస్ 1.97లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	0	0	0	0
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	5.96 లక్షలు	12.01 లక్షలు	12 లక్షలు	10.83 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం) (రూ..లో)	74,445	1.50 లక్షలు	1.50 లక్షలు	1.35 లక్షలు
కొత్త విధానంలో ఆదా	మైనస్ 74,445	మైనస్ 1.50 లక్షలు	మైనస్ 1.50 లక్షలు	మైనస్ 1.35 లక్షలు

నోట్: మైనస్ అంటే నికరంగా నష్టపోతున్నదని అర్థం.

ధరలు ఏటా 8 శాతం చొప్పున పెరిగితే

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ)	113	148	240	289
ఏటా 8 శాతం వృద్ధితో ప్రాపర్టీ విక్రయ ధర	23.30 లక్షలు	47.58 లక్షలు	53.97 లక్షలు	73.47 లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06 లక్షలు	36.79 లక్షలు	37.81 లక్షలు	62.80 లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	7.24 లక్షలు	10.79 లక్షలు	16.16 లక్షలు	10.67 లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	1.45 లక్షలు	2.16 లక్షలు	3.23 లక్షలు	2.13 లక్షలు
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	18.30 లక్షలు	32.58 లక్షలు	28.97 లక్షలు	23.47 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం)	2.29 లక్షలు	4.07 లక్షలు	3.62 లక్షలు	2.93 లక్షలు
కొత్త విధానంలో పన్ను ఆదా	మైనస్ 83,953	మైనస్ 1.91 లక్షలు	మైనస్ 38,951	మైనస్ 80,057

ప్రాపర్టీ ధరలు ఏటా 12 శాతం చొప్పున పెరిగితే

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్(సీఐఐ)	113	148	240	289
ఏటా 12 శాతం వృద్ధితో ప్రస్తుత విక్రయ ధర	48.23 లక్షలు	82.10 లక్షలు	77.65 లక్షలు	88.12 లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06 లక్షలు	36.79 లక్షలు	37.81 లక్షలు	62.80 లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	32.17 లక్షలు	45.31 లక్షలు	39.83 లక్షలు	25.31 లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	6.43 లక్షలు	9.06 లక్షలు	7.97 లక్షలు	5.06 లక్షలు
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	43.23 లక్షలు	67.10 లక్షలు	52.64 లక్షలు	38.12 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం)	5.40 లక్షలు	8.39 లక్షలు	6.58 లక్షలు	4.76 లక్షలు
కొత్త విధానంలో పన్ను ఆదా	1.03 లక్షలు	67,465	1.39 లక్షలు	29,823

కొన్ని ఉదాహరణలు చూద్దాం...



- 2009లో ప్రాపర్టీని రూ.15లక్షలు పెట్టి కొన్నారని అనుకుందాం. ఏటా ధర 4% చొప్పున పెరిగింది. దీంతో ప్రస్తుత విక్రయ ధర రూ.27 లక్షలు అవుతుంది. కానీ, ఇండెక్సేషన్ సర్దుబాటుతో కొనుగోలు ధర రూ.36.79 లక్షలుగా మారుతుంది. అంటే 2009లో కొనుగోలుకు వెచ్చించిన రూ.15 లక్షలకు ఏటా ఇండెక్సేషన్ ప్రభావాన్ని కలిపితే ఈ ధర వస్తుంది. దీంతో పోల్చితే విక్రయించిన ధర తక్కువ కనుక పాత విధానంలో ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడదు. కానీ నూతన విధానంలో 2009 నాటి కొనుగోలు ధరనే ప్రామాణికం. దీంతో రూ.12 లక్షలు లాభం వచ్చినట్టు తేలుతుంది. దీనిపై 12.5% పన్ను కింద రూ.1.5 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ప్రాపర్టీ ధర ద్రవ్యోల్బణం కంటే తక్కువగా పెరగడం వల్ల వాస్తవంగా ఈ కేసులో నష్టం వచ్చినట్టు అర్థం చేసుకోవాలి. అయినా కానీ, కొత్త విధానం పన్ను చెల్లించాల్సిందే.



- 2009లోనే రూ.15 లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్రాపర్టీ ధర ఒకవేళ ఏటా 8% కాంపౌండెడ్ చొప్పున పెరిగితే ప్రస్తుత విక్రయ ధర రూ. 47.58 లక్షలు అవుతుంది. ఇండెక్సేషన్ తో సర్దుబాటు చేస్తే కొనుగోలు ధర రూ.36.79 లక్షలు అవుతుంది. దీంతో పాత విధానంలో నికర లాభం రూ.10.79 లక్షలు అవుతుంది. దీనిపై 20% మూలధన లాభం కింద రూ.2.16 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. కొత్త విధానంలో ఇండెక్సేషన్ లేదు కనుక నికర లాభం రూ.32. 58 లక్షలు అవుతుంది. దీనిపై 12.5% పన్ను కింద రూ. 4.07 లక్షలు చెల్లించాల్సి వస్తుంది.



- 2009లోనే రూ.15లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఇదే ప్రాపర్టీ ధర ఒకవేళ ఏటా 12 శాతం కాంపౌండెడ్ చొప్పున పెరిగితే ప్రస్తుత విక్రయ ధర రూ.82.10 లక్షలు అవుతుంది. ఇండెక్సేషన్‌తో సర్దుబాటు చేసిన తర్వాత వాస్తవ కొనుగోలు ధర రూ.36.79 లక్షలుగా మారుతుంది. దీని ప్రకారం నికర లాభం రూ.45.31 లక్షలు అవుతుంది. దీనిపై 20 శాతం పన్ను కింద 9.06 లక్షలు చెల్లించాలి. అదే ఇండెక్సేషన్ లేకుండా చూస్తే నికర మూలధన లాభం రూ.67.10 లక్షలు అవుతుంది. దీనిపై 12.5 శాతం పన్ను కింద రూ.8.39 లక్షలు చెల్లించాలి. కొత్త విధానం కారణంగా ఈ కేసులో రూ.67 వేలు ఆదా అవుతోంది.

వివిధ పట్టణాల్లో ధరల వృద్ధి

నిజానికి గడిచిన ఐదేళ్లలో ప్రముఖ పట్టణాల్లో ఇళ్ల ధరల పెరుగుదల 10 శాతంలోపే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ మినహా ఇతర ప్రముఖ పట్టణాల్లో ధరల వృద్ధి 9 శాతంలోపే ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఐదేళ్ల క్రితం ప్రాపర్టీలు కొనుగోలు చేసిన వారిపై కొత్త పన్ను విధానం కారణంగా ఎక్కువ ప్రభావం పడనుంది.

పట్టణం	ఇంటి ధర చ.అ. (రూ.లో) 2024 జనవరి-మార్చి	గత ఐదు ఆర్థిక సం.ల్లో సీఏజీఆర్ పెరుగుదల (శాతంలో)
హైదరాబాద్	11,323	10
ఎన్‌సీఆర్	9,757	9
బెంగళూరు	10,377	7
అహ్మదాబాద్	7,176	6
కోల్‌కతా	7,727	5
పుణె	9,448	5
చెన్నై	7,710	2
ముంబై ఎంఎంఆర్	20,361	1
దేశవ్యాప్తంగా సగటు	10,485	5

నోట్: ప్రైస్ ఫోరాస్, కొలియర్స్ నివేదిక ఆధారంగా ఈ ధరలు.

పన్ను తగ్గించుకునే మార్గం..?

ఇంటి విక్రయంపై దీర్ఘకాల మూలధన లాభం వస్తే.. అంతేసి పన్ను చెల్లించడం వల్ల మిగిలేదేమీ లేదని భావపడక్కర్లేదు. పన్ను భారం తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఇందుకోసం మెరుగైన ఆప్షన్ తిరిగి ఇంటిని కొనుగోలు చేయడమే. ప్రాపర్టీ విక్రయం ద్వారా వచ్చిన మూలధన లాభంతో రెండేళ్లలో తిరిగి ఇల్లు కొనుగోలు చేయాలి. ప్రాపర్టీ విక్రయించడానికి ముందు ఏడాది కాలంలో మరో ఇంటిని కొనుగోలు చేసినా కానీ, సెక్షన్ 54 కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కొత్త ఇంటిని నిర్మించుకునేట్టు అయితే అందుకు మూడేళ్ల వ్యవధి ఉంటుంది. ఇలా మరో ఇంటిని కొనుగోలు చేసి పన్ను మినహాయింపు పొందిన వారు.. ఆ ప్రాపర్టీని మూడేళ్లు నిండిన తర్వాతే విక్రయించాలి. లేదంటే గతంలో పొందిన పన్ను మినహాయింపును కోల్పోవాల్సి వస్తుంది. మూలధన లాభం రూ.2 కోట్లకు మించి ఉంటే, పన్ను మినహాయింపునకు కొత్త ఇల్లు ఒక్కటే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మూలధన లాభం రూ.2 కోట్లలోపు ఉంటే రెండు ఇళ్లపై వెచ్చించినా పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒక్కసారి ఈ ప్రయోజనం క్లెయిమ్ చేసుకుంటే, ఇక తర్వాత మరోసారి అవకాశం ఉండదు. సెక్షన్ 54 కింద గరిష్ట పన్ను మినహాయింపు ప్రయోజనం రూ.10 కోట్లు. ఇంతకుమించి మూలధన లాభం ఉంటే దానిపై పన్ను చెల్లించాల్సిందే. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇంటిని విక్రయించడం ద్వారా రూ.15 కోట్ల మూలధన లాభం ఆర్జిస్తే.. తిరిగి మరో ఇల్లు కొనుగోలు లేదా నిర్మాణంపై రూ.10 కోట్లపైనే పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలరు. విక్రయించిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నుల దాఖలులోపు ఇంటిని కొనుగోలు చేయలేకపోతే.. అప్పుడు ఆర్జించిన మూలధన లాభాల మొత్తాన్ని ఎంపిక చేసిన బ్యాంకు శాఖల్లో క్యాపిటల్ గెయిన్స్ స్కీమ్ అకౌంట్ (సీజీఏఎస్)లో డిపాజిట్ చేయాలి. లేదంటే లాభం మొత్తాన్ని క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినా పన్ను లేకుండా చూసుకోవచ్చు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్‌ఎఫ్‌సీ ఈ తరహా బాండ్లను జారీ చేస్తుంటాయి. వీటిపై కూపన్ రేటు 6 శాతంలోపే ఉంటుంది. వీటి కాల వ్యవధి ఐదేళ్లు. ఇంటిని విక్రయించిన తేదీ నుంచి ఆరు నెల్లలోపు ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేయాలన్నది నిబంధన.



నష్టం వస్తే..?

ప్రాపర్టీ విక్రయంపై నష్టం వస్తే ఏంటి పరిస్థితి..? ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. సంబంధిత ఆర్థిక సంవత్సరంలో ఇతర మూలధన లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఒకవేళ ప్రాపర్టీ విక్రయించిన సంవత్సరంలో ఇతర పెట్టుబడి సాధనాలపై ఎలాంటి దీర్ఘకాల మూలధన లాభాలు నమోదు చేయని వారు.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి క్యారీ ఫార్వార్డ్ చేసుకోవచ్చు.

ప్రాపర్టీ కొనుగోలు ధర..?

మెజారిటీ నిపుణుల విశ్లేషణ ప్రకారం ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 48 కింద అసలు కొనుగోలు ధర, చెల్లించిన స్టాంప్ డ్యూటీ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటి కొనుగోలుకు రుణం తీసుకుంటే అందుకు చేసిన వడ్డీ చెల్లింపులు (దీనిపై ఆదాయపన్ను మినహాయింపులు క్లెయిమ్ చేయకపోతేనే) అన్నింటినీ మూలధన లాభం లెక్కింపులోకి పరిగణనలోకి తీసుకుంటారు. "ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి రూ.50 లక్షల ప్రపార్టీని కొనుగోలు చేశారు. దీనిపై రూ.3.5 లక్షలు స్టాంప్ డ్యూటీ కింద చెల్లించారు. ఇందులో రూ.1.5 లక్షలను అదే ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందారు. కొనుగోలుకు రుణం తీసుకోగా, దీనిపై మొత్తం మీద రూ.10 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించారు. ఇందులో రూ.4 లక్షల వడ్డీ చెల్లింపులపైనే సెక్షన్ 24(బీ) కింద పన్ను మినహాయింపు పొందారు. దీంతో అసలు రూ.50 లక్షలు, స్టాంప్ డ్యూటీలో పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయని రూ.2 లక్షలు, గృహ రుణంపై వడ్డీ చెల్లింపుల్లో పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయకుండా మిగిలిన రూ.6 లక్షలు కలిపితే మొత్తం రూ.58 లక్షలను ప్రాపర్టీ కొనుగోలు ధర కింద పరిగణనలోకి తీసుకుంటారు" అని ఖైతాన్ లీగల్‌కు చెందిన జోరావాలా తెలిపారు.

2001 ఏప్రిల్ 1కి ముందు కొనుగోలు చేస్తే..?

ఇంటిని 2001 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత కొనుగోలు చేసిన వారికి వాస్తవ కొనుగోలు వ్యయాన్ని మూలధన లాభాలకు సంబంధించి పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు కొనుగోలు చేసిన వారికి 'గ్రాండ్ ఫాదరింగ్' ప్రావిజన్ అమలవుతుంది. 2001 ఏప్రిల్ 1కి ముందు కొనుగోలు చేసిన కేసుల్లో సహేతుక మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. మరి ఈ సహేతుక మార్కెట్ విలువ అన్న దానికి ఇంకా స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. మార్కెట్ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు మధ్య గతంలో ఎంతో అంతరం ఉండేది. రిజిస్ట్రేషన్ వ్యాల్యూనే పరిగణనలోకి తీసుకుంటే మరింత పన్ను భారం ఎదుర్కోవాల్సి రావచ్చు.

నికర పన్ను పన్ను 14.95 %

దీర్ఘకాల మూలధన లాభంపై 12.5 శాతం పన్నుకు అదనంగా 15 శాతం సర్‌చార్జ్, 4 శాతం సెస్సు కూడా కలిపితే మొత్తం రూ.14.95 శాతం పన్ను కింద చెల్లించాలన్నది గుర్తుంచుకోవాలి.

ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిందే..?

ప్రభుత్వం పన్ను నిబంధనలు మార్చిన నేపథ్యంలో.. పెట్టుబడుల దృష్ట్యా ఇల్లు, స్థలాలను కొనుగోలు చేసే వారు ముందు జాగ్రత్తలు తీసుకోక తప్పదు. ముఖ్యంగా తాము ఇన్వెస్ట్ చేస్తున్న ప్రాంతంలో ధరలు ఏటా కనీసం 10 శాతం, అంతకంటే ఎక్కువ పెరిగినప్పుడే ప్రయోజనం దక్కుతుంది. లేదంటే ఒకవైపు పన్ను భారం, మరోవైపు ద్రవ్యోల్బణ ప్రభావం కలిపి నికరంగా మిగిలేదేమీ ఉండదని నిపుణులు సూచిస్తున్నారు.

ఎప్పుడో కొని ఉంటే పన్ను భారం

10–20 ఏళ్లకు ముందు కొనుగోలు చేసిన వారు తాజా పన్ను ప్రతిపాదనతో ఎక్కువ పన్ను భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే అప్పటి నుంచి ఇప్పటికి ప్రాపర్టీ ధరల్లో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంది. ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగించడం వల్ల మూలధన లాభాలు ఎక్కువగా కనిపిస్తాయి. దీంతో ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక నాన్ మెట్రో పట్టణాల్లో, పల్లెల్లో ప్రాపర్టీ ధరల పెరుగుదల అంతగా లేదు. వీటిని విక్రయించినప్పుడు ద్రవ్యోల్బణ ప్రభావం పోను నికరంగా నష్టమే వస్తుంది. అయినా కానీ, నూతన విధానంలో వీరు పన్ను చెల్లించాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు.

పదేళ్లకు మించితే భారమే...

ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగించడం వల్ల పదేళ్లకు పైగా ప్రాపర్టీలను హోల్డ్ చేసిన వారిపై గణనీయమైన ప్రభావం పడుతుంది. దీనివల్ల పదేళ్లకు మించిన ఆస్తులను విక్రయించే వారు అధిక పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– నిరంజన్ హీరనందాని, నరెడ్కో చైర్మన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-8-2024	
విశాఖ	450–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	450–00
హైదరాబాద్	440–00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఒలింపిక్స్ నేర్పించే పెట్టుబడి పాఠాలు..

బలహీనంగానే మార్కెట్ సెంటిమెంట్

న్యూ ఫండ్ ఆఫర్స్

ఇన్వెస్కో ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఫండ్



ఇన్వెస్కో మ్యుచువల్ ఫండ్ కొత్తగా ఇన్వెస్కో ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ప్రకటించింది. ఈ ఫండ్ ఆఫర్ ఆగస్టు 8తో ముగుస్తుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సిప్ పద్ధతిలో రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. యూనిట్స్ కేటాయించిన 3 నెలల్లోపు వైదొలిగితే 0.50 శాతం ఎగ్జిట్ లోడ్ ఉంటుంది. తయారీ రంగ కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో 80–100 శాతం ఇన్వెస్ట్ చేయడం ద్వారా పెట్టుబడి వృద్ధికి ఈ ఫండ్ తోడ్పడనుంది. వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్లవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియోలో 50–60 స్టాక్స్ ఉంటాయి.

కోటక్ మహీంద్రా నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 ఇండెక్స్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా కోటక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 8తో ముగుస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రాతిపదికన నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ నుంచి టాప్ 50 షేర్లు నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 సూచీలో ఉంటాయి. ఎన్ఎస్ఈ ఎఫ్అండ్‌వో సెగ్మెంట్లో ట్రేడయ్యే వాటికి ప్రాధాన్యం ఇస్తారు. పేరొందిన మిడ్‌క్యాప్ సంస్థల్లో తక్కువ వ్యయాలతో, పారదర్శకంగా ఇన్వెస్ట్ చేయడం ద్వారా ప్రయోజనాలు పొందేందుకు ఈ ఫండ్ ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు.

ఎస్‌బీఐ ఎంఎఫ్ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్



ఇన్నోవేషన్ థీమ్ ఆధారిత సంస్థల్లో ఇన్వెస్ట్ చేసే విధంగా ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ ఆవిష్కరించింది. కొత్త ఆవిష్కరణల వ్యూహాలను అమలు చేయడం ద్వారా ప్రయోజనం పొందే కంపెనీల ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించడం ఈ స్కీము లక్ష్యం. దీనికి నిఫ్టీ 500 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆగస్టు 12తో ముగుస్తుంది. ఇన్నోవేషన్ థీమ్ ఆధారిత సంస్థల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లు ప్రయోజనాలు పొందవచ్చు.

హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ 500 మల్టీక్యాప్ ఇండెక్స్ ఫండ్



హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ కొత్తగా నిఫ్టీ500 మల్టీక్యాప్ 50:25:25 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. నిఫ్టీ500 మల్టీక్యాప్ 50:25:25 ఇండెక్స్‌ను ట్రాక్ చేసే ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 20తో ముగుస్తుంది. ఒకే స్కీము ద్వారా వివిధ మార్కెట్‌క్యాప్‌లవ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసేలా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను ఇది అందిస్తుంది. నిఫ్టీ 500 సూచీలోని లార్జ్ క్యాప్‌లకు 50 శాతం, మిడ్‌క్యాప్.. స్మాల్ క్యాప్‌లకు చెరి 25 శాతం చొప్పున ఇందులో వెయిటేజి ఉంటుంది. వీటిని ప్రతి మూణ్నెల్లకోసారి సవరిస్తారు. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.



ప్రయాణికుల రద్దీలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



జనరల్ బోగీలో కాలు కదపలేని స్థితిలో ప్రయాణికులు



వరంగల్ రైల్వే స్టేషన్: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోని ఓ బోగీలో ఫుట్‌బోర్డుపై ప్రయాణికులు

సాధా'రణ' బోగీ.. కిక్కిరిసి

రెట్టింపు సంఖ్యలో రైళ్లలో ప్రయాణం

- జనరల్ బోగీల్లో నిలవడానికి కూడా స్థలం కరువే
- వాష్‌రూమ్, లగేజీ బెర్త్, ఫుట్‌బోర్డు ఏదీ వదలని వైనం
- ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలో సాధారణ బోగీలకు భారీ డిమాండ్
- దశాబ్దాలుగా పెరగని బోగీలు.. తగ్గిన ప్యాసింజర్ రైళ్లు

గ్రౌండ్ రిపోర్ట్

రైళ్లలో జనరల్ బోగీలు చూడగానే కిక్కిరిసి ఉంటాయి. కూర్చోవడానికే కాదు.. నిల్చోవడానికి కూడా ప్లేస్ ఉండదు. లగేజీ బెర్తు...వాష్‌రూమ్, ఫుట్‌బోర్డు ఇలా ఎక్కడచూసినా ఫుల్ రష్ కనిపిస్తుంది. గంటల తరబడి నిలబడటానికి ఇబ్బంది పడేవారు.. సీట్లలో కూర్చున్న ప్రయాణికుల కాళ్ల వద్ద కూడా కూర్చొనేవారు ఉన్నారు. వాస్తవానికి ఒక్కో జనరల్ బోగీలో కూర్చొని 75 మంది దాకా ప్రయాణించొచ్చు. కానీ ఏ జనరల్ బోగీ చూసినా... అందులో ప్రయాణించే వారి సంఖ్య 150 నుంచి 200 మంది పైనే ఉంటుంది. సికింద్రాబాద్, కాచిగూడ, మహబూబ్‌నగర్, వరంగల్, కామారెడ్డి, కాజీపేట రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికుల సమస్యలను తెలుసుకొనేందుకు 'సాక్షి' క్షేత్రస్థాయిలో పర్యటించింది. ప్రయాణికుల కష్టాలు తెలుసుకుంది.

సాక్షి, హైదరాబాద్/ నెట్‌వర్క్: హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రైళ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా సాధారణ బోగీల సంఖ్య పెంచకపోవడంతో వందలాదిమంది రెండు, మూడు బోగీల్లోనే కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. దానాపూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే కాదు గోదావరి, పద్మావతి, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్, తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తదితర అన్ని రైళ్లలోనూ సాధారణ ప్రయాణికులు నిత్యం నరకం చవిచూస్తున్నారు. మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్లు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడాల్సివస్తోంది. బిహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లక్షలాది మంది కార్మికులు హైదరాబాద్‌లో నిర్మాణరంగంలో పనిచేస్తున్నారు. ఈ కార్మికుల కుటుంబాలు, బంధువులు నిత్యం తమ స్వస్థలాలకు రాకపోకలు సాగిస్తారు. ఈ ప్రయాణికుల డిమాండ్ మేరకు రైళ్లు లేక, అందుబాటులో ఉన్న రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారు.

తగ్గిన ప్యాసింజర్ రైళ్లు

తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైళ్లు బాగా తగ్గుముఖం పట్టాయి. కొన్నింటిని ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చారు. పదేళ్లు దాటినా ఇంటర్‌సిటీ రైళ్ల సంఖ్య పెరగలేదు. దీంతో హైదరాబాద్ నుంచి దూరప్రాంతాలకు బయలుదేరే రైళ్లలోనే సాధారణ బోగీలను ఆశ్రయించాల్సి వస్తోంది. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి ప్రతిరోజు రాకపోకలు సాగిస్తున్న సుమారు 250 రైళ్లలో సుమారు 100 వరకు ప్యాసింజర్ రైళ్లు ఉంటే 150 వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. కానీ 2 లక్షల మందికి పైగా సాధారణ ప్రయాణికులే కావడం గమనార్హం. ప్రస్తుతం 24 బోగీలు ఉన్న ట్రైన్‌లలో 2 నుంచి 3 సాధారణ బోగీలు ఉండగా, 18 బోగీలు ఉన్న రైళ్లలో కేవలం 2 సాధారణ బోగీలే ఉన్నాయి. ప్రయాణికులు మాత్రం వాటి సామర్థ్యానికి రెట్టింపు సంఖ్యలో ఉన్నారు.



సీటు కోసం బోగీ కిటికీ నుంచి ప్రయత్నం

ఎలాగోలా ప్రయాణం

ముంబయి ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినల్ నుంచి సికింద్రాబాద్ మీదుగా భువనేశ్వర్‌కు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు ముందు ఒకటి, వెనుక మరొకటి చొప్పున 2 జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి. కానీ ఒక్కో బోగీలో కనీసం 250 మందికి పైగా ప్రయాణం చేస్తూ కనిపించారు. కొందరు బాత్‌రూమ్ వద్ద కిటకిటలాడుతుండగా, మరికొందరు ఫుట్‌బోర్డుపైన నిండిపోయారు. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంది.

- కాజీపేట, వరంగల్ స్టేషన్‌లలో సాధారణ బోగీల్లో ప్రయాణికుల దుస్థితిని పరిశీలించినప్పుడు, ఒక్క కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోనే కాకుండా ఈస్ట్‌కోస్ట్, సంఘమిత్ర, గోరఖ్‌పూర్, సాయినగర్ షిర్డీ, కృష్ణా, మచిలీపట్నం, గౌతమి, గోదావరి, శాతవాహన, గోల్కొండ, ఇంటర్‌సిటీ, తదితర అన్ని రైళ్లలోను ఇంచుమించు ఇదే పరిస్థితి కనిపించింది.

దక్షిణమధ్య రైల్వేలో రైళ్ల రాకపోకల వివరాలు	
దక్షిణమధ్య రైల్వేలో మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు:	320
ప్యాసింజర్ రైళ్లు:	160
ఎంఎంటీఎస్‌లు:	70
రోజువారీ ప్రయాణికుల సంఖ్య:	10.50 లక్షలు
సాధారణ బోగీల్లో ప్రయాణించేవారు:	5 లక్షలు
సీజనల్ టికెట్‌లపైన ప్రయాణం చేసేవారు:	3 లక్షలు

- కామారెడ్డి మీదుగా ఇటు సికింద్రాబాద్, అటు నాందేడ్, ముంబై, షిరిడీలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ 2 సాధారణ బోగీలు మాత్రమే ఉన్నాయి.
- సికింద్రాబాద్ నుంచి ముంబయికి వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లోని 2 సాధారణ బోగీలు సికింద్రాబాద్‌లోనే కిక్కిరిసిపోతాయి. కానీ మిర్జాపల్లి, అక్కన్నపేటస్టేషన్, కామారెడ్డి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నాందేడ్, ముంబయికి వెళ్లే ప్రయాణికులు దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లోని సాధారణ బోగీలనే ఆశ్రయిస్తారు. దీంతో ఈ ట్రైన్ కామారెడ్డికి వచ్చేసరికి కాలు మోపేందుకు కూడా చోటు ఉండదు. అయినా సరే ముంబయికి ఉపాధి కోసం వెళ్లే కూలీలు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు.

రైళ్ల రద్దుతో పెరుగుతున్న రద్దీ

హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పుష్‌పుల్, ప్యాసింజర్ రైళ్లను తరచు రద్దు చేయడం వల్ల మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైన ఒత్తిడి పెరుగుతోంది. మెయింటెనెన్స్ పనుల పేరిట వారం, పదిరోజుల పాటు రద్దు చేస్తున్నారు. మరోవైపు ఏ ట్రైన్ ఎప్పుడు, ఎందుకు రద్దవుతుందో కూడా తెలియదు. దీంతో రోజువారీ ప్రయాణం చేసే చిరువ్యాపారులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందినవారు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రోలింగ్ కారిడార్ బ్లాక్ పనుల వల్ల సాధారణ రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేయడమే ఇందుకు కారణం. 'ఒక నెలలో పుష్‌పుల్ రైళ్లు 20 రోజులునడిస్తే కనీసం 10 రోజులు రకరకాల కారణాలతో రద్దవుతున్నాయని తాండూరుకు చెందిన శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు కోవిడ్ అనంతరం చాలా వరకు పుష్‌పుల్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చారు. సాధారణ బోగీల సంఖ్యను పెంచకుండా చార్జీలు మాత్రమే పెంచారు.

- మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, తదితర స్టేషన్‌ల నుంచి సుమారు 1000 మందికి పైగా నగరానికి రాకపోకలు సాగిస్తారు. కానీ మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడకు రాకపోకలు సాగించే డెమో ట్రైన్ తరచు రద్దవుతోంది. గంటల తరబడి ఆలస్యంగా నడుస్తోంది. దీంతో ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతకాలంగా 40 నిమిషాలకు పైగా ఆలస్యంగా నడుస్తుందని , దీంతో సకాలంలో హైదరాబాద్‌కు చేరుకోలేకపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.

బోగీలు పెంచడమే పరిష్కారం

అన్ని ప్రధాన రైళ్లలో సాధారణ బోగీలను 2 నుంచి 4కు పెంచనున్నట్టు ఇటీవల రైల్వేశాఖ స్పష్టం చేసింది. కానీ దక్షిణమధ్య రైల్వేలో ఇంకా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలుగైదు రైళ్లలో మాత్రమే బోగీల సంఖ్యను పెంచినట్టు అధికారులు తెలిపారు. జోన్ పరిధిలో సుమారు 320 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ రైళ్లన్నింటిలోనూ సాధారణ బోగీలు పెంచడమే తక్షణ పరిష్కారం.

- అన్ని ప్రధాన రైళ్లలో మహిళల కోసం ఒక ప్రత్యేక బోగీని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కిక్కిరిసిన రైళ్లలో ప్రయాణం మహిళలకు ఎంతో కష్టం. ఈ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

బోగీలు పెంచాలి



ఇరవై ఏళ్లుగా కాంట్రాక్టు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నాను. ఉదయం 9 గంటల వరకు ఉద్యోగంలో ఉండాలి. అందుకే ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ఉండే పుష్‌పుల్ ట్రైన్‌కు వెళ్తాను. ఇది సుమారు 45 నిమిషాల పాటు ఆలస్యంగా వస్తుంది. దీని తర్వాత వచ్చే కాకతీయ ట్రైన్ వేళలు మార్చారు. బోగీల సంఖ్య కూడా తగ్గించారు. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లపైన ఆధారపడాల్సి వస్తోంది. సాధారణ రైళ్లలో బోగీలు పెంచితే చాలు. – సత్తిబాబు, కాంట్రాక్టు రైల్వే ఉద్యోగి, భువనగిరి

డెమో రైలును రైట్‌టైమ్ ప్రకారం నడపాలి



మహబూబ్‌నగర్ డెమో రైలులో ఏడాది నుంచి ప్రయాణం చేస్తున్న. కొద్ది రోజుల నుంచి డెమో ఆలస్యంగా నడుస్తోంది. దీంతో టైమ్ ఆఫీసుకు వెళ్లలేకపోతున్నా. లేట్‌గా వెళ్లిన రోజుల్లో కొన్నిసార్లు సగం జీతమే లెక్కలోకి తీసుకుంటున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి డెమో రైలును టైమ్ ప్రకారం నడపాలి. – ఎం.మహేశ్, ప్రైవేట్ ఉద్యోగి, మర్లు (మహబూబ్‌నగర్)

నాలుగు రోజుల జీతం కట్



కొన్ని రోజుల నుంచి డెమో రైలు ఆలస్యంగా బయలుదేరి వెళుతుండంతో చాలా ఇబ్బందులు పడుతున్నా. నేను పనిచేసే సంస్థకు ఆలస్యంగా వెళుతుండటంతో నెలలో నాలుగు రోజులైన జీతం కట్ చేస్తున్నారు. డెమో రైలును రైట్‌టైమ్‌లో నడిపి మా సమస్యను పరిష్కరించాలి. – శ్రీనివాస్, ప్రైవేట్ ఉద్యోగి, హన్వాడ

'ధరణి'ని ప్రక్షాళన చేస్తాం

రాష్ట్రంలో త్వరలోనే 4.50 లక్షల ఇళ్లు: మంత్రి పొంగులేటి



నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం పల్లె దవాఖానాలో బీపీ చూపించుకుంటున్న పొంగులేటి

నేలకొండపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ధరణిని ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో పర్యటించారు. సీసీ రోడ్లు, పల్లె దవాఖానా ప్రారంభించి బీపీ పరీక్ష చేయించుకున్నారు. సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేసి రైతు పక్షపాత ప్రభుత్వంగా మారిందన్నారు. త్వరలో రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, నీటిపారుదల సంస్థ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, డీఎంహెచ్‌ఓ మాలతి, ఆర్డీఓ గణేష్ తదితరులు ఉన్నారు.

మార్చికి 'యాదాద్రి' పూర్తి చేయాలి

పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరగాలి: డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో వచ్చే ఏడాది మార్చిలో విద్యుదుత్పత్తి చేసేందుకు వీలుగా పనులను సత్వరమే పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సచివాలయంలో ఆదివారం ఆయన రాష్ట్ర ఇంధనశాఖ అధికారులతో సమీక్షించారు. భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో తొలి యూనిట్‌ను అక్టోబర్ 30, రెండో యూనిట్‌ను అక్టోబర్ 15, నాలుగో యూనిట్ డిసెంబర్ 31, మూడో యూనిట్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, ఐదో యూనిట్ వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రాజెక్టు అధికారులు, సిబ్బందికి వైద్యసేవలు అందించడానికి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. దోమల నుంచి రక్షణకు నిద్రించే క్యాంపుల్లో దోమతెరలు సరఫరా చేయాలని, పని ప్రదేశాల్లో ఫాగింగ్ నిర్వహించాలని చెప్పారు. అధికారులు, కార్మికులు స్థానికంగా నివసించేందుకు క్వార్టర్ల నిర్మాణానికి తక్షణమే టెండర్లు పిలవాలని ఆదేశించారు. క్వార్టర్లు నిర్మించే వరకు మిర్యాలగూడ, దామరచర్ల నుంచి సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి బూడిద తరలింపు కోసం తాళ్ల వీరప్పగూడెం నుంచి దామరచర్ల వరకు చేపట్టిన నాలుగు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణంలో ప్రగతిపై వారంలోగా నివేదిక సమర్పించాలన్నారు. ఆగస్టులో తాను ప్లాంటును సందర్శించి, అధికారులు, సిబ్బందితో భేటీ అవుతానని తెలిపారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి రోనాల్డ్‌రాస్, డిస్కంల సీఎండీలు ముషారఫ్, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.



కొమ్మినేని శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న లక్ష్మీపార్వతి, విజయ్‌బాబు తదితరులు

కొమ్మినేనికి ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో ఎన్టీఆర్ ట్రస్ట్, సీతాస్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుకు ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తెలియజేసిన మహనీయుడని పేర్కొన్నారు. పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరిట అవార్డును ఏర్పాటు చేసి జర్నలిస్టులకు అందజేయడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డు తనకు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని కొమ్మినేని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకుడు ప్రసాద్, సీతాస్ ట్రస్ట్ డైరెక్టర్ రాణి, గోపాల్ ,పసుపులేటి ఈశ్వర్, స్వప్న పాల్గొన్నారు.

3 సొర చేపలు @ 240 కేజీలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది సముద్ర తీరంలో జాలర్ల వలకు మూడు భారీ సొర చేపలు చిక్కాయి. ఒక్కోటి 80 కేజీల చొప్పున మూడు 240 కేజీల బరువు తూగాయి. వీటిని రూ.24 వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కోల్‌కతా మార్కెట్‌కు తరలించారు. – సఖినేటిపల్లి





ఈ చిరుత కళ్లు అపురూపం

సాధారణంగా ఏ జంతువుకైనా రెండు కళ్లు ఒకే రంగులో ఉంటాయి. కానీ కర్ణాటక రాష్ట్రం చామరాజనగర జిల్లాలోని బండీపుర అభయారణ్యంలో ఓ చిరుత పులి రెండు రంగుల కనుగుడ్లు కలిగి విచిత్రంగా ఉంది. ఇలాంటి చిరుతలు చాలా అరుదుగా ఉంటాయని రాష్ట్ర వన్యజీవుల ఫొటోగ్రాఫర్ ధ్రువ పాటిల్ తెలిపారు. తన కెమెరాలో బంధించిన ఈ చిరుత అపురూపమైనదని పేర్కొన్నారు. శాస్త్రీయంగా దీనిని హెటిరోక్రోమియా ఇరిడం అని పిలుస్తారని తెలిపారు. –మైసూరు

'ప్రజావాణి' సంగతి ఏమిటి?

- ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? మీ దగ్గర ఉన్న వ్యవస్థ ఏంటి?
- సమీక్షలో అధికారులపై డిప్యూటీ సీఎం భట్టి ప్రశ్నల వర్షం
- అంశాల వారీగా అధికారులకు మార్గదర్శనం
- అవకాశమున్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని ఆదేశాలు
- మూడునెలలకోసారి సమీక్ష నిర్వహిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరిస్తున్నారని, ఈ దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల వద్ద ఉన్న వ్యవస్థ ఏమిటని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల ఉన్నతాధికారుల స్పందనను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆదివారం సచివాలయంలో ప్రజావాణి దరఖాస్తులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డితో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి.. అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు, ఏయే శాఖల వారీగా వచ్చాయి, ఎన్ని పరిష్కరించారన్న దానిపై అధికారులను అడిగారు. ప్రతి దరఖాస్తును పరిష్కరించే క్రమంలో అసలేం జరుగుతుందని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఇందుకు నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్ సమాధానమిస్తూ, తొలుత ఫిర్యాదు రాగానే దరఖాస్తుదారుని మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ పంపుతామని, ఆ తర్వాత పరిష్కారం అయిన వెంటనే ఎస్‌ఎంఎస్ ద్వారానే సమాచారమిస్తామని వెల్లడించారు. అయితే, సదరు దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునే వ్యవస్థ లేదని, ఈ నేపథ్యంలో అలాంటి వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు..

ప్రజావాణిలో భాగంగా కొత్త రేషన్‌కార్డుకోసం దరఖాస్తులు, పింఛన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయని అధికారులు డిప్యూటీ సీఎం భట్టికి వివరించారు. దీనిపై స్పందించిన భట్టి మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందని, త్వరలోనే నిర్ణయం తీసుకుని కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని వెల్లడించారు. కొత్త పింఛన్లను కూడా త్వరలోనే మంజూరు చేసే అవకాశముందన్నారు. మహిళలకు కేవలం కుట్టుమెషీన్లు ఇస్తే సరిపోదని, శిక్షణ కూడా ఇవ్వాలని, ఇందుకోసం అవసరమైతే ఆర్థిక సాయం చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ డెస్కులను బలోపేతం చేయాలని, తద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు. జీరో విద్యుత్ బిల్లులు జారీ చేసే మండలస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామని వెల్లడించారు.



ప్రజావాణిపై సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో చిన్నారెడ్డి

రైతు నుంచి అభినందన లేఖ..

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వీలున్నంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నోడల్ అధికారి దివ్య వెల్లడించారు. తన వ్యవసాయ భూమిలో విద్యుత్ వైర్లు వేలాడుతున్న విషయాన్ని ప్రజావాణి ద్వారా మహబూబ్‌నగర్‌కు చెందిన రైతు ఫిర్యాదు చేయగా, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించామని, ఇందుకు అధికారులను అభినందిస్తూ ఆ రైతు లేఖ రాసిన విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టికి ఆమె వివరించారు.

అవసరమైతే పాలసీ మార్చుకుందాం

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో పరిష్కారానికి అవకాశమున్న ప్రతి ఫిర్యాదును పరిష్కరించాల్సిందేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రభుత్వ విధానాల్లో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే రాతపూర్వకంగా నివేదిస్తే సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి ప్రజావాణి దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రజావాణి విభాగంలో పనిచేసేందుకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని నోడల్ అధికారి దివ్య కోరగా, ఇందుకు స్పందించిన భట్టి తగినవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

షార్క్‌లకే షాకిచ్చే షార్క్..

సముద్రాల్లో షార్క్‌లదే రాజ్యం. వాటికి ఏ జీవి దొరికినా పరపరా నమిలి మింగేస్తాయి. అలాంటి షార్క్‌లలో గ్రేట్ వైట్ షార్క్ జాతికి చెందినవి మరింత పెద్దగా ఉంటాయి. ఈ పెద్ద షార్క్‌లలోనే అతిపెద్దది 'డీప్ బ్లూ'. ఏకంగా 22 ఫీట్ల పొడవు, రెండున్నర టన్నులకు పైగా బరువున్న ఈ షార్క్‌ను.. 2019లో హవాయి సముద్ర తీరంలో మొదటిసారిగా గుర్తించారు. దాని వయసు 50 ఏళ్లకుపైనే ఉంటుందని అంచనా వేశారు. షార్క్ చేపలతో డైవింగ్ చేసే (షార్క్ డైవర్) ఓసియన్ రామ్సే ధైర్యంగా ఈ 'డీప్ బ్లూ'కు దగ్గరగా వెళ్లి వీడియో చిత్రీకరించాడు. తర్వాత కూడా అప్పుడప్పుడూ ఈ షార్క్ చాలా మందికి కనిపించింది. అయితే ఎప్పుడూ ఎవరిపై దాడి చేయలేదు. సాధారణంగా గ్రేట్ వైట్ షార్కులు 30–40 ఏళ్లు జీవిస్తాయి. 15 అడుగుల వరకు పొడవు పెరుగుతాయి. కానీ 'డీప్ బ్లూ' ఏకంగా 22 అడుగుల పొడవు ఉండటం గమనార్హం.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.